

మే
5
విడుదల!
డి.బి.ఎన్.వారి
DBN PRODUCTIONS
పెండ్లిపిలుపు
దర్శకుడు.....ఆమంచర్ల శేషగిరిరావు
రచన..ఆత్రేయ+ఆరుద్ర*పాటలు..శ్రీశ్రీ+ఆరుద్ర
సంగీతం..ప్రసాదరావు*కెమెరా..బుఖ్‌బువే*కళ..కృష్ణారావు
RAMDAS.K
FLOODLIGHT
నిర్మాత....డి.బి.ఎన్.
పూర్ణా రిలీజ్..

మైసూరు - మినర్వా రిలీజు

కార్టూనులు

19—4—61 తేదీ ఆంధ్ర సచిత్ర వార పత్రిక చాలా బాగుంది. ఇందులో కార్టూనులు ప్రత్యేకాకర్షణ. కేరళ మంత్రివర్గము గురించి, ఆంధ్ర కాంగ్రెసువాదులను గూర్చి "పూమెన్" గారి కార్టూనులు, శంకర్‌గారి "ఎప్పుడూ ఇంతే" కార్టూనులు చాలా బాగున్నాయి.

ఎస్. డి. ఎం. వి. ప్రసాదరావు, (బందరు.)

* * *

19—4—61 వారపత్రికలో జి. గణేశ్ (కాకినాడ)గారు తపస్సును గూర్చి వేసిన కార్టూను చాలా బాగుంది. ఆ పత్రికలోనే ఆడవాళ్ళు జడ వేసుకోవటాన్ని చిత్రిస్తూ, నాగరాజుగారు వేసిన కార్టూను కడుపుబ్బ నవ్వించింది.

పి. సత్యక్రిష్ణ, (గుత్తి.)

కథ కాని కథ

మీరు ప్రచురిస్తున్న "కథ కాని కథ"లో ఈమధ్య కొన్ని బాగుండడంలేదు. కొన్ని శీర్షికలు చదువుతూంటే, నిజంగా జరిగిన సంఘటనలేనా! అనిపిస్తుంది. అందులో మీ బహుమతుల నిర్ణయం న్యాయంగాలేదు. కనుక ఇకమీదట మీరు సెలక్షన్ల మీద జాగ్రత్త వహించడం అవసరం.

ఎస్. శ్రీనివాసరావు, (హైదరాబాదు.)

* * *

19—4—61 పత్రికలో ఎం. నారాయణ రావుగారు వ్రాసిన "ఇదీ పెనలమూటే" అను కథకాని కథ" చదివి కడుపుఉబ్బిపోయి సగం చచ్చాం.

పి. సుశీల (తణుకు.)

శిరోజాలంకరణ

19—4—61మా ఆంధ్రసచిత్ర వారపత్రికలో దేవికగారి శిరోజాలంకరణచూచి చాలా ఆనందించితిని. ఈమధ్య వారు వేసిన హేర్ స్టయిల్స్ అన్ని చాలా బాగున్నాయి. దేవికగారికి నా అభినందనములు.

జి. ఎస్. సుమతి, (రాజమండ్రి.)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

ఉత్తరాలు

కథలు

19—4—61 వార పత్రికలో ప్రచురించిన "హాలాహలంలో అమృతభాండం" అను కథ ఈ వారం పత్రికకే మకుటాయమానంగా ఉండి ఒక శోభను తెచ్చి పెట్టింది.

నిజంగా హాలాహలంగాంటి విషాద గాథామయ జీవితాన్ని రచయిత చక్కని సన్నివేశాలతో అతి సహజంగా చిత్రించి, తుదకు మంచి అన్నది ఎచట ఉన్నా స్వీకరణ యోగ్యమేనన్న సందేశంతో కథను అమృతభాండంగా మార్చారు. రచయితకు పత్రిక ద్వారా నా అభినందనలు తెలుపగోరినాను.

జి. వి. రామకృష్ణరావు, (చిత్తూరు)

* * *

12—4—61 తేదీ పత్రికలో "భామిని-బ్రహ్మచారి" కథ చాలా బాగుంది. కథ చదువుతున్నంతసేపు ఎంతనవ్వొచ్చిందో. రచయితకు నాఅభివందనములు. వి. లక్ష్మీకుమారి, (శ్రీకాకుళం.)

* * *

29—3—61 తేదీ ఆంధ్రసచిత్ర వారపత్రికలోని "డికెక్టివ్ లవ్" అనే కథ ఆకర్షణీయంగా, హాస్యభరితంగా ఉంది. రచయితకు నా ధన్యవాదాలు.

గౌరీశంకర్ (కావలి)

ఉత్తరాలు

శ్రీ తుర్లపాటి కృష్ణమూర్తిగారి "డికెషీ లవ్" కథ చాలా బాగుగా నున్నది. సామాన్యముగా ఇటువంటి సంఘటనలు అచ్చటచ్చటా జరుగుతూనే ఉంటాయి. రచయితకు పత్రికద్వారా నా హృదయపూర్వక అభివందనములు అందజేయమని అర్థిస్తున్నాను.

ఎస్. వి. ప్రసాదరావు (తిరుమల)

* * *

5—4—61 ఆంధ్ర తేదీ సచిత్ర వారపత్రిక యందలి 'ప్రత్యక్ష దైవము' కథ చాల హృదయ రంజకముగ నున్నది. నాస్తికులకు కూడ భగవంతునియందు విశ్వాసమును కలుగజేయు ఇట్టి కథను వ్రాసినందులకు రచయితయగు 'రంగధామ్' గారికి నా హృదయ పూర్వక అభివందనములను మా (మీ) పత్రిక ద్వారా తెలుపుచున్నాను.

కె. సీతాదేవి (పుత్తూరు)

* * *

29—3—61 తేదీ పత్రికలో "నేర నిరోధం" కథ చాలా బాగున్నది. దానిలో సబ్‌ఇన్స్‌పెక్టర్ "పార్థసారధి" పాత్రను రచయిత చక్కగా చిత్రించినారు. కథలో చాలమట్టుకు వాస్తవికత ఉట్టిపడుతోంది. రచయిత శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారికి నా ధన్యవాదాలు.

వి. కామేశ్వరి (కురుపాం)

★

ఆంధ్రసచిత్ర వారపత్రిక

★

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితము
1908

★

ముఖ్య సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

★

సంపాదకుడు:
శి. రాధాకృష్ణ

★

సంపుటము ౫౦
సంచిక 34

3-5-61
బుధవారం

ప్లవసం॥ వైశాఖ బ॥ త్రయోదశి

★

విడిప్రతి వెల 25 న. పై.
సంవత్సర చందా 13-0-0

★

ఆంధ్రపత్రిక కార్యాలయము


విషయానుక్రమణిక

ముఖచిత్రం: మహేంద్రా పిక్చర్సువారి
'కృష్ణప్రేమ'లో జమున

కార్టూనులు

ఇండియన్ ఇంకుతో వేసిన కార్టూనులు మాత్రమే స్వీకరిస్తాము. అన్ని చిత్రాలూ ప్రచురిస్తే ఏమాత్రం 'సైజు' వస్తాయో సుమారుగా అంత సైజువేస్తే బాగుంటుంది. సాధారణంగా 4" × 2",


క్యూబా
ఈ పద్ధతి మరీ బాగుంటుంది
ప్రజాస్వామ్యం
పంచాయితీల స్థాయిలో ప్రజాస్వామ్యం
జయప్రకాశ్
ఒరిస్సా అంతర్నాటకం
స్వతంత్ర
పరిషత్



గగనవిహారి గగరిన్, ఆయన భార్య వాలెంటీనా, కుమార్తె లీనా

న్యూఢిల్లీ లేఖ **శ్రీకృష్ణ**


మతసంస్థలతో చెలిమికి కాంగ్రెసు వాదుల ఎదురు: కార్యవర్గం తర్జనభర్జన

కాంగ్రెసు సంస్థను ఇప్పుడొక సమస్య బాధిస్తోంది దాని పేరే మత తత్త్వం కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ సంజీవరెడ్డి ఇటీవల పత్రికా విలేఖర్ల సమావేశంలో ప్రసంగిస్తూ, కాంగ్రెసు తాను పక్షాలతోటి ముఖ్యంగా మత సంస్థలతోటి ఎలాంటి సంబంధం ఉంచుకోదని ఘంటాపథంగా సెలవిచ్చారు అంతేకాదు కాంగ్రెస్ పార్లమెంటరీ పక్షం ఈ నెల ప్రారంభంలో రెండు పార్లు సమావేశమై ఈ మహా సమస్యనే మథించింది కాంగ్రెసేయ ముస్లిములు మత సంస్థలపై నిషేధం అమలు చేయాలని పట్టుగా అడిగారు కూడా

ఇది చాలా చిక్కు సమస్యే అసలు శ్రీ నెహ్రూ ప్రభుత్వం ఏ ప్రాతిపదికమీద ఏర్పడింది ? కేంద్ర మంత్రివర్గంలో ఒక శిక్కునూ, ఒక ముసల్మానూ తప్పనిసరిగా నియమించాల్సిన అవసరం ఏమిటి ? మంత్రివర్గంలో మత వర్గ ప్రాతినిధ్యం అసలు బ్రిటిష్ వారి కాలంలోనే ఏర్పడింది [illegible] పూర్వం రోజుల్లో గవర్నరు జనరల్ కౌన్సిలులో ముగ్గురు భారతీయులు వుంటే ఇద్దరు హిందువులు ఒక మహమ్మదీయుడు ఉండేవాళ్లు లిన్లిత్‌గో ప్రభువు ఇంకో అడుగు ముందుకు వేసి మత వర్గానికి మరికొంత మద్దతిచ్చాడు వారి కౌన్సిల్‌లో అదనంగా ఒక సిక్కు, సర్ జోగిందర్ సింగ్, ఒక దళితజాతి వ్యక్తి డా అంబేద్కర్ కూడా చేరారు 'విభజించి పాలించమన్న' మాత్రానికి ప్రాతిపదిక ఇదే అసలు సరే 1947 లో కాంగ్రెస్ పూర్తి అధికారంలోకి వచ్చిందిగా, మరి కేంద్ర మంత్రివర్గంలో మతప్రాతినిధ్యాన్ని ఎందుకు అంగీకరించినట్లు ? మవులానా ఆజాద్‌కు బదులు మహమ్మద్ ఇబ్రహీంను, సర్దార్ బలదేవ్ సింగ్ స్థానంలో సర్దార్ స్వరణ్‌సింగ్‌నూ తీసుకోటం ఎందుకో ? కుల, మత, వర్గ, వర్ణ వివక్షతారహితమైన సమాజ స్థాపనకు కంకణం కట్టుకున్నా, మత ప్రాతినిధ్యానికి సంబంధించి వంతవరకు మాత్రం పాపం బ్రిటిష్ పద్ధతిచే చక్కగా అమలు జరుపుతోంది కాదు ఒక అడుగు ముందుకు వేసింది ఆఖరికి ప్రమోషన్‌ల విషయంలో కూడా ఈ 'మత' ప్రాతినిధ్యం ప్రవేశించింది కాంగ్రెస్ అధ్యక్షులకు, నిజంగా భారతదేశంలోంచి మత తత్వాన్ని మాటుపెట్టాలనే కోరికే ఉంటే, తమ సలహా సంఘంలోంచే గాక ప్రధాని నెహ్రూ మంత్రివర్గం నుంచి కూడా శ్రీ జగజీవన్‌రాం చేత రాజీనామా చేయించాలి శ్రీ సంజీవరెడ్డి, ప్రధాని నెహ్రూ కూడా తమతమ సంఘాల్లో మంత్రి వర్గాల్లో ఏదో ఒక ప్రత్యేక వర్గం వాడనో, కులం వాడనో భావంతోనో కాక కేవలం యోగ్యతలను బట్టి మాత్రమే స్థానాలు కల్పించాల్సి వుంటుంది.

ఇంక రెండో సమస్య జాతీయ ముస్లిములతోను సిక్కులతోను వస్తోంది ఒకవిధంగా చెప్పాలంటే వీరు సంరక్షిత కట్టడాల లాంటివారు.

(మిగతా 54 వ పేజీలో)



రాగరేఖలు

*** చంద్రం ***

చిన్నప్పటినుండి చదువు చెప్పించి పెద్దచేసినందుకు నీవు మాకిచ్చే ప్రతిఫలం ఇదేనా! అన్నాడు అన్నయ్య. శేఖర్ నిశ్చయం మట్టుకు మారలేదు...

ప్రకృతి ప్రశాంతంగా పవ్వళించింది. ఆకాశం మహాత్ముల హృదయములా, స్వచ్ఛంగా, ప్రశాంతంగా, నిర్మలంగావుంది. పున్నమనాటి నిండు చంద్రుడు వండువెన్నెల్ని కురుపిస్తున్నాడు. ఆకసములోని తారల్ని లెక్కబెడుతూ ఆలోచిస్తున్నాడు శేఖర్. ఎదురుగా వరండాలో పేపర్ను కాబోలు తిద్దుతూంది ఇందిర. అప్రయత్నంగా ఆమెకేసి చూశాడు శేఖర్. ఆమెను చూస్తూవుంటే అతని గత జీవిత స్మృతులు స్మృతిపథంలో మెదిలాయి.

చిన్నప్పుడే తను నాన్న అమరావానికి అమ్మ నాన్న [illegible]

తను కురిపించే వదిన తీర్చారు. చిన్నప్పటినుండి తనకు బీదతనమంటే ఏమిటో తెలియకుండా పెంచాడు అన్నయ్య. తను చిన్నప్పటినుండి చాల చురుకైనవాడని అందరూ అనుకునేవారు. హైస్కూలు చదువుదాక తమ వూరిలోనే గడిచింది కాలేజీలో చదువుదామన్న వెర్రి ఉబలాటం వుండేది ఆ రోజులలో తనకి. వదిన ప్రోద్బలంచేత తన ఇష్టాన్ని కాదనలేక కాలేజీలో చేర్పించాడు తనని అన్నయ్య.

కళ్ళెంలేని గుర్రంలా పరుగిడుతూంది కాలం. కాలేజి చదువులో ఐదవ మైలు రాయి. అవి తను ఎం. ఎస్. సి. మొదటి సంవత్సరం చదువుతున్న

దమకున్న దినాలు ఒక్కొక్కప్పుడు జీవితంలో అనుకోని సంఘటనలు తటస్థపడతాయి. తను వూహించనైనాలేదు. తనకు ఇందిరతో పరిచయమవుతుందని.

ఇందిరకు "నా" అనే వాళ్ళెవరూ లేరు చిన్నప్పుడే గోదావరితల్లి ఆగ్రహానికి ఆహుతైనారు ఇందిర తల్లిదండ్రులు. జీవితంలో చాలా అనుభవాల్ని ఆకళింపు చేసుకుంది ఇందిర.

కాలేజి వార్షికోత్సవ సందర్భంలో పరిచయమైంది ఇందిరకి తనకి. స్వయంకృషిమీద కష్టపడి చదువుకుంటూంది. కుట్లుకుట్లి, ట్యూషను చెప్పుకుంటూ స్కాలరుషిప్పులు సంపాదించుతూ అనర్ఘ్యవరకు వచ్చింది ఇందిర.

ప్రపంచంలో ఓ విచిత్రం. కొందరు వ్యక్తుల్ని మనం చూడగానే ఇష్టం వచ్చుతారు మనకి మరి కొందర్ని చూస్తే ఎందుకో ఏదో ద్వేషభావం రగులుతుంది. దీనికి కారణం ఏమిటో ఎవరికీ తెలియదు. ఏ మానసిక శాస్త్రవేత్త మేధస్సుకూ



ఇందిరతో పరిచయం తనలో ఓ తెలియని ఉత్సాహం కలిగించింది. చదువులో చురుకుదనం, ప్రవర్తనలో నిండుదనం ఎప్పుడూ అమాయకంగా నిండుకుండలా గంభీరంగావుండే ఇందిరఅంటే తనకు చాలా అభిమానం. తనకో రకమైన యిష్టం.

కాలేజి వార్షికోత్సవ సందర్భంలో అయిన పరిచయం పురస్కరించుకొని అప్పుడప్పుడు అడపా దడపా మాట్లాడుకునేవారు తామిద్దరు. ఆ పరిచయం స్నేహంగా మారింది. ఆ స్నేహం ప్రేమగా రూపొందింది. తమిద్దరిమధ్య ఓ ఆకర్షణ ఏర్పరచింది. ఆ స్నేహమే తమిద్దర్ని విడిపోకుండా చేయగలిగింది. సంవత్సరాంత పరీక్షలు అయిపోయాయి. ఆరోజుతో ఎవరి వూళ్ళకు వాళ్ళు వెళ్ళిపోతారు. ఆ సాయంత్రం కాలేజి గార్డెనులో కలుసుకున్నాడు తను ఇందిరను.

"ఇందిరా! నేను రేపు మా వూరికి వెళ్ళిపోతున్నాను."

ఇందిర మొహంలో ఏదో విషాదరేఖ అలుముకుంది, నిశ్శబ్దం పరిపాలించింది కాసేపు తమిద్దరి మధ్య.

"ఏం మాట్లాడవేం ఇందిరా! ఆ మూగనోమేమిటి?" అన్నాడు తను.

"ఏమని మాట్లాడను?" అంది ఇందిర విచ్చిన సందివర్ణనం పువ్వులా తెల్లగా దానిమ్మసందు గింజల్లా మెరిసింది ఆమె పలు వరుస.

"అంత బేలవై పోతావేం ఇందిరా! ఎన్ని రోజులు రెండు నెలలేగా ఈ సెలవుల్లో మా అన్నయ్య వదినెల్ని ఒప్పించి తప్పక మన ఇద్దరి వివాహానికి ఏర్పాటు చేస్తాను" అన్నాడు తను.

"ఏమోనండి మీ వాళ్ళు ఒప్పుకుంటారా మన వివాహానికి నేను మీ కులందాన్ని కానుకదా!" అంది ఇందిర దిగులుగా. అనాదిగా వస్తున్న ఆచారాలు జ్ఞప్తికితెస్తూ.

"నేను చేసుకున్న నిశ్చయము మారదు ఇందిరా! ఎవరు యత్నించినా మారదు నా విషయం. తప్పక నిన్ను పెళ్లాడుతాను ఇందిరా!" అంటూ ఆమె చేతిలో చెయ్యి వేశాడు సూర్యభగవానుడు తమిద్దర్ని సుఖంగా వుండమని ఆశీర్వదిస్తూ, పశ్చిమ లోకాలను పరిపాలించబోయాడు. ఇందిరతో వీడ్కోలిచ్చి తను వూరు చేరుకున్నాడు తను.

ఆ సెలవుల్లో తనకి ఎన్నో సంబంధాలు వచ్చాయి. కట్నం ఎక్కువ యిస్తామని, విదేశాల కంపుతామని, విదేశాల్లో చదివే ఖర్చు తామే భరిస్తామని, పట్నంలో మేడ లిస్తామని ఎన్నో రకాలుగా వచ్చారు. తాను అన్నిటికి మౌనంగానే వున్నాడు. తను ఇందిరకు ద్రోహం చేయలేడు. తన మనస్సు ఎప్పుడో ఇందిరకి అంకితమైపోయింది. తన హృదయంలో ఇందిరకు తప్ప మరెవరికి స్థానం లేదు. ఈ నిశ్చయం ఇక మారదు.

తన అన్నయ్య ప్రాణ స్నేహితు డొకడు తన అన్నగారితో బంధుత్వం కలుపుకుందామని, ఆయన కూతుర్ని తనకు యివ్వడానికి వచ్చాడు. అన్నయ్య తనతో విచారించాడు. "చదువుకున్న పిల్ల, సంప్రదాయంగల కుటుంబము, చక్కని చుక్క, కట్నం ...స్తాడు" ఏమంటావు అన్నాడు అన్నయ్య తనతో.

...కి సంబంధము ఇష్టంలేదు" అని మాత్రం అనగలిగాడు తను. చిన్నప్పటినుండి అన్నయ్య అంటే ఓవిధమైన భయం, గౌరవం వుండటం వలన.

"ఏం! ఎందుకిష్టంలేదు. ఏదో ఆలోచించుకొని చేసుకుంటానన్న నిర్ణయం రేపు చెప్పు" అంటూ ఆయన వెళ్ళిపోయాడు.

తన అన్నయ్యది మొండిపట్టు. తను అన్నదే కావాలన్న రకం. ఇందిర విషయం చెప్పితే ససేమిరా ఒప్పుకోడు అన్నయ్య. ఏం చేయడం అన్న ఆలోచన తనకు. మనస్సు కలవరపడసాగింది. హృదయం కకావికలు కాసాగింది. ఆరాత్రి వదిన ఈ విషయాన్ని తనతో కదిపింది.

"బాబూ! అన్నయ్య చెప్పిన సంబంధం ఎందుకు ఒప్పుకోలేదు. తొందరగా పెళ్లి చేసుకొని నా ఈ ఒక్క కోరిక తీర్చు నాయనా" అంది. చిన్నప్పటినుండి వదిన అంటే తనకో విధమైన చనువు ఆపేక్ష, అప్యాయత, ప్రేమ, అనురాగం ఉండటం వలన ఇందిరతో పరిచయం, ఆమెతో స్నేహం, ఆమెకు ఇచ్చిన మాట అన్నీ చెప్పాడు తను వదినతో.

"కాని బాబూ! ఒకటే కొరత. ఆమె మన కులం కాదు. ఆమెను పెళ్ళి చేసుకుంటే సంఘం మనల్ని వేలెత్తి చూపుతుంది. సంఘంలో మనం తలెత్తుకు తిరుగలేం. పూర్వంనుండి వస్తున్న ఆచారాల్ని, సంప్రదాయాల్ని కాదనటం ఎలాంటి పరిస్థితులకు దారితీస్తాయో నీకు తెలియందికాదు. ఆలోచించు నాయనా" అంది వదిన

కులం లేకుంటే ఏం వదినా! ఆమెకు గుణం వుంది. రూపం వుంది. చదువుకుంది. అదీగాక అన్ని విధాల ఆమె నాకు నచ్చింది. నా హృదయంలో ఆమెకు చోటిచ్చాను. ఆమెను తప్ప మరొకర్ని పెళ్ళాడను. ఎలాగైనా అన్నయ్యను సముదాయించి చెప్పు వదినా" అని ప్రాధేయపడ్డాడు తను.

వదిన మనస్సు కరిగింది. తన విషయం గ్రహించింది. సరే అలాగే మీ అన్నయ్యతో చెప్తాను' అంది వదిన.


ఆరాత్రి అన్నయ్యతో ఈ విషయం కదిపింది వదిన. అన్నయ్య మండిపడ్డాడు. చండశాసనుడయ్యాడు. వెంటనే తన దగ్గరకువచ్చి "ఇదా నీవు చేసే ఘనకార్యం! చిన్నప్పటినుండి చదువు చెప్పించి పెద్ద చేసినందుకు నీవు మా కిచ్చే ప్రతిఫలం" అంటూ తమ కుల గౌరవం, వంశ మర్యాద ఏకరువు పెట్టాడు. తను ఖాయం చేసిన సంబంధం చేసుకోక తప్ప" దన్నాడు అన్నయ్య. తను మాట్లాడక మౌనంగా నిల్చున్నాడు.

"ఏం మాట్లాడవేం" అంటూ మండిపడ్డాడు.

"నా నిశ్చయం ఇక మారదన్నయ్యా. ఒకవేళ వివాహం చేసుకుంటే ఆమెనుతప్ప మరెవ్వరినీ చేసుకోను" అన్నాడు తను.

వదిన ఎన్నో విధాల నచ్చజెప్పింది అన్నయ్యకి. మరిది ఇష్ట ప్రకారమే కానివ్వండి అని బ్రతిమా

(59వ పేజీ చూడండి)



"మగవారికి మాత్రమే"లో అన్నీ అవును లేవచ్చినట్టున్నాయి-
తెగఫోజులు కొడ్తున్నాడు - చూడవే!

-చిత్రకారుడు: బి. జి. వి. నరసింహారావు, (విశాఖపట్నం

కథ కాని కథ

"ఒక్క నయాపైసా"
(మొదటి బహుమతి రు. 10 లు)

మా మిత్రుడొకడికి సబుపూ సందర్భమూ లేకుండా చమత్కారాలు విసరడం అలవాటు. "ఒ ద్దు రా భా యీ చె డి పో తా వు సుమా" అని చెప్పినా వినిపించుకోడు. మొన్న పండగ సెలవులకు మేమంతా మా స్వంతవూరు కొవ్వూరుకు పోతున్నాం. కాసేపటికి బండి రాజమండ్రి స్టేషనులో ఆగింది. మా వాడు చాల హుషారుగా మాట్లాడుతున్న సమయంలో ఒక పాలిష్ కుర్రాడొకడువచ్చి "పాలిష్ వేస్తాను బాబూ" అన్నాడు. మావాడు "అక్కరలేదు" పొమ్మన్నాడు. వాడంత వేగం ఒదులుతాడా!" "అలా కాదు బాబూ! పాలిష్ బాగులేకపోతే ఒక్క నయాపైస యివ్వక్కర లేదు.' వేయించుకు చూడండి" అన్నాడు. అందు మీదట మావాడు పన్నెండు నయా పైసలకు బేరంచేసి పాలిష్ చేయించాడు. ఇంతవరకు కథ సాఫీగా నడిచింది. పాలిష్ పూర్తవగానే కుర్రాడి వైపు చూచి నవ్వుతూ "అబ్బాయ్ పాలిష్ బాగు లేదోయ్. బాగులేకపోతే డబ్బులు యివ్వనక్కరలేదన్నావు మరి వెళ్ళు" అన్నాడు. ఆ పాలిష్ కుర్రాడు తెల్ల ముఖం వేశాడు మేం ఈ తమాషా అంతా చూస్తూ మాట్లాడకుండా కూర్చునాం. పాలిష్ కుర్రాళ్ళంటే చెప్పలేనంత తెలివైన వాళ్ళన్నమాట. అంత వేగం ఓడిపోతారా! ఆ కుర్రాడు మావాడి పక్క కాసేపుచూసి "సరే మిగతా పదకొండు నయా పైసలూ యిలా పడేయండి. పాలిష్ బాగులేకపోతే" అన్నాడు. మురిసిపోతున్న మావాడి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. "అదేమిటి! పాలిష్ బాగులేదుగా" అన్నాడు. ఈసారి కుర్రాడు ధైర్యంగా "అవునండి పాలిష్ బాగులేదు కనుకనే నయా పైసా ఇవ్వక్కర్లేదు. మిగతా పదకొండూ యిచ్చెయ్యండి..త్వరగా.....బెల్ అయిపోయింది" అన్నాడు. మధ్దిమావాడి నాస్థితిలోనుండిలేపడం ఇష్టంలేక మేమే డబ్బు లిచ్చి పంపేశాము. మావాడు మళ్ళీ యీ లోకంలో పడేసరికి, బండి కొవ్వూరు స్టేషన్‌లో కొచ్చిపడింది.

వి. వి. సుబ్బారావు, (విశాఖపట్నం 1.)

* * *

మగవారికి మాత్రమే
(రెండవ బహుమతి రు. 5 లు)

నేనూ, మా రామం, మా చిన్న చెల్లాయి ఆరోజు ప్రక్కనున్న పట్నానికి పోవలసి వచ్చింది. మా చెల్లాయి ఐదో క్లాసు చదువుతోంది. ఆరోజు ఉదయాన్నే లేచి బస్సు ఎక్కాము.

నేను దిన పత్రిక చదువుకుంటున్నాను. ఇంతలో బస్సు ఆగింది. మా రామం నారింజపండ్ల బేరం చేస్తున్నాడు. ఆరోజు శనివారం కావడంచేత అప్పటి కప్పుడే ఆంధ్రపత్రిక వీక్లీ వచ్చేస్తుందని మా చెల్లాయితో "పాపా. నువ్వు వెళ్ళి ఆ వీక్లీ (8—3—61 ది) తీసుకొస్తావా!" అని పాప చేతిలో పావలా పెట్టేడు రామం. చెల్లాయికి వీక్లీలమీదనుండే బొమ్మ లంటే మహా సరదా. పావలా తీసుకొని రివ్వున పోయింది ఎదురుగా ఉండే కిళ్ళీ దుకాణంవైపు.

కాని వెంటనే ఉత్తచేతులతో మొహం వేలేస్కుని మా దగ్గరకు వచ్చేసింది. పత్రిక వీక్లీ తెచ్చావా అంటూ రామం ఆత్రుతతో అడిగాడు. "లేదు" అంది. చిన్నబోయి. ఏమంటే ఆ వార పత్రిక అట్ట మీద "ఆంధ్ర సచిత్ర వార పత్రిక—మగవారికి మాత్రమే" అని వుందట. అందుకని మగవారికేగాని తనకు కిళ్ళీ దుకాణంవాడు అమ్మడేమోనని తిరిగి వచ్చేసిందట. ఆ మాటకు మేము చాలాసేపు నవ్వుకున్నాం. తర్వాత రామం వెళ్ళి అవార పత్రిక కొనుక్కుని వచ్చాడు.

వి. రామారావు, (కాకినాడ.)

* * *

"కృష్ణ తులాభారం"
(రెండవ బహుమతి రు. 5 లు)

మేము "శ్రీకృష తులాభారం" నాటకానికి వెళ్ళాం. నటీ నటులందరూ బహు చక్కగా నటించారు. ఆఖరు సీను వరకూ అద్భుతంగా జరిగింది. "వన్స్‌మోర్ల"తో హాలంతా ప్రతిధ్వనించింది. ఇక రుక్మిణీదేవి శ్రీ కృష్ణుణ్ణి తులసీదళంతో తూచ డం మాత్రం మిగిలింది.

తెర లేపారు. శ్రీ కృష్ణుడు త్రాసులో ఒక వైపు పళ్ళెంలో కూర్చున్నాడు రుక్మిణీదేవి పద్యం చదువుతూ మరో పళ్ళెంలో తులసీదళం వుంచింది. వెంటనే కృష్ణుడు కూర్చున్న పళ్ళెం కాస్త పైకి లేచి అమాంతంగా క్రిందికిదిగి వూరుకుంది. హాలంతా నవ్వులతో, ఈలలతో ప్రతిధ్వనించింది. ఇంతకీ జరిగిందేమంటే తులసీదళంవున్న పళ్ళానికి క్రిందివైపు త్రాడు కట్టి క్రిందికి లాగే ఏర్పాటు చేశారు. బహుశా ఆ తాడు పాతదేమో! కృష్ణుడి బరువుకు అది తెగింది. దాంతో పైకి పోవలసిన కృష్ణుడు పళ్ళెం క్రిందికి దిగింది. ఇది జ్ఞాపకాని కొచ్చినప్పుడల్లా కడుపుబ్బ నవ్వుకుంటాం.

బి. మన్‌మోహన్, (సికింద్రాబాద్.)

* * *

ద్రౌపది ప్రవేశం
(రెండవ బహుమతి రు. 5 లు)

మా క్లాసులో అబ్బాయిలు చాలా మంది వున్నా అమ్మాయి మాత్రం ఒకతే వుంది. రోజూ క్లాసులోకి లెక్చరర్ వచ్చి పాఠం మొదలు పెట్టిన తర్వాత క్లాసులోకి రావటం ఆ అమ్మాయికి అలవాటు.

ఆరోజు తెలుగు క్లాసు. లెక్చరరుగారు హాజరు తీసుకొని "వేనీ సంహారము' నాటకం మొదలు పెట్టి చెవుతున్నారు. ఇంతలో ఆఅమ్మాయివచ్చి వాకిట్లో నుంచుంది. లోపలికి ప్రవేశించటానికి ఇంకా అనుమతి లభించనందువల్ల. మా లెక్చరరుగారు నాటకంలో బాగా లీనమైపోయారేమో చూసీ చూడనట్లు "ఎస్,—గెట్ ఇన్" అని "విరబోసుకొన్న జడతో, అవమాన క్రోధములతో ద్రోపది ప్రవేశించుచున్నది" అని చెప్పారు. మేమంతా ఘొల్లున నవ్వాం. ఏమంటే ఆ అమ్మాయి పేరు కూడ ద్రౌపదే. అదీగాక ఆరోజు తలంటుకొంది గాబోలు, జుట్టుకూడ విరబోసుకొనుంది. మేమంతా నవ్వుతూంటే లెక్చరర్ గూడా పరిస్థితి అర్థం చేసుకొన్న తర్వాత నవ్వకుండా ఉండలేకపోయాడు.

ఎస్. స్వర్ణకుమార్, (కొలకలూరు.)

★

మాటలు

గతవారం శిరోనరములు ముఖ్యంగా నాలుకకు పోయే నరములను గురించి కొద్దిగా తెలుసుకున్నాము. మాటలాడడంలో లోపములు నాలుకలో కండరములు సరిగా పని చేయనందున కావచ్చు. లేక నాలుకను ఏ స్థానంలోవుంచి ఎంత గాలిని లేరింగ్సు (శబ్దపేటిక) ద్వారా బయటికి పంపిన ప్పుడు, లేక పీల్చినప్పుడు ఏ శబ్దం ఉత్పత్తి అవుతుందో తెలియక ఏర్పడవచ్చు. ఈ లోపములు లేకపోయినా, భీతి, నటురువంటి మానసిక కారణములవల్ల శబ్దోత్పత్తికి సంబంధించిన కండరములు నరములు, స్వాధీనం తప్పి యేర్పడవచ్చు అందుచేత నాలుకలో కండరముల సంకోచవ్యాకోచములకు సంబంధించిన నరములు, వాటి మూల కేంద్రములు. అక్కడ ఏర్పడే వ్యాధులవల్ల మాటలలో ఏర్పడే మార్పులూ తెలుసుకోడం చాలా అవసరం.

కంఠము ముందు వైపున లేరింగ్సు (శబ్ద పేటిక) వున్నదని తెలుసుకున్నాము. ఆ లేరింగ్సులోనుంచి గాలి లోపలికి పోయినప్పుడూ, బయటికి వచ్చినప్పుడూ కూడా అక్కడవుండే నిర్మితులు, స్థితిని బట్టి శబ్దోత్పత్తి జరగవచ్చును. ఉచ్వాస నిశ్వాసములు లేనప్పుడు శబ్దోత్పత్తి జరగదు శబ్దోత్పత్తిలేనినాడు మాటలులేవు. మాట ఒక అర్థం కలిగిన శబ్ద సముదాయం. మనకు తేలు అంటే ఒక జంతువిశేషం అని తెలుస్తుంది. కాని ఇది తేలు అని తెలుసుకోటానికి, ఆ తేలును మనం కంటితో చూచివుండాలి. అల్లా మనం చూచిన దానిని తేలు అని మనకు ఇంకొకరు చెప్పివుండాలి. ఆ మాటను మనం విని ఉండాలి. విని జ్ఞాపకం పెట్టుకొని వుంచాలి అప్పుడుగాని మనకు తేలు అన్న మాటకు 'అర్థం' తెలియదు. తేలు అన్నమాట అనడానికి. లేరింగ్సులోనుంచి గాలిని కూడా పంపాలి నాలుకను




నోటిలో ఒకచోట ఉంచాలి. ఈ పై విషయములలో ఏది లోపించినా మాటలాడడంలో లోపాలు ఏర్పడతవి ఆ లోపాలను వైజ్ఞానికంగా అర్థం చేసుకుంటేనేగాని అవి సవరింపదగ్గవో సవరింపదగినవో తెలుసుకోలేము. అనేక ఆశయముల కృషికి ఫలితంగా శబ్దోత్పత్తి జరుగుతున్నది. మాట్లాడడం జీర్ణక్రమంలాగా ఒక స్థానికమైన పనికాదు. వక్షంలో (Thorax) ఉదారంలో (Abdomen) వున్న అనేక కండరములు, వూపిరితిత్తులలో ఉన్న సూక్ష్మకండరములు, వీటికి సంబంధించిన నరములు ఎన్నో పాల్గొన్నందున సంభవించే సంక్లిష్ట శరీర కార్యక్రమము శబ్దోత్పత్తి. దానికి ఫలితమయిన వాక్కు (Speach.)

గతవారం కరోటి (Skull) లో వుండే కేంద్ర నరాశయ భాగములయిన సెరిబ్రము, సెరిబెల్లము, మెడుల్లా అబ్లాంగేటాను గూర్చి తెలుసుకున్నాము. వెన్ను అనేక చిన్న ఎముకలు దండగా జేరితే యేర్పడిన దండ. ఈ చిన్న ఎముకలను మనం వెన్నుపూసలనే అంటాం. ఇంగ్లీషులో వీటిని వెర్టిబ్రే (Vertebrae) అంటారు. వెర్టిబ్రా ఏకవచనము వెర్టిబ్రే బహు వచనము. "వెర్టో" అంటే లేటిన్ భాషలో "నేను తిరుగు" అని అర్థము. తిరగడానికి సహకరించేవి గనక వీటికా పేరు వచ్చింది. వెన్నుపూసల మధ్యన ఏర్పడిన గొట్టంవంటి ఖాళీ ప్రదేశంలోనుంచి వెన్నుపాము (Spinal cord) క్రిందికిపోతుంది. కార్డ్ అంటే గుండ్రంగా, పొడుగ్గావుంటే తాడువంటి నిర్మితి. పాము అటువంటిదే గదా. వెన్నుపాము అన్న మాట ఆనిర్మితిని చక్కగా వర్ణించేమాట. అయితే పాము శరీర పార్శ్వములనుండి ఏ యితర నిర్మితులూ ఏర్పడవు. వెన్నుపాము విషయంలో అల్లా కాదు. కాళ్ళ జెర్రికి పార్శ్వములనుండి సన్నని కాళ్ళు వున్నట్లే వెన్నుపాము పార్శ్వములనుండి స్పైనల్ నరములు ఏర్పడి, కంఠానికి, కాండానికీ చేతులకూ, కాళ్ళకూ పోయి, అక్కడ కండల సంకోచ వ్యాకోచములకూ స్పర్శాది అనుభూతులకూ, గ్లాండుల స్పందనాదులకూ కారణమౌతవి. కాళ్ళ జెర్రికాలు, రెండు భాగముల కలయికతో యేర్పడదు. కాని వెన్నుపామునుంచి వచ్చే నరములు వెన్నుపాము పార్శ్వములో ముందు వైపునుంచి ఒక శాఖ వెనుక వైపునుండి ఒక శాఖగా బయలుదేరి, తరవాత కలుసుకుని, వెన్ను నరములుగా ఏర్పడతవి. స్పైన్ (Spine) అంటే కొనదేరిన, అగ్రవిభేదము. వెన్ను పూసలకు పార్శ్వములలోనూ, వెనుక ప్రక్కన కూడా శల్యాగ్రములు వుంటవి. అందువల్ల వెన్నుపాము "స్పైనల్ కాలం అగ్రపంక్తి అనే పేరు వచ్చింది ఈ కొనలను కలుపుతూ అనేక బలిష్టములయిన కండరములు ఉన్నవి. వీటి సంకోచ వ్యాకోచములవల్లనే మనం కాండమును ఇష్టం వచ్చినట్లు వంచగలుగుతున్నాము. పొట్టను బిగించగలుగుతున్నాము ఈ కండరములు శ్వాసకోశ కార్యక్రమానికి చాలా అవసరము

వెన్నుపాము కర్రలాగా, ఎప్పుడూ నిడువుగా వుండే నిర్మితికాదు. అది నడిచే పాములాగే వంపులతో కూడివుంటుంది. శరీరభాగములనుబట్టి వెన్నును అనేక భాగములుగ విభజించి వాటికి వివిధ నామములు ఏర్పరచారు. వెన్నుపాముకు బయటగా,

1 వ బొమ్మ



1) ముందు గాడి
2) ముందు కొమ్ము
3) మోటారునరం శాఖలు
4) సుషుమ్నా ద్వారం
5) వెనుక గాడి
6, 6₂ 6₃ న్యూక్లియస్‌లు
7) వెనుక కొమ్ము
8) ధవళభాగము


దానిని రెండు ప్రక్కలా దూరంగా ముడులు వేసిన తాడులాగావుండే రెండు నిర్మితులున్నవి వీటికీ, వెన్ను నరములకు అత్యంత సన్నిహితమైన సంబంధం వుంది. వీటికి సెరిబ్రముతో సరాసరి సంబంధం వున్నది. ఈ నిర్మితినుండి పోయే నరములు అనిచ్ఛాధీన కండరముల సంకోచవ్యాకోచనములకు సంబంధించినవి. శాస్త్రంలో వీటికి అత్యంతమయిన ప్రాధాన్యత వున్నది మనవారు శరీరంలో నరాశయమును సమగ్రంగా పరిశీలించి చాలా పరిభాష నిర్మించుకున్నారు. ఆ నామకరణానికీ, ఆధునిక వైజ్ఞానిక నామకరణంలాగే వుంటుంది. ఆ విషయం చర్చించడానికి యిది సందర్భంకాదు.

వెన్నుపూసలలో మొదటిదానిని 'అట్లాసు' అంటారు. క్రింద తిరగలి రాయి యిరుసును ఆధారం చేసుకుని పై తిరగలిరాయి తిరిగినట్లుగా అట్లాసును ఆధారం చేసుకుని తల తిరుగుతూ వుంటుంది.

(1) కంఠ భాగమనీ, (Cervical) (2) ఉదర భాగమనీ (Thoraic) (3) జఘనభాగమనీ, (Lumban) (4) మూలభాగమనీ, (Sacral) (5) వాలభాగమనీ, (coccyx) వెన్నుపామును అయిదు భాగములుగా విభజించవచ్చును.

ఆదిలో వెన్నుపూసలు 33. కాని వయస్కుల్లో శిరస్సునుండి సేక్రందాకావున్న 24 వెన్నుపూసలు ఆరోగ్యస్థితిలో విడివిడిగా వుంటవి. వీటికి మధ్య కార్టిలేజి అనే శల్య ప్రభేదంతో ఏర్పడిన దిండ్లు వంటి నిర్మితులుంటవి. వయస్సుల్లో 25, 26 27, 28 29 వెన్ను కలిసిపోయి, ఒకే శల్య మవుతుంది. దానిని సేక్రము అంటారు. సేక్రెడ్ అంటే "పవిత్రమయిన" అని అర్థము. యోగశాస్త్రంలోనూ, కొన్ని మతములలోనూ యీ శల్యము మహా ముఖ్యమయినది. మిగతా నాలుగు వెన్ను పూసలు కూడా కలిసి, 'కాక్సిక్సు' (coccyx) అనేవాలభాగమవుతుంది. జంతువులలో ఈపూసలు చాలా వుండి తోక అవుతుంది. వెన్నుపామువున్న జంతు శ్రేణిలో (Vertebreta) కోతిజాతి మానవజాతికి అతి సన్నిహితమైనది. కోతి జాతిలో తోక చిన్న దయినకొద్దీ తెలివి తేటలు అధికమవుతవి. "తోక తగ్గించి భగవంతుడు మనిషికి మెదడుగా యేర్పర చాడు" అని ఒక శాస్త్రజ్ఞుడు ఛలోక్తిగా అన్నాడు. తోక పొడుగు వంటిమీద కేసరములు అధికంగా వున్న జంతువులకు నెత్తిమీద జుట్టు అధికంగా వుండదు. జంతువులలో సింహానికీ, మనిషికీ శిరోజములు పుష్కలంగా వుండడం గమనించదగ్గ విషయం.

[ఈ వ్యాసానికి చెందిన కొంత భాగం వచ్చేవారం ప్రచురిస్తాం.] ★



1 సెన్సరీ నరభాగము
2 మోటారు నరభాగము
3 పైరెండు చేరి ఏర్పడిన స్పైనల్ నరము.

గమనిక

డాక్టర్ గాలి బాలసుందరరావుగారికి మా ప్రకటనను అనుసరించి సలహాకోసం, సందేహనివృత్తికోసం ఎందరో ఉత్తరాలు వ్రాస్తున్నారు. తమ చిరునామాలు కలకవర్లు కొందరు మాత్రమే పంపుతున్నారు. కొందరు కార్డులపైన వ్రాస్తున్నారు. కార్డులు పనికి రావని మొదటనే తెలియజేశాము. స్థూలంగా ఉన్న ప్రశ్నలకు మాత్రమే జవాబులు లభిస్తాయని పాఠకులకు మళ్ళీ మనవి చేసుకుంటున్నాము.

—సంపాదకుడు.

విడాకులు : మన సమాజం

పి. గణపతిశాస్త్రి

మన హైందవ సంఘంలో అత్త మామలాగ్రహించినాసరే! కొత్త కోడలయినా పుట్టింటిలోపడి కుళ్ళి కుళ్ళి కుమిలిపోవలసిందే! ఇక కట్టుకున్న భర్తకే కోపం వచ్చిందా! భార్య అథః పాతాళానికివెళ్ళిపోయిందన్నమాటే! పైపైకి ఎన్నెన్ని ధర్మపన్నాలు ఏకరువుపెట్టినా, ఎన్నెన్ని చట్టాలు వచ్చినా ప్రస్తుతం మన సంఘంలో స్త్రీ ఒక క్రీత దాసి. ఆటబొమ్మ! మగవాళ్ళు ఎన్ని తిరుగుళ్ళు తిరిగినా మనం చూసీ చూడనట్టు ఊరుకుంటాం. లోలోపల అభినందిస్తాం. అయ్యో మనకా మాత్రం చొరవలేకపోయిందే అని పశ్చాత్తాపపడడం కూడా కద్దు. కాని—మహిళ లెవరైనా అపరిచితులతో కొంచెం కలిసి కట్టుగా మాట్లాడేసరికి ఎక్కడలేని గుస గుసలు, అవహేళనలు, వెక్కిరింపులు, వేళాకోళాలు బయలు దేరుతాయి. క్రమ క్రమంగా వారి జీవితం దుర్భరమయిపోతుంది. ప్రస్తుతం ఇదీ మన పరిస్థితి!

ప్రాచీన కాలంలో స్త్రీలకిటువంటి విపరీత పరిస్థితులున్నట్టు కనపడడంలేదు. మహాభారతంలో ప్రతిఫలించిన సాంఘికమర్యాద జాగ్రత్తగా పరిశీలిస్తే ఆకాలంలో స్త్రీల పరిస్థితి ఇప్పటికన్న వెయ్యి రెట్లు నయం అని చెప్పవచ్చును. అంతకుపూర్వం ఉపనిషత్కాలంలో స్త్రీలు రాజసభల్లో పురుషులతో సరి సమానంగా వేదాంత చర్చలలో పాల్గొన్నట్టు కనబడుతుంది.

ప్రాచీనులు మహిళలు గృహ దేవతలన్నారు. సరస్వతి, లక్ష్మి, పార్వతి మొదలుగాగల మన దేవతలు పవిత్ర స్త్రీ మూర్తులు! యత్ర నార్య స్తుపూజ్యంతే రంతేతత్రదేవతా:' అన్నాడు మనువు.

అయినా మన స్త్రీలకీ అనూచగౌరవం క్రమ క్రమంగా లోపించడానికేమిటి కారణం! మహమ్మదీయాక్రమణతో మనజాతి చైతన్యం క్షీణించింది. పురుషులే పరదాస్యాల కలవాటు పడినప్పుడు వనితల కదేగతి సంప్రాప్తించడంలో ఆశ్చర్యమేమి ఉన్నది.

ఇంచుమించుగా మహామహుడు రాజారామ మోహనరాయలు మనదేశంలో వీరేశలింగము మొదలయిన ప్రముఖ సంఘ సంస్కర్తలు కొంతమంది అవతరించేవరకు స్త్రీల పరిస్థితి నానాటికి బాగా దిగజారిపోయింది.

ఇటీవల బయలుదేరిన కొన్ని చట్టాలు బాల్య వివాహాలు, బహు భార్యాత్వము నిషేధించాయి. ఆస్తిలో కొంతవరకు స్త్రీలకు భాగస్వామ్యం కల్పించాయి. ఆపైన విడాకుల చట్టం వచ్చింది దీనివల్ల దుస్సహ పరిస్థితుల్లో వివాహితులయిన స్త్రీ స్త్రీ పురుషులకు విడిపోయే హక్కు ఏర్పడింది.

విడాకులు (Divorce) అన్న అధునికార్థంలో ప్రాచీన ధర్మ శాస్త్రాలేవి ఈ సమస్య చర్చించినట్టు కనబడదు. అయితే 'నష్టే మృతే, ప్రవ్రజితే, క్లైబేచ పతితే పతౌ పంచాస్వాపత్సు నారీణాంపతి రనో విధీయతే'

అని పరాశర స్మృతిలో ఒకశ్లోకం కనిపిస్తున్నది. భర్త దేశాంతరాలపాలయి చాలాకాలందాకా జాడ తెలియకపోయినా, చనిపోయినా, సన్యసించినా అసమర్థుడయినా, మతాంతర ప్రవేశంతోగాని దురాచారంవల్లగాని పతితుడయినా స్త్రీ పునర్వివాహం ధర్మసమ్మతమేనని ఈకారిక విస్పష్టంగా విధిస్తున్నది.

ఈ శ్లోకంలో వివాహవిచ్ఛేద సమస్య ప్రత్యక్షంగా చర్చించకపోయినా పరోక్షంగా అంగీకరిస్తున్నట్టున్నది. భర్త పరదేశాలపాలయి జాడ తెలియకపోయినా, సన్యసించినా, అసమర్థుడయినా—అంటే భర్త జీవించి ఉన్నా— ఆకాలంలో స్త్రీ పునర్వివాహం శాస్త్రీయమయినదన్నమాట!

ఆ రోజుల్లో ఈ వ్యవహారానికి సంబంధించిన తతంగం ఏవిధంగా నడిచేదో మన కిప్పుడు స్పష్టంగా తెలియదు. పంచాయతీలలో గ్రామవృద్ధులు, కుల పెద్దలు కలిసి ఈ విధమయిన తగాదాలు పరిష్కరించేవారు కాబోలును.

విడాకుల చట్టం

వివాహంతో చట్టబద్ధమైన బంధాలనేకాక...... సంబంధించిన విషయాలను కూడా ఇంగ్లీషు చట్టం గుర్తిస్తుంది. భార్యా భర్తలకు పరస్పరం ఉండే బాధ్యతలు స్థూలంగా చెప్తుంది. ఒకరిపట్ల ఒకరు ఉదారముగా ప్రవర్తించడానికితోడు ఎంతో కొంత హాయిని కల్గించే బాధ్యత భార్యా భర్తలకు ఉన్నది. ఒకరి నొకరు పోషించే బాధ్యత కూడా ఉన్నది.

వివాహంతో సంబంధాలు చెడినప్పుడు కలిగే సమస్యల పరిష్కారం చట్ట రీత్యా జరుగవచ్చునని పాశ్చాత్యులు ఒప్పుకున్నారు. భార్యా భర్తలు కలిసి ఉండటం దుర్భరమైనప్పుడు (1) విడివడిపోవటంగాని, (2) విడాకులుగాని చట్టం గుర్తిస్తుంది. విడిపోవటంతో భార్యా భర్తలమధ్య సంబంధాలు పూర్తిగా తెగిపోవు. కాని, ఇరువురి మధ్య సంపర్కం ఉండితీర నవసరంలేదు. ఇంతేకాక, వారికి కావలసినప్పుడు పరస్పర సంబంధాలు తిరిగి ప్రారంభించే హక్కు ఉన్నది. కోర్టులో అంతకుముందు విడివడి పొమ్మని ఇచ్చిన తీర్పును ఉపసంహరించమని కోరుకోవచ్చు. భార్యను భరించే బాధ్యత భర్తకి ఉంటుంది. వారసత్వపు హక్కులు ఇద్దరికీ ఉంటాయి. పూర్తిగా విడాకులు పుచ్చుకొన్నప్పుడు, కావలసినప్పుడు తిరిగి కలిసి ఉండడానికి వీలులేదు. పునర్వివాహం అవసరము.

హైందవ వివాహ చట్టం 1955 లో గాని అమలులోకి రాలేదు. దీనికిముందు జరిగిన వివాహాలకి కూడా ఈ చట్టము వర్తిస్తుంది. ఈ చట్టం 'సహాయం' కోరేవారు సరియైన కారణాలను చూపిస్తూ జిల్లా కోర్టుకి అర్జీ పెట్టుకోవాలి.

ఇంగ్లీషు చట్టంలోలాగే (1) విడివడిపోవటం (2) విడాకులు ఈ రెండూ హైందవ చట్టములో గుర్తింపబడ్డాయి.

విడి పడిపోవటం

(ఎ) వదిలి వేయటము : వాది అర్జీ పెట్టుకొనేముందు ప్రతివాది వరుసగా రెండు సంవత్సరాలు తనను వదిలివేసినట్టు ఋజువు చేయగలిగితే సరియైన కారణము చూపించినట్టు అవుతుంది. (నిష్కారణంగా వదిలివేసినప్పుడూ, వాది అనుమతి లేకుండా పరిత్యజించినప్పుడూ, కావాలని వాది విషయమై అశ్రద్ధ చూపినప్పుడూ వదిలి వేసినట్లే నిర్ణయిస్తారు.)

ఒక వ్యక్తి తన భార్యను స్నేహితుల వద్దకు పంపి, తను తరువాత వచ్చి కలుసుకుంటానని రాలేదు. కోర్టువారు ఇతను భార్యను వదిలివేశాడని తీర్మానించారు.

ఉంపుడుకత్తెను ఇంట్లో ఉంచుకొన్నందుకు భార్య భర్తను వదిలి వేయగా అతనే ఆమెను (భార్యను) పరిత్యజించినట్లు కోర్టువారు మరొక సందర్భంలో నిశ్చయించారు.

(బి) హింస : భార్యా భర్తలలో ఎవరిని మరొకరు ఏ విధంగా హింసించినా తగిన కారణముగా నిరూపించవచ్చు. అంటే మాటల ద్వారా భయపెట్టినా చాలునన్న మాట.

ఒక కేసులో ఇంటికి తాగి వచ్చినా, భార్యను ఒకసారి వీధిలో తిట్టి క్రిందకు పడద్రోసినా హింస కాదని కోర్టువారు అన్నారు!

(సి) అస్వస్థత : రెండు సంవత్సరాలకుపైగా సుఖరోగాలు, కుష్ఠు వ్యాధి, పిచ్చి—వీటిలో ఏవిఉన్నా విడివడిపోవడానికి కారణాలు అవుతాయి.

వ్యభిచారం : భార్యాభర్తలు ఒకరి నొకరు వదులుకొనేందుకు వ్యభిచారం కారణంగా చూపించవచ్చు.

విడాకులు

విడాకులు : సెక్షను 13 ప్రకారం ఏ వివాహమైనా విడాకుల ద్వారా రద్దు చేయవచ్చు. ఇదే సెక్షను విడాకులకు అవసరమైన కారణాలు కూడా తెలుపుతుంది.

(ఎ) వ్యభిచారం : ఈ సందర్భంలో చట్టం అంత స్పష్టంగా లేదు. తాత్కాలికమైన వ్యభిచారం సరి

విడి—ఆకులు అన్న మాటే విడాకులయింది. అంటే విడిపోయే స్త్రీ పురుషులు వేరు వేరుగా తాళపత్రాలలో తమ వివాహ విచ్ఛేదం అంగీకరించి అనుమతించి ఉండవచ్చును. అందువల్లనే ఈ పదం ఏర్పడింది. ఈ విడాకులు అన్న పదానికి సమాన మయిన సంస్కృత పదమేది మన పురాతన ధర్మ గ్రంధాలలో కన బడడంలేదు. అంతేకాదు. అగ్రవర్ణాలలో ఈ మర్యాద ఎక్కడ అమలులో ఉన్నట్టు కనబడదు. ఇది ఈనాటికి బాగా క్రింది వర్ణాలలోనే ఎక్కువగా కనిపిస్తున్నది. స్త్రీ పురుషుల సమానత్వంలో అగ్రవర్ణాలలోకన్నా క్రింది వర్ణాలలోనే బాగా విశాల దృష్టి గోచరిస్తున్నది. కొన్ని కొన్ని వర్ణాలలో ఏడు మనువులదాకా స్త్రీలు తిరిగి వివాహమాడవచ్చును. కుల పెద్దలు విధించిన కులతప్పు చెల్లిస్తే వివాహవిచ్ఛేదంసులభంగా సాధ్యపడ తున్నది. దీనికి కారణాలు కొన్ని పేర్కొనవచ్చును. క్రింది వర్ణాలలో స్త్రీ పురుషులు చాలావరకు తమ కాయ కష్టాలమీదే జీవిస్తారు. ఇందువల్లనే వారి వివాహ సంబంధాలు చాలావరకు ప్రాకృతిక సూత్రాలమీదనే ఆధారపడుతున్నాయి.

మన విడాకుల చట్టం

మన శాసనకర్తలు ప్రస్తుతం అమలులోఉన్న విడాకుల చట్టం చాలావరకు బ్రిటిషు సంప్రదాయ పంథాలో నడిపించినట్లు కనిపిస్తున్నది. ఇది కొంత వరకుస్త్రీలకు, పురుషులతోబాటుసమాన మయిన వివాహ విచ్ఛేదాధికారం కల్పిస్తున్న మాటవాస్తవమే.

అయితే అనేకమయిన ఇతర సాంఘిక సమస్యలతో ఈ విడాకుల చట్టానికొక జటిల సంబంధం ఏర్పడి ఉన్నది. వివాహిత అయిన ఒక స్త్రీకి కోర్టులో వివాహ విచ్ఛేదం సులభంగానే అందుబాటులోకి రావచ్చును. కాని ఆస్తిపాస్తులు గాని స్వయంగా ఏదో వృత్తి చేపట్టి జీవించగల శక్తిగాని లేనప్పుడు ఆమె ఎన్నెన్ని విధాల హింసలనుభవిస్తున్నా భర్త చెప్పు చేతల్లోపడి ఉండక తప్పదు. ఇంతకి తేలినదిది. సంపూర్ణమయిన ఆర్థిక స్వాతంత్ర్యము, విద్యావకాశాలు, వివిధ వృత్తులలో ప్రవేశార్హతలు విరివిగా లభించినప్పుడే స్త్రీలకి చట్టాలవల్ల తగినన్ని సౌకర్యాలు సమకూరగలవు. లేకపోతే ఈ శాసనాలు, ఇవి ఉద్దేశించిన ప్రయోజనాలు ఉపన్యాసాలివ్వడానికి మాత్రమే ఉపకరిస్తాయి.

రష్యా, అమెరికా మొదలయిన దేశాలలో వివాహాలకయినా విడాకులకైనా స్త్రీ పురుషులకందరికీ ఇంతకంటె సువిస్తృతమయిన స్వామ్యాలున్నాయి. నిజానికి ఒకరొకరిని అసహ్యించుకొనే స్త్రీ పురుషులనెవ్వరు కలసి మెలిసి ఉండమని శాసించలేరు. ఒక వేళ శాసించినా పరిస్థితులనుబట్టి వారి ప్రవర్తన లింకొకదారి పట్టవచ్చును. ఈవేళ మన సంఘంలో చాటుమాటుగా అయితేనేమి, బాహటంగా అయితేనేమి పై విషయాని కెన్నెన్నో ఉదాహరణలు కనిపిస్తున్నాయి. కనక మనకున్న విడాకుల చట్టం ఇంకా బాగా ఎక్కువగా సవరించి వెయ్యడమే తెలివైన పని. అంతేకాదు! దాని కనుకూలంగా సాంఘిక పరిస్థితుల సంస్కరణలు కూడా త్వరగా జరగాలి. మనకున్న సివిలు మారేజ్ చట్టం ప్రకారం స్త్రీ పురుషులు స్వేచ్ఛగా వివాహమాడవచ్చును, విడిపోవచ్చును. అయితే సంతతి కలిగినప్పుడు వారి సుఖ సంతక్షణకోసం ఏర్పాటులు కొన్ని చేయవలసినదే.

దేశంలోఉన్న జనాభాలో సగంమంది తగినంత ఆర్థిక స్వాతంత్ర్యము, వృత్తి సౌకర్యము, విద్యావకాశాలులేక అజ్ఞాన నిద్రలో మునిగి ఇంటిపట్టు ఖైదీలుగా తయారయినప్పుడు వారి నిస్సహాయ స్థితి, దైన్యము మిగిలిన మగవారిని కూడా కుంగదీసి దిగలాగివెయ్యక మానవు.

వివేకానందస్వామినొకప్పుడు వితంతు వివాహ విషయంలో మీ అభిప్రాయమేమని ప్రశ్నించారట! దాని కాయన ముక్తసరిగా 'నేను వితంతువును కాను !' అని మాత్రమే సమాధానం చెప్పి మాట్లాడకూరుకొన్నాడట !

వితంతువుల సమస్యలు వితంతువులే పరిష్కరించుకోవాలిగాని మధ్యపురుషులెవరు? వీరికి ఈ అధికారం ఎవరిచ్చారు అని స్వామి అభిప్రాయం!

నిజానికి పురుష పుంగవులిలాంటి విషయాలలో తుది నిర్ణయాలు చెయ్యడంకంటె అఖిల భారత మహిళా సంస్థలవంటి స్త్రీ పరిషత్తుల అభిప్రాయాలే అక్షరశః అనుసరించడం న్యాయం!

అంతేకాదు. మహిళల ఎడల సహజమయిన సమాన గౌరవ దృష్టి పెంపొందించుకొన్నప్పుడే ఏ దేశమయినా త్వరిత గతితో పురోగమించగలదు!

కలకంఠి కన్నీరొలికిన సిరి ఇంటనుండనొల్లదు సుమతీ!' అన్న సూక్తికిదే పరమార్థము. ★

య్యైన కారణం కాదనే సూచన ఉన్నట్టు తోస్తుంది విడిపడిపోయేందుకు చాలిన కారణాలు పూర్తి విడాకులకి సరిపోవు.

భర్తనుంచి విడిపోయిన భార్య, తరువాత ఒక బిడ్డతో కలిసి ఉంటున్నట్లు ఒక కేసులో తెలిసింది. కాని ఇది వ్యభిచారాన్ని నిరూపించడానికి చాలలేదు. వ్యభిచారాన్ని తప్ప మరేదీ అనుమానించడానికి అవకాశం లేనప్పుడే సాక్ష్యం చెల్లుతుంది.

మరొక కేసులో ప్రతివాది "కో రెస్పాండెంటును" ఒక గదిలో కలుసుకొనేది. తరువాత ఒక శిశువు కూడా జన్మించింది. కాని వ్యభిచారం జరిగినట్లు ఋజువు కాలేదు.

(బి) అన్యమత స్వీకారం:ప్రతివాది హైందవ మతం వదిలి వేరొక మతం పుచ్చుకొన్నట్లయితే విడాకులకు దారి తీయవచ్చు.

పూర్వము హైందవస్త్రీకి తన భర్త క్రిస్టియను అవుతే విడాకులు ఇవ్వడానికి హక్కు లేకుండా ఉండేది. ఈ చట్టం ఆ లోటును తీర్చింది.

(సి) అస్వస్థత:విడిపడడానికి సరిపోయిన కారణాల్కక్కడ కూడా వర్తిస్తాయి. కాని మూడు సంవత్సరాలు కాల పరిమితిని నిర్ణయించారు. కుదరని వ్యాధులు అయిఉండాలి.

(డి)'సివిల్'(Civil)మరణం : సన్యాసి ఆశ్రమం స్వీకరించినవారు సివిల్ మరణం పొందినవారుగా పరిగణింపబడుతారు.

(ఇ)అదృశ్యము :ఏడు సంవత్సరాలకిపైన ప్రతివాది పత్తా లేకుండా అదృశ్యుడైతే విడాకులు సాధ్యమవుతుంది.

ఎవరైనా ఏడుసంవత్సరాలకు పైగా బంధు మిత్రులకు జాడ తెలియపరచకపోతే వారు మరణించినట్లే పరిగణించబడుతారు.

విడిపడిపోయిన భార్యా భర్తలు రెండు సంవత్సరాల తర్వాత కూడా కలువకపోతే విడాకులు లభ్యమవడానికి వీలు ఉంటుంది.

ఇవే కాకుండా భార్యలకు మట్టుకు ఉన్న హక్కులు: (ఎ) భర్త బలాత్కారం, అసహజమైన లైంగిక వ్యాపారం మొదలైన నేరాలు చేసినప్పుడు భార్య విడాకులు కోరవచ్చు.

(బి) ఒక వ్యక్తికి ఇద్దరు భార్యలు ఉన్నట్లయితే వారిద్దరికి విడాకులు కోరే హక్కు ఉన్నది. అయితే ఇద్దరు భార్యలూ బ్రతికి ఉంటేనే ఇది చెల్లుతుంది.

సెక్షను 14 : మొత్తానికి ఏ విధమైన అర్జీ అయినా వివాహమైన మూడు సంవత్సరాలముందు దాఖలు చేయడానికి వీలులేదు. కాని ప్రత్యేకమైన కారణాలుఉంటే, వ్యవధి లోపలే అర్జీ దాఖలు చేయడానికి కోర్టువారు అనుమతించవచ్చు.

పునర్వివాహం : విడాకులు పుచ్చుకున్న సంవత్సరము తరువాతనే పునర్వివాహం సాధ్యమవుతుంది (సెక్షను 15)

విడాకుల అనంతరము పోషణ : సెక్షను 25

హిందూ వివాహచట్టం ప్రకారం వేరే ఆదాయం లేని భార్యకుగాని, భర్తకుగాని పోషణకోరే హక్కు ఉన్నది. పరిహారం ఒకేసారి మాత్రమేకాక, నెలా నెలా ఇప్పించే అధికారము కోర్టుకి ఉంది.

ఒక కేసులో ధనవంతురాలైన భార్య భర్తను విడాకుల తరువాత పోషించవలసి వచ్చింది.

శిశువులు: సెక్షను 26: మైనరులైన పిల్లలను పోషించే బాధ్యత భార్యా భర్తలలో ఎవరిదో లేక ఇద్దరిదో కోర్టువారు నిర్ణయించవచ్చు.

ఇతర మతాలలో విడాకులు

మహమ్మదీయ ఆచార ప్రకారం వివాహం పరస్పర సేవా ఒప్పందము వంటిది. విడాకులు ఇచ్చే హక్కు భర్తకి మాత్రము పూర్తిగా ఉండేది. కొన్ని సందర్భాలలోనే, విడాకులు పుచ్చుకొనే అధికారము భార్యకి ఉండేది కాని, 1939 లో వచ్చిన మహమ్మదీయ వివాహపు రద్దు చట్టము ప్రకారము భార్యల హక్కులు అధికమైనవి.

పార్శీలకు 1936 లో ఇంగ్లీషు చట్టాన్ని పోలిన విడాకుల చట్టము అమలులోకి వచ్చింది. ★

ఎం. నాగేశ్వరరావు.



శేషగిరిని ఆహ్వానించడంలోనూ, అతనితో మాట్లాడడం లోనూ, ఆమె మొహంలో ద్యోతకమవుతున్న అభిమానం శ్రీహరి కనిపెట్టాడు. కాని ఆ తరువాత జరిగిన సంఘటన......

నాగపూర్ స్టేషనులో గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ ఆగింది. శ్రీహరిరావు బండిలోనుండే స్టేషన్ అంతా కళ్ళతో కలయజూసాడు. ఎక్కడా తెలిసిన మొహాలు కన్పించలేదు. 'వీళ్ళెవరూ రాలేదు కాబోలు!' అనుకొని తనే మెల్లిగా పెట్టే, బెడ్డింగూ పట్టుకొని, ద్వారం దగ్గర బండిలోకి తోసుకు వస్తున్న జనాన్ని బలవంతంమీద నెట్టుకుంటూ బయట పడ్డాడు.

ప్లాట్‌ఫారంమీద సామానుదింపి, కాస్సేపు నిల్చుని ఆలోచించాడు. స్టేషనుకు వస్తారనుకున్న శేషగిరీ, సత్యం ఇద్దరూ రాలేదు. ఈ కొత్త వూళ్ళో, తను వాళ్ళ ఎడ్రసు వెతుక్కుంటూ వెళ్ళాలి. జేబు లోంచి అడ్రసు కాగితం తీసి చదువుకున్నాడు. 'కె యస్. రావు, నెం. 13 గిరిపేట, నాగపూరు' అని వుంది. ముందర తను గేటుదాటి బయటపడితే ఏ రిక్షావాణ్ణో పట్టుకుని ఇల్లు కనుక్కోవచ్చు.

శ్రీహరికి హిందీ కొంచమైనా రాదు. మరాటీ అసలే రాదు ఏదైనా తెలుగు మొహం కనిపిస్తే బావు ణ్ననుకున్నాడు. ఈ కూలీలు, రిక్షావాళ్ళూ మనకి భాషరాదని తెలిస్తే మరీ ఆడిస్తారేమోనని భయం. ఎలాగో ధైర్యం చెయ్యక తప్పదని నడుంవంచి పెట్టే బెడ్డింగూ పట్టుకున్నాడు. ఇరవైరెండేళ్ళ యువకు డైన శ్రీహరిరావు కూలీని పిలవడం ఇష్టంలేక.

కొద్దిదూరం నడచాడో లేదో శ్రీహరి "అన్న య్యా!" అన్న పిలుపు విని ఆగాడు. వెనకనుంచి ఒక ఇరవైయేళ్ళ యువకుడు, తెల్లని పాంటూ, షర్టూ టకప్ చేసుకున్నవాడు పరిగెత్తుకుంటూ శ్రీహరి దగ్గరికివచ్చి "ఫోన్‌లో కనుక్కుంటే జి. టి. అరగంట లేటన్నారురా! అందుకని తాపీగా వచ్చాను" అని తన వాచీ చూసి "కరక్టు టైముకే వచ్చేసిం దిరా! నీ టెలిగ్రాము నిన్న సాయంకాలానికల్లా అందింది" అని అన్నాడు.

"రక్షించావు. నాకు ఈ వూరు క్రొత్త. భాష క్రొత్త. బండి ఆగగానే మీ రెవరూ కన్పించకపోయే సరికి గుండె గుభేలుమంది, నీవు రాబట్టి సరి పోయింది. సత్యం ఆఫీసుకెళ్ళిపోయాడా?"

"వాడికేదో ఇన్‌స్పెక్షన్ వుందిట! నన్నొక్కడినీ స్టేషనికి వెళ్ళమన్నాడు. అదేమిటి? సామాను నువ్వు మోస్తున్నావు! ఏయ్! కూలీ, ఇదరావ్!" అని కూలీని పిల్చి సామాన పట్టుకోమని హిందీలో చెప్పాడు శేషగిరి.

శ్రీహరిరావు సందేహిస్తూ, "కూలీఎందుకులేరా?" అని అంటుంటే...."కాదులే, వాడి చేతికి సామా నియ్యి" అన్నాడు శేషగిరి. ఎక్కువగా వాదిస్తే బాగుండదని శ్రీహరిరావు సామాను కూలివాడి చేతి కిచ్చేశాడు.

శేషగిరి వరుసగా ప్రశ్నలడిగేస్తున్నాడు. "పెద నాన్నగారు కులాసాయేనా?" "దొడ్డమ్మ కాశీకి వెళ్తాదిగుతానంది.ఇంకాఎప్పుడుబయల్దేరుతుంది?" "నువ్వెప్పుడెక్కావ్ బెజవాడలో?" "ట్రైన్‌లో రద్దీ ఎలా వుంది?" "పొద్దున్న కాఫీ ఎక్కడా దొర కదే, వార్ధాలో టీ త్రాగావా?"

శ్రీహరి ఒక్కొక్క దానికే తాపీగా జవాబిస్తూ నడుస్తున్నాడు. అతనికి రాత్రంతా సరిగా నిద్ర లేదు. పొద్దున్నే కాఫీ పడలేదు ప్రయాణం కొంత బడలిక కల్గించిన మాట వాస్తవమే.

ముందర కూలీ నడుస్తుంటే హుషారుగా శేషగిరీ, తాపీగా శ్రీహరీ నడుస్తున్నారు. గేటు దాకా వచ్చారు. "హల్లో మిస్టర్ రావ్!" సన్నని మృదువైన కంఠం శేషగిరిని పలకరించింది. తల వంచుకు నడుస్తున్న శ్రీహరి తలెత్తి చూచేటప్పటికి శేషగిరి ఉత్సాహంగా ఇద్దరు యువతులతో చకచకా ఇంగ్లీషులో మాట్లాడేస్తున్నాడు.

శ్రీహరి వాళ్ళ మాటల్ని వింటూ ఒకే ఒక చూపులో—ఎందుకంటే శ్రీహరికి ఆడవాళ్ళంటే మహా సిగ్గు. అందుకని వాళ్ళవైపు పరిశీలనగా చూడ డు—తెల్లగా సన్నగా, పొడుగ్గా అందంగా వున్నారనీ, అందులో ఒకామె చీర కొత్త పద్ధతిలో (గోచీపోసి) కట్టుకున్నదనీ గ్రహించి తల ప్రక్కకి తిప్పుకున్నాడు. శ్రీహరి చెవులు మాత్రం తమ డ్యూటీ చేస్తూనే వున్నాయి

"నువ్వు కూడా పర్మిషన్‌పెట్టి వచ్చేశావా?" అని అడిగింది ఆ మృదుమధురధ్వని.

"అవును. మాకజిన్ ఇవాళ గ్రాండ్‌ట్రంక్‌లో వచ్చాడు. వాడిదే మొదటిసారి రావడం. అందుకని స్టేషనుకు వచ్చాను."

"నేను మా సిస్టరు కోసమని వచ్చాను"

"ఒరేయ్! అన్నయ్యా! ఈవిడ మా సహోద్యోగి. మిస్ సుధాదేశపాండే బి ఏ. వీడు మాకజిన్ ఎం. ఎస్. హరి ఎం. ఏ." అని శేషగిరి ఆ యువతులకు పరి చయం చేశాడు. శ్రీహరి తలెత్తకుండానే 'నమస్తే' అన్నాడు. యువతులిద్దరూ ప్రతి సమస్కారం చేశారు.

నలుగురూ గేటు బయటకు వచ్చారు. సుధా, ఆమె అక్కా ఒక రిక్షాయెక్కి వీ రిద్దరి దగ్గరా సెలవు పుచ్చుకొని వెళ్ళిపోయారు. శేషగిరి ఇంకొక రిక్షాను మాట్లాడి శ్రీహరినీ, సామానునీ ఎక్కిం చాడు. తనూ ఎక్కి రిక్షాను గిరిపేటకు పోనిమ్మ న్నాడు.

శేషగిరి మిస్ సుధగురించి చెప్పడం మొద లెట్టాడు. చాలా మంచి అమ్మాయిట. ఆఫీసులో తనకు ఎంతో సాయంగా వుంటుందట. చాలా తెలి వైనదట. ఆఫీసులో చేరి ఆరునెల లయిందట కాని, పని అంతా తెలిసేసుకొని అందరికీ సాయం కూడా చేసిపెడుతుందిట. పైగా వాళ్ళ నాన్న రిటైర్డు జడ్జీ. వాళ్ళకు బోలెడాస్తివుంది. ఇంట్లో వూరికే కూచోడం ఇష్టంలేక పని చేస్తోంది. చాలా 'సింపుల్'గా వుంటుంది.

శ్రీహరి అన్నీ వింటూ 'ఊఁ' కొట్టుతున్నాడు. ఒకప్రక్క శేషగిరి మాటలువింటూ, వేరొకప్రక్క నాగ్‌పూర్ రోడ్లన్నీ, ఇళ్ళనీ, ప్రజల్నీ పరిశీలిస్తు న్నాడు. రోడ్లమీద విరివిగా సైకిళ్ళ తొక్కుకుంటూ మంచివేగంగా పోయే సుందర యువతుల్నీ, చుట్టూ బోలెడంత గార్డెన్ పెంచటం తప్పనిసరిగా కన్పించే బిల్డింగ్సునీ, పురాతనత్వాన్ని స్ఫురింపజేసే కట్ట డాల్నీ చూస్తూ, ఆలోచిస్తున్నాడు శ్రీహరి— ఈ దేశపు ప్రత్యేకత ఏమిటా? అని.

రిక్షా వేగంగా వెళుతూంటే శేషగిరి దారిలో కనిపించేవాటిగురించి చెప్పేస్తున్నాడు. "ఇదంతా 'సీతాబల్డి' అంటారు" "ఇది మహరాజు బాగ్. ఇవి యూనివర్శిటీ బిల్డింగ్సు"—"ఆ కన్పించేది సైన్సు కాలేజి—దీన్ని ధరమ్‌పేట అంటారు—ఇదిగో గిరి పేట వచ్చేసింది — ఆ కనిపించేమేడమీదే మన లాడ్జి—ఏయ్ రిక్షా ఆపు."

శ్రీహరీ, శేషగిరీ ఇద్దరూదిగి రిక్షావాడిచేత సామాను పట్టించుకొని మేడమీదకి వెళ్ళారు. మేడమీద వరుసగా మూడు పెద్ద గదులున్నాయి. బాతు రూము కూడా పైనేవుంది. శేషగిరి, శ్రీహరికి అన్నీ చూపించి స్నానంచేసి కారియర్‌లోవున్న భోజనం తినమనీ, మళ్ళీ సాయంకాలం తను వస్తా ననిచెప్పి ఆఫీసుకు వెళ్ళిపోయాడు

స్నానంచేసి, భోంచేసి నిద్రపోయి లేచేటప్పటికి అయిదయిందని తెలుసుకున్నాడు శ్రీహరి. కొద్ది సేపట్లో సత్యం శేషగిరీ వస్తారని ఎదురు చూస్తూ కూచున్నాడు.

సత్యం, శేషగిరీ ఇద్దరూ శ్రీహరి పినతల్లి కొడుకులు. ఇద్దరూ నాగపూర్ ఏరోడ్రోమ్‌వద్ద వాతావరణశాఖలో ఉద్యోగం చేస్తూ, నాలుగు నెలల నుంచీ నాగ్‌పూర్‌లో వుంటున్నారు. సత్యం పాతికేళ్ళ వాడు. అతను ఉద్యోగంలోచేరి అయిదేళ్ళయింది. పూనా, బొంబాయి, మద్రాసులలో కొంత కొంతకాలం చేసి, నాగపూర్ వచ్చాడు. అతని తమ్ముడు శేషగిరి బి. యస్ సి. ప్యాసయి వూరికేవుంటే సత్యమే అతనికి తన ఆఫీసులో ఉద్యోగం వేయించాడు

వీరి దసలు రాజమండ్రీ దగ్గర ఒక పల్లె టూరు. అక్కడ కొంతపొలం ఇల్లూ వున్నాయి. సత్యం బి. ఏ. పాసయి, వచ్చే రాబడి కుటుంబానికి ఎలాగా చాలదని, మొట్టమొదట పూనాలో ఒక స్నేహితుడుంటే పూనావెళ్ళి స్నేహితుని సహా యంతో ఈ ఉద్యోగం సంపాదించాడు సత్యం కుటుంబబాధ్యతని అర్థం చేసుకున్న గంభీర హృదయంకల యువకుడు. సత్యం తరువాత నలు గురు తమ్ముళ్ళూ, ఇద్దరు చెల్లెళ్ళూ వున్నారు. తన సంపాదనలో తన ఖర్చుకుపోను, మిగిలినదంతా ఇంటికి పంపించేసేవాడు. మితభాషి. శాంతమూర్తి. ఎంత కష్టానికైనా ఓర్వగల శక్తివంతుడు. ముఖ్యంగా పరోపకారమంటే ముందూ వెనుకా చూడడు

శేషగిరి అన్నలాగ గంభీరుడుకాడు. చాలా ఉత్సా హం, సరదా, ఆవేశం, అమాయకత్వాలతో కూడిన స్వభావం కలవాడు. సంతోషం వచ్చినా, విచారం వచ్చినా అతన్ని ఎవరూ పట్టలేరు. మనసులోవున్న మాట పైకి అనేస్తేగాని తోచదు. అందరితోటే

ప్రణయావేశం

చనువుగా వుంటాడు. ఉద్యోగంలో కాలక్షేపానికి చేరాననీ, పై సంవత్సరం ఎమ్. ఎస్ సి. లో జేరుతాననీ అందరితో చెప్తాడు. సిగరెట్లు బాగా కాలుస్తాడు. సినిమాలకి తెగ వెళ్తాడు.

శ్రీహరికి ఈ ఇద్దరూ అంటే ప్రాణం. పినతల్లి బిడ్డలైనా స్వంత సోదరులకన్నా ఎక్కువగా, అతనంటే ఆదరం చూపిస్తారు సత్యం, శేషగిరీ. శ్రీహరిది బెజవాడ. తలి తండ్రులకు ఒక్కడే బిడ్డ. ఎం. ఏ. ఎకనామిక్సు పాసయ్యాడు. ఇంకేంచేద్దామా అని ఆలోచిస్తూంటే నాగపూర్‌వచ్చి యల్ యల్. బి.కి కట్టమనీ, లేకపోతే ఐ. ఎ. యస్. కు స్టడీ చేద్దువుగాని రమ్మనీ సత్యం శ్రీహరిని ఆహ్వానించాడు.

బెజవాడలోవుంటే తలిదండ్రులు పెళ్ళి చేసుకోమని బలవంతపెట్తారని, ఏదో ఒకటి చేద్దామనీ, అథమం కొంతకాలం సత్యం, శేషగిరులతో సరదాగా కాలక్షేపం చేసినట్లైనా వుంటుందనీ శ్రీహరి నాగపూర్ బయల్దేరాడు.

నాగపూర్ వచ్చిన రెండు రోజుల్లో తను చాలా మంచి పని చేశాననీ, ఈ కొత్త వాతావరణం తనకు చాలా తృప్తిగా వుందనీ శ్రీహరి సంతోషించేడు. ముఖ్యంగా సత్యం, శేషగిరులతో హుషారుగా కాలం గడిచేది. ఎటొచ్చీ మధ్యాహ్నం, తనొక్కడూ వుండాలి. ఏదో పుస్తకం చదువుతూనో, రేడియో వింటూనో కాలక్షేపం చేసేవాడు.

ఏమీలేకపోతే వరండాలో కుర్చీ వేసుకుని, క్రింద వీధివైపు చూస్తుంటే కొంత కాలక్షేపమయ్యేది ఎదురుగా కొన్ని దుకాణాలు వున్నాయి. ఆ వీధెప్పుడూ సందడిగా వుంటుంది సాధారణంగా యువతులే దుకాణాలకి వచ్చి అన్నీ కొనుక్కొని పోతూంటారు. వాళ్ళ కట్టూ, బొట్టూ, వేషం, భాషా అన్నీ పరిశీలనగా చూచేవాడు

అక్కడ స్త్రీలలో చురుకుదనం, చొరవా ఎక్కువ. పైగా ఎలాంటి వాళ్ళైనా చక్కని బట్టలూ, కాలికి జోడూ వేసుకుంటారు. నగలు ఎక్కువగా వేసుకోరు బట్టలకిచ్చే ప్రాధాన్యత బంగారపు నగల కివ్వరనిపిస్తుంది తెనుగుదేశంలో స్త్రీలకు నగలమీదవున్న మోజు మహారాష్ట్రపు యువతులలో కన్పించదు.

శ్రీహరి సాయంకాలం దాకా ఒంటరిగా గడిపేవాడు. అయిదు దాటాక, ముందర శేషగిరి వచ్చేసేవాడు. సత్యానికి పనెక్కువవడంవల్ల రాత్రి ఎనిమిదీ తొమ్మిది గంటల దాకా ఆఫీసునుండి వచ్చేవాడు కాదు. శేషగిరీ, శ్రీహరీ సాయంకాలం కాఫీ, టిఫిన్ తీసుకుని 'ఆంధ్రా క్లబ్బు'కో, లేకపోతే షికారుగా సైకిలుమీద వూరంతా తిరగడానికో వెళ్లేవారు.

శ్రీహరి బాగా చదువుకున్నవాడేకాక, వింత వింత మనస్తత్వాలను అర్థం చేసుకోవాలని ప్రయత్నించేవాడు. ఆఫీసు పని ఎక్కువవడంవల్లా, స్వభావంచేత ముభావస్తుడవటంవల్లా, సత్యంతో ఎక్కువ కాలం గడపడానికి శ్రీహరికి అవకాశముండేదికాదు.

శేషగిరికి శ్రీహరంటే ఎక్కడలేని భక్తిశ్రద్ధలూ వున్నాయి. ప్రతీవిషయం శ్రీహరితో చర్చించనిదే శేషగిరికి తోచదు. శ్రీహరి బాగా ఆలోచనాపరుడు. అందుచేత శేషగిరి అనేక విషయాలు శ్రీహరి దగ్గర తెలుసుకొనేవాడు.

ఇద్దరు యువకులే అవటంవల్ల సాధారణంగా వారి సంభాషణ స్త్రీలూ, ప్రేమా, ప్రణయం వీటిమీదే నడిచేది ఈ విషయాల్లో శ్రీహరికి పుస్తకజ్ఞానం బోలెడంతవుంది. శేషగిరికి అనుభవజ్ఞానం గడించాలని ఆతృతవుంది అంతేకాకుండా శేషగిరి, శ్రీహరి మాటల్నిబట్టి—పైకి చెప్పకపోయినా—అతనికీ విషయాల్లో చాలా అనుభవం వుందని అనుమానపడేవాడు శ్రీహరి మాత్రం తన అభిప్రాయాలన్నీ షేక్సిపియర్, షా, లారెన్సు ఆస్కార్‌వైల్డు, మాయ్, శరత్తు, చలం మొదలైనవారి రచనలు పఠించటంవల్ల ఏర్పడినవని అని చెప్పేవాడు. పైగా ఆ యా గ్రంథాలలోంచి కొటేషన్సు కూడా ఇచ్చేవాడు.

శేషగిరి ఈ గ్రంథాలెప్పుడూ చదువలేదు కాని శ్రీహరి ఇచ్చిన కొటేషన్సు బాగా మననం

> మొహం బాగా నల్లబడిపోయిన ఒక మనిషిని హడావుడిగా దంతవైద్యుడి వద్దకు తీసుకువచ్చారు. అతను పరీక్షచేసి "ఇతనికి పళ్లేలేవే, నాదగ్గరకెందుకు తీసుకొచ్చారు?" అని అడిగాడు. "పళ్లను మింగేశాడండీ!" అన్నాడు వెంటతో వచ్చిన ఆయన.

చేసేవాడు శ్రీహరి అభిప్రాయాల్ని శ్రద్ధగావినేవాడు స్త్రీల తత్వాన్ని గురించి అనేక ప్రశ్న లడిగేవాడు. ప్రేమ అంటే ఏమిటో నిర్వచించమనేవాడు. శ్రీహరి మపాసా కథలూ, బాల్జాక్ కథలూ చెప్తూంటే శేషగిరికి ఒళ్ళు తెలిసేదికాదు.

సాయంకాలం, చల్లనివేళ, నిర్మానుష్యంగావుండే రోడ్లలో చుట్టూ, ఎక్కడ చూసినా మంచి తోటలు కన్పిస్తూండే ప్రదేశాల్లో వెళ్తూ, శ్రీహరీ, శేషగిరీ ప్రేమ గురించి తెలిసీ తెలియని కబుర్లు చెప్పుకుంటూండేవారు

"అయితే అన్నయ్యా! 'ట్రూలవ్' (నిజమైన ప్రేమ) అంటే ఏమిటిరా?"

"అసలు ప్రేమలో స్వార్థం వుండకూడదురా, త్యాగం వుండాలి. తను ప్రేమించిన వ్యక్తికోసం ఎంత త్యాగమైనా చేయడానికి సిద్ధపడాలి నిజమైన ప్రేమ ఈ భూమిమీద జన్మించిన ఏ కొద్దిమందిలోనో వుంటుంది. తక్కిన వారందరూ ప్రేమించుకుంటున్నామనీ, ప్రేమికులమనీ అనుకొంటారుగాని, అవసరమొస్తే కాస్తయినా త్యాగం చెయ్యలేరు. పైపై అందాల ఆకర్షణకు లోబడి అదే ప్రేమ అనుకొని మోసపోతారు."

శ్రీహరి చెప్పిన మాటల్ని శ్రద్ధగా మననం చేసుకునేవాడు, శేషగిరి. "నిజమైన ప్రేమ—'స్వార్థం వుండకూడదు—త్యాగం కావాలి—భూమిమీద జన్మించిన ఏ కొద్దిమందికో—రైట్. అయితే అన్నయ్యా నీకు తెలిసిన నిజమైన ప్రేమికుల పేర్లు కొన్ని చెప్పు?"

శేషగిరి ఇంత వివరంగా తను చెప్పిన విషయాల్ని నోటు' చేసుకోడం, సోదాహరణలతో చెప్పమని అడగడం శ్రీహరికి కొంచెం ఆశ్చర్యం కలిగింది. అయినా శేషగిరికి తన మాటలు చాలా ఆసక్తికరంగా వున్నాయి కాబోలు ననుకొని, "రోమియో జూలియట్, లైలా—మజ్నూ, రాధా—కృష్ణ వీళ్ళందరూ చరిత్ర ప్రసిద్ధి చెందిన ప్రేమికులు. పార్వతీ, దేవదాసులను కూడా ఆ కోవలోనే చేర్చవచ్చు" అని అన్నాడు.

"వీళ్ళందరిదీ నిజమైన ప్రేమేనా?"

"నిస్సందేహంగా. అటువంటి ప్రేమ సాధారణంగా విషాదాంతమైపోతుంది?"

"విషాదాంతం కాకుండా వుండాలంటే?"

"అది మన చేతుల్లో వుందా? పరిస్థితుల్నిబట్టి వుంటుంది పవిత్ర ప్రేమ ఉద్భవించినప్పుడు మతం, కులం, గోత్రం, ఇద్దరి మధ్యా సరిగా కుదిరాయో లేదో చూసుకొని మరీ పుట్టదుకదా! 'ప్రేమ గుడ్డిది' అని షేక్స్పియర్ అన్నట్లు హఠాత్తుగా ఇద్దరు—ఒక స్త్రీ, ఒక పురుషుడూ, తామెవరెవరో తెలుసుకోకుండా ప్రేమించేసుకుంటే సంఘంచూసి వూరుకుంటుందా? సంఘానికి వెయ్యి కళ్ళు. అందుకని ఆ ప్రేమ, సంఘంయొక్క ఇనుప కాళ్ళక్రింద నలిగి ..."

"అబ్బ!"

"సంఘ కోపాగ్నికి ఆహుతై......"

"నిజంగానే. . . ?"

"నలిగి నలిగి దగ్ధమైపోతుంది"

"అయ్యో!" అని మెల్లిగా మూలిగాడు శేష

౨

"అదేవిట్రా? నీరసంగా వుందా? పద కాఫీ త్రాగివద్దాం" అని శ్రీహరి, శేషగిరి సీరియస్‌గా పెట్టిన మొహంచూసి తమ సంభాషణ విషాదాంతం కాకుండా శేషగిరిని "సౌతు ఇండియన్ హోటలికి" దారి పట్టించాడు.

"నువ్వన్నట్టు పవిత్రప్రేమ విషాదాంతమైతే... చాలా కష్టంగా వుంటుందిరా" అన్నాడు శేషగిరి, కాఫీలో మరికొంచెం పంచదార వేయించుకుంటూ. స్ట్రాంగ్ కాఫీని మెల్లిగా చప్పరిస్తూ, దాని సుగంధాన్ని ఆస్వాదిస్తున్న శ్రీహరి "ఎవరికి?" అని ఒక అడ్డుప్రశ్న వేశాడు.

ఎవరికో చెప్పడం అంత అవసరంగా తోచలేదు కాబోలు శేషగిరి మౌనం వహించాడు. ఇంతలో "ఆంధ్రా క్లబ్బు సెక్రటరీ మిస్టర్ రఘుపతి—కాఫీకోసం వచ్చినవాడు—వీళ్ళనిచూసి, "మీకోసం ఇద్దరు మనుష్యుల్ని పంపించాను. క్లబ్బు వార్షికోత్సవం గురించి మనమంతా చర్చించాలి. పదండి ముందు క్లబ్బుకు వెళ్దాం" అని వాళ్ళ నిద్దరినీ క్లబ్బుకు తీసుకువెళ్ళాడు. శ్రీహరికి ఈ మార్పు కొంత హాయినిచ్చింది శేషగిరికి పవిత్రప్రేమ సంఘం కాళ్ళక్రింద ఎలా నలిగిపోతోందో కొంత అర్థమైంది.

మర్నాడు సాయంకాలం శేషగిరి ఆఫీసునుంచి వస్తూనే "అన్నయ్యా! నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి. అలా 'తెలంకడీ గార్డెన్స్' వైపు వెళ్దాం పదరా" అని శ్రీహరిని బయల్దేర తీశాడు. ఇంత అత్యవసర విషయం ఏమిటో శ్రీహరికి అర్థం కాలేదు. శేషగిరి ఉద్యోగం మానేస్తున్నాడో, ఎవరితోనైనా దెబ్బలాడేడో క్లబ్బులో ఏవైనా మాట పట్టింపులువచ్చాయో, శ్రీహరికి ఏదీ తెలియలేదు. బట్టలు వేసుకుంటున్న శ్రీహరి ఆ ముఖ్యమైన విషయమేమిటో త్వరగా చెప్పరా! అని శేషగిరిని అడుగుదామనుకున్నాడుగాని, శేషగిరియొక్క 'సీరియస్' మొహం చూసి అడగడానికి కూడా జంకాడు.

ఇద్దరూ సైకిళ్లెక్కి బయల్దేరారు. గిరిపేట దాటి కొంతదూరం వెళ్లేదాకా ఇద్దరూ ఏమీ మాట్లాడలేదు. సాయంకాలంపూట దూరంగా కొండలూ, చుట్టూ ఎక్కడ చూసినా పెద్ద పెద్ద చెట్లూ, మంచి తోటలూ, తారు రోడ్డుమీద ఎక్కువ మంది జనం లేరు. సైకిళ్ళమీద శ్రీహరీ, శేషగిరి వెళ్తూ అనేక విషయాలు ఆలోచించుకుంటూ, మౌనంగా తొక్కుతున్నారు. చివరి శేషగిరి "నేను చెప్పే విషయం శ్రద్ధగా విని, నీ అభిప్రాయాన్ని చెప్పాలిరా!" అన్నాడు.

"అలాగే. తప్పకుండా"

"అసలు ఒక స్త్రీ ఒక పురుషుడిని ప్రేమిస్తోందో లేదో ఎలా తెలుసుకోగలంరా?"

శ్రీహరి కొంచెం దగ్గాడు. శేషగిరి అంటున్న దేవిటా! అని ఆలోచించాడు. ముఖ్యమైన విషయం అంటూ, తనని తీసుకువచ్చి 'స్త్రీ'—పురుషుడూ—ప్రేమా అంటాడేవిటి?

"అది సరేగాని ముందు నువ్వు చెప్పదల్చుకున్న ముఖ్య విషయమేమిటో చెప్పరా. ప్రేమ గురించి తరువాత మాట్లాడుకుందాం."

"ఇదేరా నేనన్న విషయం. ఇందులో నీ మాటల మీద ఒక వ్యక్తి భవిష్యత్తంతా ఆధారపడివుంది."

"ఒరేయ్! నువ్వేదో కొంపమునిగే విషయము చెప్పి, ఎవత్తో ఎవడినో ప్రేమించిందో లేదో చెప్పమంటావేమిటి? నేనేం జ్యోతిష్కుణ్ణా! అయినా ఇంకొకరి విషయాలు మనకెందుకు. ఈ విషయాల్లో మనం ఎంత దూరంగావుంటే అంత మంచిది."

"ఎవరి విషయాలో అయితే నేను నిన్నెందుకడుగుతాను! ఇది నా స్వంత విషయమే."

"ఏమిటీ! నీ స్వంత విషయమా? ఇన్నాళ్ళబట్టీ చెప్పావుకాదేం. ఇక్కడ మన తెలుగు అమ్మాయిలెవరూ నాకు కనిపించలేదే!"

"తెలుగమ్మాయికాదురా. మహారాష్ట్రలే. అందుకే ఇంతగొడవ పడాల్సి వస్తోంది."

శ్రీహరికి కొద్ది కొద్దిగా అర్థమవసాగింది. రోజూ తనచేత ప్రేమ గురించి తెగ వాగిస్తూ, ప్రేమ తత్వాన్ని గురించి అనేక ప్రశ్నలు వేస్తున్న శేషగిరి ప్రస్తుతం 'మజ్నూ' అవతారం దాల్చాడన్నమాట!

"అయితే 'లైలా' ఎవర్రా? ఉండుండు. నే చెప్తా......మిస్ సుధాదేశ్‌పాండే!"

"రైట్. మిస్ సుధను నేను ప్రేమించానురా. కానీ........"

"ఏం? కొంపతీసి నీ ప్రేమను ఆమె నిరాకరించలేదుగదా?"

"ఇంకా అంతవరకూ వెళ్ళలేదురా! నేను ఆమెకు సూటిగా నా ప్రేమని వ్యక్తం చెయ్యలేదింతవరకూ. కానీ ఆమెను వివాహం చేసుకోనిదే బ్రతకలేనురా. అటువంటి అందమైనదీ, తెలివైనదీ, మంచి హృదయం కలదీ నేనంటే అభిమానపడేదీ వెయ్యి జన్మలెత్తినా భార్యగా దొరకడం కష్టంరా."

"నిజమే కాని........అసలు నువ్వు విషయమంతా పూర్తిగా చెప్తేనేకాని, నాకెలా తెలుస్తుంది?"

"నేను ఆఫీసులో ప్రవేశించిన వారం రోజులకి మిస్ సుధ మా సెక్షనుకి వచ్చింది. అంతకుముందు మరో సెక్షనులో పని చేసేదట. కాని ఆ 'సెక్షన్ హెడ్' తనకి 'ఫేమిలీ' లేదనీ, ఒంటరిగానే [illegible]న్నాననీ, సాయంకాలం ఒకసారి తన యింటి[illegible]న్నాడట సుధని. ఒంటరిగా వుండడం [illegible]కాదనీ—కొన్నాళ్ళు హాస్పిటల్లో వుండి [illegible] రూళ్ళ కర్రతో వాడి నెత్తిమీద ఒక్కటిచ్చింది[illegible] వెంటనే సెక్రటరీ దగ్గరికివెళ్ళి వాడిమీద రిపోర్టు చేసి 'సెక్షన్' మార్పించుకుందిరా."

"అచ్చా! అయితే చలాకీపిల్లే నన్నమాట!"

"అంతే ననుకున్నావా! టెన్నిస్ చాలా బాగా ఆడుతుంది. స్విమ్మింగ్‌లో కాలేజి ఛాంపియన్. పాట కూడా చాలా బాగా పాడుతుంది. కోపంవస్తే ఎలాటివాళ్ళనీ లెక్కచెయ్యదు. మళ్ళీ అంత అమాయకంగా మాట్లాడే మనిషి ఇంకొకతె కన్పించదు. నా ప్రక్కసీటే ఆమెది. ఇద్దరం తక్కిన వాళ్ళకన్నా పని తొందరగా పూర్తి చేసేస్తూంటాం. ఆఫీసులో బోలెడంతసేపు మాట్లాడుకుంటూ వుంటాం"

"దేన్ని గురించి?"

"అనేక విషయాలు; సినిమాలూ, క్రికెట్ మాచెస్, రాజకీయాలూ, ఇంకా ఏవేవో చెప్తే అవి. ఆమెతో పరిచయమైన దగ్గర్నుంచీ నా జీవితమే మారిపోయింది. ఒక్కొక్కప్పుడు రికార్డు రూములో ఇద్దరమే వుంటూ వుంటాం. అలాంటప్పుడు ఆమె మొహం నేనూ, నా మొహం ఆమె చూస్తూ ఒకర్నొకరు మర్చిపోతూ, ఏవో వూహాల్లో తేలిపోతూంటాం. అప్పుడు ఆమెతో, ఆమెను ప్రేమిస్తున్నానని చెప్పాలని వుంటుంది. కాని ఆమె ఏమంటుందో అని సందేహంవచ్చి, నన్ను నేను అదుపులోకి తెచ్చుకుంటూంటాను."

"అయితే ఇంతకీ నువ్వామెను ప్రేమిస్తున్న సంగతి ఆమెతో చెప్పలేదా?"

"లేదు. ఆమె ఇంతవరకూ నన్ను ఎంతో గౌరవంగా చూస్తోంది. ఒక్కొక్కప్పుడు తన ఇంటి విషయాలు కూడా నాతో చెప్పుకుని నా సానుభూతికోరుతూ వుంటుంది. 'మిస్టర్ రావు మనది ఒకే జాతి కాకపోయినా మన స్నేహం ఎంత దృఢమైనదో చూడు. ఎప్పటికీ మనం ఇలాగే వుందాం' అంటుంది."

"అంటే స్నేహితులుగానా?"

"అదే తెలియటం లేదురా. ఆమె నన్ను ఏ దృష్టితో చూస్తోందో తెలియనప్పుడు. నేను నా ప్రేమను వెల్లడి చేస్తే......"

"నిన్ను కూడా హాస్పిటల్‌కి పంపొచ్చు."

"దానికోసం నేను జంకటంల్లేదు. ఆమె దృష్టిలో ఒక నీచుడిక్రింద పరిగణింపబడ్తానేమోనని భయంగా వుంది"

"అయితే మరి ఎన్నాళ్ళిలా నీ ప్రేమను దాచుకొని బాధ పడ్తావు?"

"నువ్వు నాకీ విషయంలో సాయంచెయ్యాలిరా."

"నేను నీకేమి సాయం చెయ్యగలనురా?"


"నేనొక ప్లాను ఆలోచించాను. ఏమీ లేదు. సుధని ఏదో ఫంక్షన్‌పేరుపెట్టి మన ఇంట్లో టీ ఇస్తాము రమ్మని పిలుస్తాను. అప్పుడామె తత్వాన్ని

(44వ పేజీ చూడండి)


ఆసుపత్రిలో ఉన్న ఒక రోగికి లాట్రీలో లక్ష రూపాయలు వచ్చింది. కాని ఆరోగికి తెలియదు. ఆలాట్రి మేనేజరు డాక్టరు వద్దకు వచ్చి ఈలా చెప్పాడు:

"ఆరోగికి లాట్రిలో లక్ష రూపాయలు వచ్చింది. అతనికి ఈడబ్బు ఇవ్వండి.ఇప్పుడే ఇవ్వకండి. అతను ఇప్పుడు చాల జబ్బులో ఉన్నాడు. కాబట్టి లక్ష రూపాయలు వచ్చిందంటే అతని గుండె పట్టుకుని చస్తాడేమో. అతను ప్రశాంతముగా ఉన్నప్పుడు ఇవ్వండి అని వెళ్ళిపోయాడు. డాక్టరు ఒకరోజు ఆరోగివద్దకొచ్చి ఏమయ్యా నీకు లక్షరూపాయలు లాట్రీలో వస్తే నాకెంత ఇస్తావు అని అడిగాడు. ఆరోగి తటాలున వస్తే నీకు 50 వేల రూపాయలు ఇస్తాను. అని చెప్పాడో లేదో ఆ డాక్టరు ఆఁ, అని చచ్చిపోయాడు.

ఎస్. చంద్రమోహన్ (తిరుపతి).



పిల్లలందరికీ ఇష్టం
బ్రౌన్ అండ్ పాల్సన్‌వారి బ్లామాంజి



బ్రౌన్ అండ్ పాల్సన్
సువాసనగల కార్న్‌ఫ్లవర్

బ్లామాంజి నోట్లోవేయగానే కరిగిపోయే అత్యుత్తమ ఫలాహారము. దీనిని మీరు బ్రౌన్ అండ్ పాల్సన్‌వారి సువాసనగల కార్న్‌ఫ్లవర్‌తో చేస్తే సర్వదా భోగ్యమైన సఫల సిద్ధం, ఎందుచేత ననగా బ్రౌన్ అండ్ పాల్సన్‌వారి కార్న్‌ఫ్లవర్ మెత్తని సమాన చిక్కదనముగా మిశ్రమ మగును. ఏమాత్రమూ ముద్దగా కరుడు కట్టదు. అది 5 రుచికరమైన సువాసనలలో లభించుచున్నది. వనిల్లా, రాస్‌బెర్రీ, కారమెల్, స్ట్రాబెర్రీ, పైనాపిల్ బ్రౌన్ అండ్ పాల్సన్‌వారి ఇతర వివిధ రకములు, పేటెంట్ కార్న్‌ఫ్లవర్, రైస్లీ వెరైటీ కస్టార్డ్స్, కస్టార్డు పౌడరు.



బ్రౌన్ అండ్ పాల్సన్
ఫ్లేవర్డ కార్న్‌ఫ్లవర్

కార్న్ ప్రాడక్ట్స్ కొ., (ఇండియా) ప్రయివేట్ లి.

ఉచితం: ఉత్సాహకరమైన కొత్త ఫలహార ముల ఉచిత పుస్తకము కోసం ఈ కూపన్, పూరించి పంపండి. ఇంగ్లీషు, హిందీ, తమిళం, తెలుగు, గుజరాతీ, మలయాళం, మరాటీ, ఉరుదు. లేక బెంగాలిభాషలలో లభించును. (అక్కర్లేని భాషను కొట్టివేయండి.)

తపాలా ఖర్చుల నిమిత్తం 25 న. పై. తపాలా బిళ్లలను నేను ఇందుతో పంపితిని.

శ్రీ, శ్రీమతి, కుమారి..........................

....

చిరునామా..................................

....

డిపా. నం. APW–4

కార్న్ ప్రాడక్ట్స్ కొ. (ఇండియా)
ప్రైవేట్ లిమిటెడ్.
పోస్టుబాక్సు నం 994, బొంబాయి 1
ఈ బహుమతి భారతదేశంలో మాత్రమే

భారతదేశంలో ఏజెంట్లు: ప్యారి & కం. లి.

మెక్కార్తీ వారసులు

కొన్ని రోజుల క్రితం కాలిఫోర్నియా సెనేటర్ శ్రీటామ్‌కుచెల్ 'జాన్ బిర్చ్ సొసైటీ' అనే ఉద్యమాన్ని సెనేట్ హవుస్‌లో ఖండించాడు. ప్రముఖ రాజకీయవేత్తలందరూ కుచెల్‌తో ఏకీభవించారు కాని కొందరు మాత్రం ఈ 'సొసైటీ' పక్షం వాదించారు. చారీ గోల్డ్‌వాటర్, ఎడ్గార్ హిస్లాండ్, జాన్ రూస్సెలాట్, గార్డన్ షెరర్ మొదలైన శాసన సభ్యులు ఈ సంఘం మొత్తానికి ఏదో 'మంచి' చేస్తున్న దన్నారు.

ఈ సొసైటీ నాయకుడు రాబర్ట్ వెల్చ్ తన సంఘం ప్రజాగ్రహానికి గురి అవటం గుర్తించి, సెనేట్ సబ్—కమిటీని తన సంఘాన్ని పరీక్ష చేయుమనికోరాడు. "దిపొలిటిష్యన్" అన్న తన గ్రంథంలో ఐసెన్‌హోవర్ కమ్యూనిస్టుగా ఏజెంట్ వర్ణించలేదన్నాడు.

జాన్ మారిసన్‌బిర్చ్ 28—5—1918 లో మనదేశంలో లాండూర్ అనే వూళ్ళో ఒక మిషనరీ కుటుంబంలో జన్మించారు. అమెరికాలో విద్యాభ్యాసమయిన తర్వాత చైనాలో మిషనరీవృత్తి నవలంబించాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో అమెరికా సైన్యంలో ఒక కాప్టెన్ అయ్యాడు. 1945 లో జపాన్ ఓటమిని అంగీకరించిన పది రోజులలో కమ్యూనిస్టు గోరిల్లాల చేతులలో మరణించాడు.

1958 డిసెంబర్ వరకూ ఇతని పేరు చాలా తక్కువ మందికి తెలుసు. ఆ నెలలో రాబర్ట్ వెల్చ్ అనే అతను 'జాన్ బిర్చ్ సొసైటీ' (జాన్ బిర్చ్ సంఘం)స్థాపించాడు. బిర్చ్ జీవితచరిత్రను ప్రచురించిన వెల్చ్ పది పన్నెండు మంది కలిసి ఈ 'సొసైటీ'ని ఏర్పరచారు.

జాన్ బిర్చ్ పేరు తమ 'ఆదర్శాల'కు చిహ్నంగా ఉండాలని వెల్చ్ మొదలైనవారి ఉద్దేశ్యం. ఈ సందర్భంలో ప్రతిపాదింపబడ్డ తీర్మానాలలో "ప్రచ్ఛన్న యుద్ధానికి బలి అయిన మొదటి వ్యక్తి" జాన్ బిర్చ్‌కి ఈ సంఘాన్ని అంకితమిస్తూ, అమెరికాలోకి పాకిన కమ్యూనిజాన్ని అంతం చేయడమే తమ ఆశయమన్నారు, వెల్చ్ మొదలైనవారు.

ఈ సంఘం రహస్యమైనది. దీని సభ్యులు కూడా తమ సభ్యత్వం రహస్యంగా ఉంచాలి—పెద్ద నాయకులు తప్ప. కమ్యూనిస్టుపార్టీకి ఉన్నట్లే జాన్ బిర్చ్ సొసైటీకి కూడా ఎన్నో 'సెల్'లు ఉంటాయి ఒక్కొక్క 'సెల్' లోనూ ఇరవై ముప్పై మంది సభ్యులు ఉంటారు. ఇవన్నీ ఒక కేంద్ర నాయకత్వానికి లోబడి ఉంటాయి. ఈ కేంద్ర నాయకత్వమంతా రాబర్ట్‌వెల్చ్‌లోనే మళ్ళీ కేంద్రీకరింపబడిఉంది. ఈసంఘానికి ఇతను ని...ప్రస్తుత 'జాన్ బిర్చ్ సొసైటీ' అమెరికాలోని ఏభై రాష్ట్రాల్లో కనీసం ముప్పైనాల్గిటిలోనైనా ప్రబలంగా ఉన్నదని శ్రీ అలిస్టెయిర్ కుక్ (మాంచస్టర్ గార్డియన్ వీక్లీలో) వ్రాశారు. అంతేకాక ఒక్కొక్క రాష్ట్రంలోనూ, జాన్ బిర్చ్ సంఘానికి ఒకటినుంచి నూరు 'సంస్థ'లైనా ఉంటాయని శ్రీ కుక్ అభిప్రాయం.

దీని కార్యక్రమం రహస్యంగా కొనసాగబడుతూ వచ్చింది కాబట్టి మొన్న మొన్నటివరకూ ఈ సంఘం పేరు కూడా అతి స్వల్పసంఖ్యాకులకు మాత్రమే తెలుసు. కాని రాబర్ట్‌వెల్చ్ 'ది పొలిటీషియన్' అనే గ్రంథం రచించాడు. దీనిలో తన రాజకీయ సిద్ధాంతాలను వివరించాడు. ఈ పుస్తకం ప్రచురితమయిన తర్వాత వెల్చ్ పేరు దేశమంతా తెలిసిపోయింది. ఐసెన్‌హోవర్ కమ్యూనిస్టు ఏజెంటని వెల్చ్ వ్రాశాడు! కమ్యూనిస్టుపార్టీ సభ్యుడైన ఐసెన్‌హోవర్‌పైన అతని సహోదరుడు మిల్టన్ ఐసెన్‌హోవర్ పని చేస్తున్నాడని వెల్చ్ ఆరోపించాడు. ఈరోజు వెల్చ్ సంఘానికి వచ్చిన ప్రాముఖ్యత ఈ ఆరోపణవల్లనేనని చెప్పవచ్చు.

(వెల్చ్ అభిప్రాయంలో జాన్‌ఫాస్టర్ డల్లెస్ కూడా కమ్యూనిస్టే! డల్లెస్ తమ్ముడూ, అమెరికా గూఢచారుల శాఖకు అధిపతీ అయిన అల్లెన్ డల్లెస్ పెద్ద కమ్యూనిస్టు నాయకులలో ఒకరని 'ది పొలిటీషియన్'లో వ్రాసి ఉందిట) ఆ తర్వాత జాన్ బిర్చ్ సొసైటీ పేరు అందరినోటా మెదిలింది.

కమ్యూనిజాన్ని ప్రతిఘటించే మిషతో దుష్ప్రచారం చేసేందుకు ఎప్పుడూ సిద్ధంగాఉన్న అమెరికన్లందరూ 'జాన్ బిర్చ్ సంఘం' వైపుకు మొగ్గడం మొదలుపెట్టారు. 'కమిటీ'లను ఏర్పరచి వేల మంది జీవితాలను నాశనంచేసి, కొందరి ఆత్మహత్యకు కూడా కారణమైన సెనేటర్ జోసెఫ్ మెక్కార్తీ మళ్ళీ జన్మ ఎత్తాడా అనిపించింది. కాని వెల్చ్ గ్రంథం చదివిన ఆప్తమిత్రులలో కూడా చాలామంది అసహ్యించుకున్నారు. ఇది గమనించి వెల్చ్ తన పుస్తకాన్ని ప్రచారంలోనుంచి తీసి వేస్తున్నాడు.

వెల్చ్ 'అమెరికన్ ఒపీనియన్' (అమెరికన్ అభిప్రాయం' అనే మాస పత్రిక ప్రచురిస్తాడు—చందా, మొగవారికి 24 డాలర్లు, ఆడవారికి 12 డాలర్లు! ఎందుకయినా మంచిదని 'డామేజి దావాలకు' దారితీసే చర్చలను వెల్చ్ వీలున్నంతవరకూ ప్రచురించడు. జాన్‌బిర్చ్ సొసైటీ మాత్రం ఇష్టంలేని వారందరిపైనా దాడి తీస్తూ ఉంటుంది.

కన్సాస్ రాష్ట్రంలోని 'విచిటా'లో కాలేజి అధికారులనూ, ఉపాధ్యాయులనూ భయపెట్టి హింసించడమేకాక, వారికి సహాయం చేయదలచుకున్న దాతలను కూడా దడిపించి తమ శక్తిని నిరూపించారు. తక్కినచోట్ల కూడా ఈ సంఘం వారు తమ గూండా వ్యాపారాలు సాగిస్తున్నారు.

ఇటీవల జాన్ బిర్చ్ సొసైటీ ఒక 'ప్రణాళిక' తయారు చేసింది. దీని ముఖ్యాంశాలు · (1) అమెరికా చీఫ్ జస్టిస్ (ప్రధాన న్యాయమూర్తి) ఎర్ల్ వారెన్‌ను విమర్శించి పదవినుంచి తొలగించడం, (2) కమ్యూనిస్టు దేశాలలో తయారయిన వస్తువులను నిషేధించడం, (3) ఇన్‌కంటాక్స్ (రాబడి పన్ను) రద్దు చేయించడం, (4) మెక్కార్తీ ఆధ్వర్యంలో ప్రసిద్ధమయిన 'కమిటీ ఆన్ అన్—అమెరికన్ అక్టివిటీస్' (అమెరికాకు అపాయకరమైన వ్యాపారాలను అరికట్టే కమిటీ)ను బలపరచడం.




రాబర్ట్ వెల్చ్

ఏవిధంగా నయినా శ్రీ వారెన్‌ను రదవినుంచి భ్రష్టునిగా చెయ్యటానికి వీరు ప్రయత్నిస్తున్నారు. నూటికి తొంభైరెండుసార్లు ఈయన కమ్యూనిస్టుల తరపున తీర్పుల నిచ్చాడని వీరంటారు! ఎంత అవ హేళనగాఉన్నా 'జాన్ బిర్చ్ సొసైటీ'ని కొట్టి పారేయుటానికి వీలులేదు. అమెరికా దేశమంతటా దీని అనుచరులు ఉన్నారని తెలుస్తోంది. కొందరు 'నాయకులూ', వ్యాపారులూ ఈ సంఘంపట్ల చాలా సానుభూతి చూపిస్తున్నారు. వెల్చ్‌వంటి దేశభక్తుడూ, 'స్వాతంత్ర్యవీరుడూ' లేడని వీరంటారని ప్రతీతి. మెక్కార్తీ ఎంత భయంకరంగా మాట్లాడినా అతనివెంట పెద్ద ఉద్యమం కదలలేదు. కేవలం వ్యక్తిగనే మెక్కార్తీ చెలామణి అయ్యాడు. దేశంలోని అశాంతమైన పరిస్థితులను తనకు ఇష్టం వచ్చినట్లు వాడుకున్నాడు. 'జాన్ బిర్చ్ సొసైటీ' ఇంచుమించు ఒక ఉద్యమంగా తయారయేట్లు ఉంది. గూండావృత్తికి పూనుకొనడానికి సంకోచించదు కనుక చిన్న చిన్న ఊళ్ళలో బలంగా ఉన్నదంటారు.

(మెక్కార్తీని చివరకు ఓడించింది 'మసాచుసెట్స్ రాష్ట్రానికిచెందిన శ్రీ జోసెన్‌వెల్చ్. మళ్ళీ ఈరోజు అభినవ మెక్కార్తీ అవటమేకాక, అతన్ని మించిన వ్యక్తి పేరు కూడా 'వెల్చ్'. క్రిష్టియన్ పేరు మాత్రం రాబర్ట్. కెన్నెడీ మసాచుసెట్స్ రాష్ట్రం వారే.)

సకాలంలో అరికట్టకపోయినట్లయితే 'జాన్ బిర్చ్ సంఘం' ప్రపంచ శాంతినే భంగపరచగలదేమో ననిపిస్తుంది. ★



పెంపుడు జంతువులు - చిలుకలు

చిలకల పెంపకం

పక్షులు సుకుమారమైన జంతువులు. తేలికగా ప్రమాదాలకు గురి కావడమేకాక, మానసికంగా కూడా సులభంగా బాధపడే స్వభావాలు కలవి! చిలకలు పెంచేవారీవిషయం ప్రత్యేకంగా జ్ఞాపకం ఉంచుకొనడం మంచిది.

చిలకలను కొనడం కష్టంకాదు సులభంగా దొరుకుతాయి కాని వాటిని కొనేముందు కొన్ని విషయాలు గమనించాలి (1) ఆరు వారాలకు తక్కువ వయస్సు వాటిని తీసుకోవటం మంచిదికాదు మూడు నెలలలోపుగాఉండే పక్షిని కొనటం మంచిది (2) మల విసర్జన జరిగే ప్రదేశం చుట్టూ ఈకలు పాలిపోయిఉంటే ఆ పక్షికి విరేచనాల జబ్బు ఉన్నదన్నమాట. ఇటువంటి పక్షిని కొనకూడదు (3) కళ్లు నిర్మలమైనవిగా ఉండాలి పక్షి సంతోషంగా ఉన్నట్లు కనుపించాలి.

పంజరాలు

ఏ పక్షికైనా పంజరంలో కావలసినంత ఖాళీ కావాలి గుండ్రంగాఉండే పంజరంకన్నా 'నలు చదరంగాఉన్న పంజరం మంచిది. అడుగున్నర ఎత్తూ, ఒక అడుగు చదరమూ ఉన్న పంజరంలో చిలకలకు హాయిగా ఉంటుంది.

ఎన్నోరకాల పక్షులని పెంచవచ్చు కాని, ఈ వ్యాసంలో చిలకల పెంపకం మాత్రమే 'చర్చి'స్తున్నాము. పంజరంలో హాయిగా బ్రతకగల పక్షులలో చిలకలు ముఖ్యమైనవి. సులభంగా దొరుకుతాయి కూడా. చివర 'పంచ వర్ణాలు'కల పక్షుల విషయం ఒకటి రెండు వాక్యాలు వ్రాశాము.

లోహపు పంజరాలు మంచివేకాని, ఇత్తడిదైతే చిలకముక్కుతో కొరికి పంజర లోహాన్నే తినే ప్రమాదం ఉన్నది! రంగు పూసిన పంజరం రంగును కూడా చిలకలు తింటూఉంటాయి.

పంజరం 'నేల'మీద మెత్తటి రాళ్లను చిన్న చిన్న ముక్కలుగాచేసి పోస్తే మంచిది. ఎర్రమట్టిని సన్నగా పొడి చేయక ముక్కలు ముక్కలుగా పోయాలి. వీటిలో రెట్టలు ఇంకిపోవడమేకాక, ఇది ఆహారం అరగడానికి పక్షి మింగే పదార్థంగా కూడా పనికి వస్తుంది. ఇసుక మాత్రం వాడకూడదు.

పంజరంలో ఉయ్యాలలూ, ఇతర పరికరాలూ : పంజరంలో పక్షి ఉగేందుకు చిన్న ఉయ్యాల అవసరం. ఇది కాక అత్యవసరంగా ఉండవలసినవి : (1) స్నానం చేసేందుకు చిన్న పాత్ర (బొమ్మలో చూపించినటువంటిది. అల్యూమినియంతో చేసినవి సులభంగా దొరుకుతాయి. దొరకకపోతే కొంచెం 'లోతు' గాఉన్న పళ్లెం ఏదైనా పనికి వస్తుంది. (2) పలకలు కడిగినప్పుడువాడే 'సార చేప' ముక్క (సున్నం లాగ తెల్లగా ఉంట్టుంది సముద్రం ఒడ్డున దొరుకుతాయి అంగళ్ళలో కూడా అమ్ముతారు) దీనితో ఆడుకొనడం చిలకలకి ఇష్టం పైగా పక్షికి కావలసిన "కాలిష్యం" కూడా ఇందులో ఉంటుంది. పక్షులకు చాలా అవసరం.

ఆహారం ఉంచే 'పాత్ర' ఎప్పుడూ పంజరం లోనే ఉండాలి. చిన్న 'కప్పు' వంటిది సరిగ్గా సరిపోతుంది.

పరిశుభ్రత :—కనీసం వారానికి ఒకసారైనా పంజరాన్ని జాగ్రత్తగా కడగాలి. సబ్బు నీళ్ళు వయోగిస్తే మంచిది.

ఆ హా ర ం

చిలకలకి ఇష్టం వచ్చిన తిండి పెట్టకూడదు· ఇది ముఖ్యంగా గమనించవలసిన విషయం. వాటికి పడే వస్తువులు:(ఏ) జామపళ్ళ గింజలు, (బి) సూర్య కాంత పువ్వులో దొరికే గింజలు, (సి) మొక్కజొన్న గింజలు, (డి) 'ఓట్సు' ధాన్యం. కొందరు బెండ కాయ గింజలు కూడా అలవాటు చేస్తారు.

అప్పుడప్పుడు మాత్రం 'బిస్కట్' ముక్కలూ కేబేజి, లెట్యూస్‌వంటి ఆకు కూరలూ పెట్టాలి. కొబ్బరి పనికిరాదు. నారింజ, నిమ్మ, బత్తాయి పళ్ళు ఇవ్వకూడదు.

పళ్ళూ, ఆకుకూరలూ ఎక్కువయితే విరేచనాలు పట్టుకుంటాయి.

ఆహారం అతిగా అలవాటుచేస్తే పక్షి స్థూలమయి పోయి గుండె జబ్బుతో చనిపోవచ్చు.

మనుష్యులవలే పక్షులకు కూడా అప్పుడప్పుడు 'విందు' చేస్తే సంతోషిస్తాయి! ఉడుకబెట్టిన బంగాళాదుంప ముక్కలూ, పప్పులూ, బఠానీలూ, నారింజ మొదలైనవి తప్ప, తక్కిన పళ్ళూ, 'కారట్' ముక్కలూ, కాబేజి చిలకలకు ఇష్టం.

త ర్ఫీ దు

చిలకలు మాట్లాడగలవు. ఉయ్యాల వూగటమేకాక సర్కస్‌లోలాగ "పల్టీలు" కొడ్తూ ఉంటాయి. వీటికి తర్ఫీదు అవసరం. పెంచేవారికీ పక్షికీ పరిచయం కుదరాలి. ఆహారం ఇచ్చేవారే 'తర్ఫీదు' చేస్తే మంచిది. తనంతటతానే ఎప్పుడు చేతిమీద వాలి కూర్చుంటుందో అప్పుడు 'పరిచయం' ఏర్పడిందన్నమాట.

పక్షి కొంచెం కంగారుపడే రకమయితే చీకటిలో చేతిమీదకి తీసుకుంటే మంచిది. ఇది చీకటిలో తేలికగా చెయ్యవచ్చు—పక్షులు చీకటిలో కదలటానికి భయపడ్తాయి.

పక్షిని తరచూ పంజరంలోంచి బయటకు రానివ్వాలి.

ఏది ఎలాఉన్నా, పక్షుల ఎముకలు చాలా సుకుమారమైనవని గుర్తుంచుకుని మసలుకోవాలి.

మాటలు :—చిలక్కి చెప్పినట్లు చెప్పాలంటారు! పక్షి అనేవరకూ మళ్ళీ మళ్ళీ ఒకేమాట చెప్తూ ఉండాలి. అయితే అక్షరాలు నేర్పకూడదు చిలకలకు శబ్దాలు వస్తాయికాని వ్యాకరణం రాదు.

గోళ్ళు :—ఇవి మరీ పొడుగైతే పక్షి సరిగ్గా 'కూర్చో'లేదు. అందుచేత అతిగా పెరిగిన గోళ్ళ మొనలను జాగ్రత్త కత్తిరతో తీసివేయాలి. అశ్రద్ధగాచేస్తే గోళ్ళ చిగుళ్ళవద్ద రక్తనాళాలు తెగి నెత్తురు కారిపోతుంది. ఇది జరిగితే ఆచోట 'ఏంటిసెప్టిక్ పౌడర్' వేయాలి.

ప్రమాదాలు, అస్వస్థత

పక్షులు తలుపులపైనవాలి కూర్చున్నప్పుడు తెలియక తలుపులనుమూస్తే వాటికి గాయాలు తగులవచ్చు. ఎముకలు విరగవచ్చు. దేనికైనా డాక్టరువద్దకు వెంటనే తీసుకువెళ్ళడం మంచిది. ఇది సాధ్యం కానప్పుడు గాయాలకు మామూలుగా మనుష్యులకువాడే మందులనే మోతాదు తగ్గించి వాడాలి. ఎముకలు విరిగితే చీల్చిన అగ్గి పుల్లలతోకాని, చీపురు పుల్లలతోకాని కట్టుకట్టాలి· మనుష్యులకు ప్లాస్టర్ ఆవ్ పారిస్ వాడ్తారు. వీటికి గోళ్ళకు పూసుకునే రంగు వాడవచ్చు.

పక్షికి జబ్బు చేసినప్పుడు "వెటర్నరీ డాక్టర్‌కి చూపించటం అత్యుత్తమం. ఇది వీలుపడక పోతే గృహవైద్యంతో సరిపెట్టుకోవాలి.

విరేచనాలు :—ఆకు కూరలు మొదలైనవి అతిగా తిన్నప్పుడు విరేచనాలు అవవచ్చు. 'మిల్క్ ఆవ్ బిస్మత్ (Milk of Bismuth) అనే మందు ఎనిమిది, పది చుక్కలు ఒక కప్పు నిండాఉన్న గింజలతో కలిపి ఇస్తే తగ్గుతాయి. ఈ మందు ఏ ఫార్మసీ లోనైనా దొరుకుతుంది.

టెర్రామైసిన్, ఆరోమైసిన్, ఎక్రోమైసిన్ : మనుష్యులకు మందులు పని చేసినట్లే చిలకలక్కూడా పని చేస్తాయని ఈమధ్యనే తెలిసిందిట.



స్నానానికి పాత్ర

రెండు అవున్సుల నీటిలో 50 మిల్లీగ్రాముల మాత్రని—పైన చెప్పిన వాటిలో ఏదైనాసరే—కలిపి రోజుకి అర అవున్సు మోతాదు ఇవ్వాలని ఒక పుస్తకంలో వ్రాసి ఉన్నది.

పురుగులు :—చిలకలకు చీడ పట్టవచ్చు. దీనికి వైద్య సహాయం పొందటం మంచిది. పంజరం మాత్రం ఏదైనా 'క్రిమి వినాశక ద్రవ్యం'తో కడిగి తీరాలి.

చిలకలను ఎండలో ఎక్కువసేపు ఉంచితే తాళ లేవు కాని స్నానం చేసిన తర్వాత కొన్ని నిముషాలు ఎండలో ఉండనిస్తే ఫరవాలేదు.

"పంచవర్ణాలు" కలిగిన పక్షులు కూడా చిలకల జాతికి చెందినవే. వీటిని సంపాదించగలిగినవారికి పై నియమాలను కొద్ది మార్పులతో పాటిస్తే చాలు. (1) తీపి వస్తువులు అసలు పనికి రావు. (2)చిన్నరొట్టెముక్కలను పాలలోముంచిపెట్టవచ్చు. 3) తలపైన చారలుకాకముక్కలు ముక్కలుగా ఉన్న) పక్షులనే కొనటం మంచిది. చారలువస్తే వయస్సు మూడు నెలలు దాటిందన్నమాట.

[ఫొటో—శ్రీ వి. కుటుంబరావు.]

కి ం కి రా త ము

మన్మథుడి వాహనంగా, ప్రబంధనాయికలకు తోడుగా, మాంత్రికుల (ప్రత్యేకంగా చెడ్డరకం వారికి) ఆయువుపట్టుస్థానంగా, కథలు చెప్పేవక్తగా—చిల(లు) కకు మన సాహిత్యంలో ప్రత్యేకమయిన స్థానం ఉంది. ఈరోజుల్లోకూడా అదను దొరికితే హీరోయిన్ పాట వినిపించడానికి మిషగా చిలకని వాడని సినిమా డైరక్టర్లు తక్కువ!

అరిస్టాటిల్ చిలకలు భారతదేశంనుంచి వచ్చాయన్నాడుట. బైబిల్‌లోకాని, ప్రాచీన ఈజిప్టు చిత్రాలలోకాని చిలక ప్రసక్తి లేనేలేదు. యూరోప్‌కు చిలక భారతదేశంనుంచి ఎగుమతి అయిందనటంలో సందేహంలేదు. (కాని చిలకలు ఆఫ్రికాలో, అమెరికాలో, పసిఫిక్ ద్వీపాలలో కూడా ఉండేవి. మలయాలో ఉన్నన్ని చిలకలు ఆసియాలో ఏదేశంలోనూ లేవు. సెలెబస్, సాలమన్ ద్వీపాలలో అయినన్ పసిఫిక్ మహా సముద్రంలోనివి—చిలకలు మరీ విరివిగా ఉంటాయి.)

అలెగ్జాండరు భారతదేశంలోనికి వచ్చినప్పుడు చిలకలను చూసి మోజుపడి తనవెంట కొన్ని తీసుకుపోయాడని ప్రతీతి. రోమన్లకు చిలకలంటే అపరిమితమైన వింతగా ఉండేది. చిలకలనుతినేవారు కూడా. ఒక రోమన్ రాజు సింహాలకు చిలకలను ఆహారంగా వేసేవాడుట.

చిలకలు సాధారణంగా ఏకపత్నీ—లేక సతీ—వ్రతులుగా ఉంటాయంటారు! ఆహారాన్ని కాళ్ళతో నోటిలోకి తీసుకునే పక్షి ఇది ఒకటేనని ప్రతీతి. చిలకలు చాలా సంవత్సరాలు బ్రతుకుతాయి. ఏభై సంవత్సరాలకన్నా ఆయుర్దాయంకల చిలకలెన్నో ఉన్నాయి! అమెరికాలో కొన్ని చిలకలు 1000 డాలర్లకు కూడా అమ్ముడుపోతాయి. (సుమారు 5,000 రూపాయలు!) ఎన్ని మాటలు నేర్చుకుంటే ధర అంత ఎక్కువగా ఉంటుందిట.



అమ్మబాబోయ్! అవుతే పేని పోర్షను వచ్చినా వెయ్యను"—మొదటిరోజు రిహార్సల్సు హాలులో కంఠం ప్రతిధ్వనించింది.

'డ్రమాటిక్ అసోసియేషన్" కార్యదర్శి రామం నె పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది.

ఒరేయ్—రావూ నీకో శతకోటి దండాలు! డైరెక్టరుతో ప్రిన్సిపాల్ తో నా నెత్తిన అక్షంతలు వేయించకు. సెలవుల్లో ఇంటికి పంపిన ంతానేర్చుకొని "కల్చరల్ వీక్" ఒక వారం ఉందనంగా ఇలా గొడవచేస్తే !—మా అమ్మవుగదూ"రామం బతిమాల సాగాడు.

నాకు ముందుగా చెప్పారేమిటి—ఇందులో ఆ'గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్' యిన్ పోర్షనువేస్తుందని"..... రావు గర్జించాడు.

అయినా నీకు పార్వతంటే అంత భయంఎందుకురా?" — సత్యం పొడిచాడు.

'ప్రిన్సిపాలుగారి కూతురుకదరా" — రంజనువెక్కిరింపుగా అన్నారు.

'అబ్బెబ్బె! నాకా? భయమా? అలాంటిమీదేలేదే!" రావు తడబడ్డాడు.

'మరి లేకపోతే ఏమిటిరా వెధవా ఈ వాగుడు? హాయిగా అందాల పక్కన నటించే అవకాశంలభించిందని ఆనందపడక—అమ్మబాబో



"ఫిజిక్సంటే ఇంతేనండి" అంది పార్వతి-రావుతో. ఆమె మొహంలో గర్వం, ఆనందం తొణికిసలాడాయి. రావు అవమాన భారంచే కృంగిపోయాడు. ఇంతకూ జరిగింది ఏమిటో?

"ఒరేయ్!—నిజంగా వాడిమాటలు విని మోస పోకు! అందాలభరిణ ప్రక్కన నటించే అవకాశం దొరికిందికదా అని ఉబ్బిపోయి—ఏమయినా కోతి వేషాలు వేశావో—చెంపకు చెయ్యి పరంబగు—తదను గుణంబుగా అయ్యగారి కంట నీరాదేశంబగు" అన్నాడు రంజన్ నవ్వుతూ.

"ఆ! వీడి కామాత్రం ధైర్యం ఎక్కడేడిచిం దిరా! నాటకంలో నటించడానికి భయపడేవాడికి కోతివేషాలు వెయ్యటం కూడ చేతనవునా?" రావుని ఎలాగయినా ఒప్పిద్దామని రామం అన్నాడు.

రావు తనకి పెద్ద అవమానం జరిగినట్లు భావిం చాడు.

"ఒరేయ్! మీరంతా నవ్వే చవటదద్దమ్మ క్రింద కట్టేసి — మీరేదో పెద్ద రసికులయి నట్లు మాట్లాడతారేం! ఆ అమ్మాయితో నటించ టానికి భయం కాదు ఇష్టంలేక, ఆ అమ్మాయి మీద కోపంచేత" — అన్నాడు.

"ఎందుకో పాపం—అబ్బాయిగారికి అలుక" రంజన్‌సందేహం.

"వీడి దేవానందు క్రాపుని చూచి— "ఈవి నింగ్ కేప్" అని పేరు పెట్టలేదూ — అందుకు, సత్యంగట్టిగా అన్నాడు

వీడు మాత్రం—ఆ అమ్మాయిని "గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్, అని అనటంలా" రంజన్ అటు వేపు వకాల్తా పుచ్చుకొన్నాడు.

"చాలించండిరా మీ వ్యాఖ్యలు!" రావు గట్టిగా అరచాడు.

"ఒరేయ్ మీరూ కాసేపాగండిరా. వాడసలే ఏడు స్తుంటే మధ్యమీ గొడవేమిటి! ఓరే రావూ నీకు భయమయితే ఆ అమ్మాయితో కాస్త ఎక్కువ పరిచయం అయితే అదే పోతుంది. ఇహ కోప మన్నావా—ఈ డ్రామాల విషయంగా తీర్చుకో వచ్చులేరా—లే—ఆ అమ్మాయి వచ్చే వేళ అయింది అ"న్నాడు రామం అనునయంగా.

"ఒకవేళ—ఈ మాట తమకే అవమానం జరిగితే—సోమవారం—కాలేజి ఎగ్జిబిషన్స్‌లో తీర్చుకోవచ్చులే!"

రావుకి అవమానంతోపాటు ఆవేశం కూడ కలిగింది. తనన్ని అవస్థలుపెట్టి ఏడిపిస్తున్న ఈ దుష్టచతుష్టయంపైనా—దీనికంతకూ మూల కారణమైన పార్వతిమీద ప్రతీకారం తీర్చుకోవాలనుకొన్నాడు.

ఇంతలో పార్వతి నలుగురైదుగురు ఆడపిల్లలతో నవ్వుతూ హాలులో ప్రవేశించింది. రావుకి ఆమెకి ఒక్కక్షణం పడదు. అతన్ని చూస్తున్న కొద్దీ ఆమె కతనిని ఏడిపించాలనిపిస్తోంది.

'నమస్కారం రావుజీ' అంది దగ్గిరగా వచ్చి.

'శతకోటి వందనాలండీ' రావు తనకోపం అంతా కలిపి వ్యంగంగా అన్నాడు.

"ఏమండోయ్—ఎవరిమీద కోపమో అంతా మామీద చూపెడుతున్నారు" గిల్లి కజ్జా పెట్టుకో సాగింది పార్వతి.

సత్యం—రంజన్ ఆమె సౌందర్యావలోకనంలో మునిగిపోయారు.

పరిస్థితి ఇంక మించిపోతుందని గ్రహించి రామం—'ఏమండోయ్—టైమవుతోంది. తొందరగా మొదలెడుదాము' అంటూ రిహార్సల్సు మొదలెట్టించాడు.

గంటలో రిహార్సల్సు చివరికి వచ్చాయి. చివర్లో పార్వతి పోర్షన్ మర్చిపోయింది. ఇంతవరకు ఆమెనేడిపించటానికి కారణం దొరకని రావుకు సదవకాశం లభించినట్లయింది.

"ప్చ్!—పాపం" అన్నాడు బిగ్గరగా.

పార్వతికి ఎదురుదెబ్బ పడ్డట్టయింది. "ఏమండోయ్—మీ జువాలజీ అనర్సు వాళ్ళం కాము—బట్టీపట్టడంలో మాత్రం ప్రథములుగా రావటానికి"— అంది.

"మీ ఫిజిక్సు ఆనర్సువాళ్ళు ననబోయి పొరపాటున మా కన్వయించారేమో?" అన్నాడు రావు.

"చూద్దాంగా మీ జువాలజీవారి గొప్ప—రేపటి ఎగ్జిబిషన్‌లో" అంది.

"మీ ఫిజిక్సువాళ్ళ సంగతీ తేలిపోతుందిగా!" అన్నాడు రావు.

"చూద్దాంగా" వెటకారంచేసింది పార్వతి.

రిహార్సల్సు అయిపోయాయి. రామం పరుగెత్తిపోయిన గుండెను మళ్ళీ చేతబట్టుకొని, ఈ యుద్ధం రిహార్సల్సు మొదట రాకుండా—చివర వచ్చేలా కృపచూపిన భగవంతుడికి సెల్యూట్‌కొట్టి—రేపు అదేవేళకి కలుసుకోవాలని అందరితోచెప్పి రిహార్సల్సు ముగించాడు.

అందరూ బయలుదేరారు. పార్వతి దర్జాగా తన చేతి సంచిలోంచి ఒక "ఈవినింగ్ కేప్" తీసుకొని నెత్తినపెట్టుకొంది. రావు మొహం ఆముదం తాగిన వాడిలా తయారయింది. అమ్మాయిలంతా నవ్వారు. మన మిత్రబృందం తెల్లమొహం వేసింది. పెద్ద హాలులోంచి అందరూ నడవసాగారు. పార్వతి గర్వంగా చకచకా నడుస్తూ తలుపు దగ్గిరకు వెళ్ళింది. తలుపువెనుక రావు మధ్యలో వెళ్ళివేసిన 'గ్రాండ్‌ట్రంక్ ఎక్స్‌ప్రెస్' బొమ్మ వెక్కిరిస్తూ కనబడింది. దీంతో ఆమె బిత్తరపోయింది.

అంతిమ విజయం

మిత్రబృందం మొహాలు వికసించాయి.

పార్వతి "ఎగ్జిబిషన్‌లో మీపనిపడతా రావూ' అనుకొంటూ కోపంతో తలుపును తోసుకుని బయట పడ్డది.

"ఏరా రామం. ఇప్పుడేమంటావు? ఆ అమ్మాయంటే నాకు భయమా?" అన్నాడు రావు.

"అబ్బే!—నీ కా ఛ! ఛ! అదేం లేదురా' వ్యవహారం బెడిసికొట్టిందంటే 'డ్రమాటిక్ అసోసియేషన్' కార్యదర్శిపదవికి తిలోదకా లొదులుకోవలసివస్తుందని"— అన్నాడు రామం.

"ఏమయినా రావూ అంతిమ విజయం నీదేనోయ్' అన్నాడు రంజన్.

మిత్రబృందాని కానాడు బలవంతాన రావు నెత్తిన చేతులుపెట్టవలసిన పని ఏర్పడలేదు. రావే స్వయంగా కాంటీన్‌లో ఓ ఐదు రూపాయల హస్తం నెత్తిన పెటు కొన్నాడు.

*   *   *

ఆరోజు ఎగ్జిబిషన్ మొదటిరోజు. రావు ఇంట్లో దువ్వినతలనే పదిమాట్లు దువ్వుతూ, ఇంతలేసి తన క్రాపు ఆ పార్వతికి ఈ'వినింగ్ క్యాప్'లా ఎందుకు కనబడ్డదో సందేహంలో పడ్డాడు రావు.

"ఒరేయ్ రావూ" వీధిలోంచి కేకలు వినబడ్డాయి.

"జువాలజి హెడ్' అన్న బ్యాడ్జీ తగిలించుకొని వీధిలోకి ఊడిపడ్డాడు.

"ఏమిట్రా—హెడ్ ఆఫ్ అసోసియేషన్ ఇంత ఆలస్యంగావస్తే ఎలా'—సత్యం" నవ్వాడు.

"అవనీయరా పాపం. మేకప్" రంజన్ అన్నాడు.

"బయలుదేరండ్రా—వెధవాయిలూ!"—అంటూ సైకిల్ పెడల్‌ని ఒక్క తొక్కు తొక్కాడు రామం. మిత్రబృందం బయల్దేరింది.

"ఒరేయ్ రావు ఒక్క కొత్త వార్త!"

> ఐదారేళ్ళ పిల్ల రెండు చేతుల్లో బటానీలు, వేరుశనగ కాయలు పట్టుకొని, అవి దాచుకోడం కుదరక ప్రక్కనున్న ముసలమ్మతో—
>
> అవ్వా; అవ్వా!...నీకు పళ్ళున్నాయా?
>
> "లేవె మనమరాలా! ఉన్న పళ్ళన్నీ ఊడిపోయాయి."
>
> "అయితే ఇవి కాసేపు నీ దగ్గరుంచుతావా?"
>
> పీటర్ సింగ్ (ఊయ్యూరు)

"ఏమిటి?" అన్నాడు రావు సైకలు వేగం హెచ్చించుతూ.

"ఫిజిక్సు—ఎగ్జిబిషన్ హెడ్ ఆన్ అసోసియేషన్ ఎవరో తెలుసా?" రంజన్ అన్నాడు.

"ఎవరేమిటి?—కొంపతీసి మన 'గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్' కాదుగా?" రావు సందేహం.

"లక్షణంగానూ—సందేహం లేకుండానూ—ఫిజిక్సు హెడ్ ఆఫ్ అసోసియేషన్—ప్రిన్సిపాలిగారి కుమారీమణి అయిన—మిస్ పార్వతీదేవిగారు' రామం ఏకరువు పెట్టాడు.

"నిజమా? కోతలా?"—

"కోతలు కోయవలసిన అవసరం ఏంట్రా మాకు స్టయిల్‌గా బ్యాడ్జి తగిలించుకొని—ప్రిన్సిపాల్‌గారి కారులో—అరడజను అమ్మాయిలతో వెళ్తుంటే — ఇప్పుడే మా యీ అరడజను కన్నులతో చూచాము' అన్నారు అంతాను—ఏకగ్రీవంగా.

రావు ఆలోచనలో పడ్డాడు. కల్చరల్ వీక్కి ముందు పార్వతి అన్నమాటలు గుర్తుకొచ్చాయి. ఏమయినాసరే—ఈమాటు ఆ అమ్మాయి వెధవవేషాలు వేసిందంటే తప్పక బుద్ధిచెప్పాలి! ప్రిన్సిపాల్ గారి కూతురయినంతమాత్రాన అంత గర్వమా? అనుకొన్నాడు. ఇంతలో యూనివర్శిటీ బిల్డింగ్సు సమీపించాయి. సైకిళ్ళను సైకిల్‌స్టాండ్స్‌లో పడేసి నెమ్మదిగా లోపలకు బయలుదేరారు. బిల్డింగ్స్ అన్నీ జండాలతో, తోరణాలతో కళకళలాడుతున్నాయి. అమ్మాయిలు—అబ్బాయిలు హుషారుగా అటూ ఇటూ తిరుగుతున్నారు. అన్నిటినీ పరిశీలిస్తూ ప్రొఫెసర్లు, లెక్చెరర్లు తిరుగుతున్నారు. రంజన్—సత్యం, టా టా చెప్పేసి కెమిస్ట్రీశాఖ వైపు వెళ్ళిపోయారు. రావు, రామం తమ "జువాలజీ అసోసియేషన్' వైపు బయలుదేరారు.

జిందాబాద్!—మిస్టర్ జువాలజీ హెడ్!

రావు ప్రక్కకు తిరిగి చూచాడు. నల్లనిచీర ధరించి, లేత ఎరుపురంగు జాకెట్ ధరించి, నవ్వుతున్న పార్వతి కనబడింది. ఆమె వాలుజడ బుజాలమీదుగా ముందుకువచ్చి, నల్ల త్రాచుపామును గుర్తుకు తెస్తుంది. రావుకి ఆమెపై ఎంతకోపంగా ఉన్నా—ఆమె అందానికి ముగ్ధుడై —ఆమెవైపే చూస్తూ నుంచుండిపోయాడు.

"జిందాబాద్ రావుగారూ" మళ్ళీ అందామె.

"నమస్తే!" అనేసి వెళ్ళిపోయాడు. వెనక నవ్వుల వర్షం.

హాలులోకి అడుగుపెడుతూనే బి. యస్ సి. స్టూడెంట్సు ఎదురయి 'సార్ ఇవి ఎలా అరేంజ్ చెయ్యాలి. దీని అర్థం ఏమిటి?'— అని అడుగుతుంటే—తన 'సీనియారిటీ' దర్జాను చూపెడుతూ సమాధానాలుచెప్పి ముందుకు సాగిపోయాడు రావు.

"ఒరే రామం. నీకిచ్చిన బ్రాంచ్‌ని ఎలా అరేంజ్ చేశావు"

"రారా చూపెడతా' అంటూ లాక్కెళ్ళాడు రామం. అంతా చూచాక అమోఘంరా అన్నాడు రావు.

"నీవు గీచి ఇచ్చిన ప్లాను ప్రకారమే అరేంజ్ చేశాను'— అంటూ రావు బ్రాంచ్‌కి వచ్చారిద్దరూ. రావుకి చేపలశాఖ వచ్చింది. రావు నాన్నగారు ఫిషరీ డిపార్టుమెంట్—డైరెక్టర్‌గా పని చేస్తున్నందున

రావు రక రకాల చేపలు—జలగలు తెచ్చి అందంగా ఆకర్షణీయంగా అమర్చాడు. చాలా బాగుందన్నాడు రామం.

“వాళ్ళు — ఫిజిక్సువాళ్ళు ఇలా ఏర్పాటు చేయ గలరంటావా? ఈ బ్రాంచ్ చూస్తే చాలు—పార్వతి హడలు కావాలి' అన్నాడు రావు గర్వంగా.

“ఏమోరా భాయి! ఎగ్జిబిషన్ మొదలుపెట్టే టైం అయింది. నీవు మాత్రం లేనిపోని గొడవలు నెత్తికి తెచ్చుకోక—రామం తన బ్రాంచి వాలంటియర్స్ దగ్గిరకు వెళ్ళిపోయాడు.

ఎగ్జిబిషన్ మొదలుపెట్టారు. జనులు వరుసగా లోపలికి వస్తున్నారు. ఒక్కొక్క బి. యస్.సి. విద్యార్థి ఒక్కొక్క టేబిల్ దగ్గిర నుంచోని వివరిస్తున్నారు వారికి. మా ఎమ్. ఎస్. సి. విద్యార్థుల దర్జా చూడండి—నా లీడర్‌షిప్ పరాక్రమం చూడండి అన్నట్లు రావు ఇటూ అటూ పచారు చేస్తూ “సూపర్‌వైజ్ ' చేయసాగాడు. ఓ గంట గడిచేసరికి ఈ ఉద్యోగం విసుగనిపించిం దతనికి. తన అసోసియేషన్‌ను బాగా ఏర్పాటు చేశామన్న నమ్మకం గర్వం కుదిరాయి. ఇతరుల సెక్షన్ను చూడడానికి బయలుదేరాడు. కెమిస్ట్రీ సెక్షన్ అంతా పూర్తిగా చూచాక, ఫిజిక్సు వైపు బయలు దేరాడు రావు. వెళ్ళటానికిముందు రావుకి రంజన్ జాగ్రత్త, పార్వతి లీడర్ అని హెచ్చరించాడు.

“ఏడిసిందిలే!”—అంటూ బయలుదేరాడు.

“జిందాబాద్ రావుజీ” రావు చిరాకుతో చూచాడు. పార్వతి నవ్వుతోంది.

“ఏమిటిలా వచ్చారు?”—అంది.

“చూద్దామని”

“రండి. నేను చూపెడతా — మొదట ఏ బ్రాంచికి వస్తారు” - ప్రశ్నించింది. ఆ ప్రశ్న లోనూ హేళన గోచరించింది రావుకి.

“మీరేశాఖ 'లీడ్' చేస్తున్నారు”—అడిగాడు.

“ఎలెక్ట్రిసిటీ !”

“అటువైపే వెడదాం. పదండి”—అన్నాడు. మనసులో అతనికి ఏం గొడవ చేస్తుందో అని సందేహంగానే ఉంది. పార్వతి ఒక్కొక్కదాన్ని వివరిస్తూ గర్వంగా రావును ముందుకు తీసికెళ్ళింది. ఆమె కూడ చాలా బాగా ఏర్పాటుచేసింది. కాని రావుకి అది బయట చెప్పాలనిలేదు. ఇద్దరూ నెమ్మదిగా మూడోబల్ల దగ్గరకు వచ్చారు. వివిధ శాఖలకు చెందిన చక్కటి పుస్తకాలు — చక్కని అట్టలతో ఆకర్షణీయంగా అమర్చబడి ఉన్నాయి దానిమీద. పార్వతివైపు చూచాడు దీని—ప్రత్యేకత ఏమిటన్నట్లు. ఆమె ప్రక్కనున్న వాలంటియర్‌తో మాట్లాడుతూ ఉంది. రావు మళ్ళీ బల్లమీదకి దృష్టి మళ్ళించాడు. “జువాలజీ' అన్న పుస్తకం. కొట్టవచ్చినట్లు కనబడుతోంది. రావు ఇక ఆగలేక పోయాడు. చేతో ఒక మాటు అట్టను తిరగేశాడు

అంతే! రావు 'అమ్మా' అంటూ చెయ్యి వెనక్కి లాగుకొన్నాడు. అతనికి కొట్టిన షాకు అయిదారు సెకండ్లవరకతన్నీ లోకంలోకి తేలేదు. పార్వతి కలకలమంటూ నవ్వుతోంది. రావు ఆమెవైపు తీక్షణంగా చూచాడు.

“ఫిజిక్సంటే ఇంతేనండీ!” అంది పార్వతి గర్వంగా. చుట్టూఉన్న వాలంటియర్సు పకాలునవ్వారు. పార్వతిమొహంలో “జువాలజీ అసోసియేషన్ హెడ్ కే” షాకు నిచ్చానన్న గర్వం, రావుకి తగిన శాస్తి చేశానన్న ఆనందం, సంతృప్తి గోచరిస్తున్నాయి. రావు అవమానభారంచే కృంగిపోయాడు. తను ఇంత తెలివితక్కువగా ప్రవర్తించానెందుకని వాపోయాడు. తనకు షాకు నివ్వాలనే, జువాలజీ పుస్తకంలోకి కరెంట్ అరేంజ్ చేసిందని అర్థంచేసుకొన్నాడు. పార్వతి ఇంకా నవ్వుతోంది.

“నాకు తెలుసు మిస్ పార్వతీ—ఈ హాలులోకి అడుగుపెట్టగానే ఇలాంటి షాకు ఏమయినా బహుమతిగా లభిస్తుందని తెలుసు! కాని ఇంత తొందరగా మిగతా బ్రాంచీలేవీ చూడకముందే ఇస్తారని ఊహించలేదు. ఇలా అవుతే మీకు ప్రేక్షకులు తక్కువవుతారు. సెలవు తమ సత్కారానికి ధన్యవాదాలు” చరచరా వెళ్ళిపోయాడు రావు అక్కడ నుంచి. వెనక మామూలుగ నవ్వుల వర్షం.

ఒక బిచ్చగాడు రోడ్డుమీద మూర్ఛపడిపోయాడు. జనమంతా గుంపుగా చేరేరు. తలా ఒకటి చెపుతున్నారు.

'ఎండదెబ్బ తగిలింది. చెరకు రసం పట్టండి' అన్నాడో వృద్ధుడు.

'అందరూ అడ్డంలేచి గాలి తగలనివ్వండి' అన్నాడొక యువకుడు

'చెరకు పానకం పట్టండి' అన్నాడా వృద్ధుడు.

'అరె! పాపం. ఆసుపత్రికి తీసుకు వెళ్ళండి' అన్నారెవరో.

'కాదు. చెరకుపానకం పడితే తేరుకుంటాడు' మళ్ళీ అన్నాడు వృద్ధుడు.

ఇలా తలొకసలహా యివ్వటం మొదలుపెట్టేరు కానీ, ఎవరు సహాయం చేయటం లేదు. బిచ్చగాడు లేచి కోపంగా

'అయ్యా మీారందరు నాకు కోపం తెప్పించక కాసేపు ఆవృద్ధుడు చెప్పేది వినండి' అనేసి మళ్ళీ పడిపోయాడు.

ఎం. రామకృష్ణ, (గుంటూరు.)

మధ్యాహ్నం భోజనాల వేళయింది. వాలంటియర్స్ అంతా భోజనాలకి వెళ్ళిపోతున్నారు. రావు తన బ్రాంచ్ చివర టేబిలుమీద వాలిపోయి ఉన్నాడు. జరిగిన అవమానంతో అతని హృదయం దహించుకపోతోంది. 'ఫిజిక్సంటే ఇంతేనండీ' అన్న పార్వతివాక్యం అతనిలో ప్రతిధ్వనిస్తోంది. జువాలజీ అసోసియేషన్ హెడ్ కే షాకునిచ్చామని కాలేజీలో డబ్బాచాటతారని రావుకి తెలుసు. తనకే కాక తన సెక్షన్‌కంతా అవమానం జరిగినట్టు భావించాడు రావు. అతనిలో ప్రతీకారవాంఛ రేకెత్తింది. కాని ఏమార్గం గోచరించలేదు. భగవంతుడులేడు — ఆటమ్‌కు సెల్యూట్ కొడతా అనే రావు భగవంతుని ప్రార్థిస్తూ లేచి నుంచున్నాడు ఇప్పుడు. ఇంతలో అతని కండ్లలో వెలుగొచ్చింది. కుళాయిదగ్గిర కెళ్ళి మొహం ఓమాటు కడుక్కొన్నాడు. క్రాపు నోమాటు సర్దుకొని జేబు చూచుకొన్నాడు. పధ్నాలుగు రూపాయలున్నాయి. టైము పన్నెండున్నర కావస్తోంది. భోజనం చేయకుండా యూనివర్సిటీ బిల్డింగ్సునుండి బయటికొచ్చాడు టాక్సీ ఎక్కి ఫిషరీ ఆఫీసుకి బయల్దేరాడు. ఫిషరీ డైరెక్టరయిన వాళ్ళ నాన్నగారప్పుడే ఇంటికి వెడుతున్నారు. రావునిచూచి 'ఏమిట్రా ఇలా వచ్చావు' అన్నారు.

“ఏం లేదండీ కొన్ని కొత్తరకం చేపలు తీసుకెడదామని” నసిగాడు రావు.

'నిన్న తీసుకెళ్ళినవి చాలవూ—సరే అసిస్టెంట్ డైరక్టర్ని పిలు' అంటూ రావునాన్న అసిస్టెంట్ డైరెక్టరుకి రావుకు కావలసిన చేపలు ఇమ్మని చెప్పారు.

“మీరు ఎగ్జిబిషన్ చూడటానికి ఎప్పుడు వస్తారండీ” అడిగాడు రావు.

“సాయంకాలం నాలుగుకి' అనేసి వెళ్ళిపోయారాయన ఇంటికి.

రావు తనకు కావలసిన చేపలన్నీ అరగంట ఏరుకొని తీసుకొన్నాడు. తరువాత చివరకు నాలుగు 'రే చాపలు' కావాలన్నాడు.

“సార్—సార్” గాభరాగ అన్నాడు అసిస్టెంట్ డైరెక్టరు. “అవి చాల ప్రమాదంసార్—ఇండియా చుట్టుపట్ల దొరకవు ! అన్నాడు

“ఫరవాలేదులెండి” రావు చాలా బలవంతం చేశాడు. ఆయన సందేహిస్తూనే రావుని నాలుగు “రే—చేపలు” తీసుకో నిచ్చాడు.

* * *

మధ్యాహ్నం మూడున్నరవుతోంది. అప్పటికే కాలేజంతా పాక్కిపోయింది జువాలజీ హెడ్‌కు జరిగిన అవమానం. రామం కంగారుగా వచ్చి సంగతేమిటని అడిగాడు రావుని. రావు నవ్వి ఊరుకొన్నాడు. ఇంతలో ముఖద్వారం వద్ద పెద్ద గలభా అయింది. రావు వెళ్ళి చూచాడు. పార్వతి ఓ ఇరవైమంది ఫిజిక్సు అమ్మాయిలతోసహా జువాలజీ వాలంటీ

(31-వ పేజీ చూడుడు)



దైవజ్ఞ పాతూరి శ్రీరామమూర్తి

3-5-1961 బుధవారము మొదలు

9-5-1961 మంగళవారము వరకు

మేషం :

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా.)

తోటివారిని మెప్పించి ఫలితం పొందటం నిమిత్తం క్రొత్త పద్ధతులను అనుసరించవలసి వస్తుంది. ముఖ్యంగా మాట నేర్పుతో అవతలివారిని ఆకర్షించగలుగుతారు. చాలా రోజులకుముందు చేసిన ప్రయత్నాలు ప్రస్తుతం ఫలించగల అవకాశాలున్నవి. పరిశ్రమ అధికంగాఉన్నా విసుగుదల మాత్రం తోచదు. బంధు మిత్రులనిమిత్తం మీరు చేసిన శ్రమ అనుకూలిస్తుంది. వ్యాపార సంబంధమైన లావాదేవీలలో పొరపాట్లు జరగటంవల్ల కలహ ప్రసంగాలు రాగలవు ఈ కాలంలో జరిగే ఖర్చులు శుభ సంతోషాలనిమిత్తం విశేషం పదిమందిలో హోదా, ఆడంబరము బాగా పెరుగుతవి అయితే ఎవరు ఏ విధంగా నిమ్ములను పొగడినా మీ శ్రమకు తగిన ఫలితం వస్తున్నదా? లేదా? అనే విషయాన్ని చూచుకొనటం అవసరం. 4,5 తేదులలో విశేష ధన లాభం, ఉన్నతస్థితియందుండే వారితో సమావేశం, ధర్మకార్యాలు.

* * *

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా.)

మీ బాధ్యతలను నెరవేర్చుకొనటంలో పట్టుదలతో నిలబడ గలుగుతారు. కుటుంబంలోనివారి అనారోగ్య కారణాలవల్ల మన శ్శాంతికి భంగం కలుగవచ్చు. సంఘంలో పెద్దరికం నిలుపుకో గలుగుతారు. కలసి వచ్చినట్లు కనుపించిన ప్రతిపనీ వెంటనే జరుగుతుందనే నమ్మకం పెట్టుకోవద్దు.ఇతరుల విరోధాలలో నిష్కారణంగా నిమ్ములను రచ్చకులాగే మనుష్యులు ఉంటారు. భాగస్తులతో కలిసి చేయు వ్యాపార వ్యవహారాలలో పొరపులు ఆరంభం కాగల అవకాశాలున్నవి. సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణంవల్ల వ్యవహార విజయం, వృత్తిలో అభివృద్ధి లభిస్తవి. ప్రయాణాలు చేయవలసి వస్తుంది. వారాంతంలో అల్లులతో కలహాలు వస్తవి. 6, 7 తేదులలో కష్టవార్తలు, బంధు మిత్రులరాక, అధిక వ్యయం.

* * *

మిథునం :

(మృగశిర 3, 4 పా, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

మీరు తలపెట్టిన పనులే జరుగక పోవచ్చు. కాని, జరిగిన కార్యక్రమాలు మాత్రం సంతృప్తికరమైన ఫలితాన్ని ఇస్తవి. ఇతరులవద్దనుంచి రావలసిన ధనం సకాలంలో చేతికి వస్తుంది. స్త్రీరాస్తులమీదకాని, వ్యవహారసంబంధమైన లావాదేవీలలోకాని, ధనం విశేషంగా వినియోగించవలసి వస్తుంది. ఇతరుల మీద మీకుగల సందేహాలు నివృత్తిఅయి మీ నిత్య కృత్యాలలో చురుకుగా వ్యవహరించగలుగుతారు. ధర్మ కార్యాలవిషయంలో ఇతరుల సలహాకన్నా, స్వతంత్రించిచేయటంఉత్తమం అనే విషయం తెలుసుకో గలుగుతారు. లోగడ మీరు ఆలోచించకుండా పొరపాటుగా చెప్పిన మాటను నెరవేర్చుకొనటం నిమిత్తం అనేకవిధాల శ్రమ పడవలసి వస్తుంది ఒక కార్యం నిమిత్తంచేసినప్రయత్నం మరొక కార్యం నిమిత్తం ఉపయోగించవలసి వస్తుంది. పండితులతో సమావేశం లభిస్తుంది. 8, 9 తేదులలో దుబారా ఖర్చులు, కుటుంబంలో అభిప్రాయ భేదాలు.

* * *

> **గ్రహస్థితి**
>
> మేషంలో సూర్యుడు, మేష వృషభాలలో బుధుడు, కర్కాటకంలో అంగారకుడు, సింహంలో రాహువు, మకరంలో గురు శనులు, కుంభంలో కేతువు, మీనంలో శుక్రుడు, వృశ్చిక, ధనుర్మకర కుంభాలలో చంద్రుడు.

కర్కాటకం :

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష)

ఈవారం అన్ని విషయాలలోను జాగ్రత్తగా ఉండవలసిన సమయం. మీరు ఎవరి మాటను అనుసరించినా మరొకరితో విరోధం తెచ్చుకోవలసి వస్తుంది. అయితే ధన కష్టం మాత్రం అంతగా కనుపించదు. వృత్తి ఉద్యోగాలకు సంబంధించిన పనులు మాత్రం సకాలంలో నెరవేర్చి మాట దక్కించుకో గలుగుతారు. చాటునఉండి మిమ్ములను గురించి తేలికగా మాట్లాడేవా రుంటారు. కోర్టు కచేరీలలో మీ శ్రమ ఫలితానికి వస్తుంది. పెద్ద మనుష్యుల ద్వారా మాట సహాయంతో జరుగవలసిన పనులు నిరాటంకంగా జరుగుతవి. అగ్ని, ఆయుధాలు మొదలయిన వాటికి సంబంధించిన పనులలో జాగ్రత్తగా ఉండండి. వారాంతంలో బంధు విరోధం వస్తుంది. నౌకరులవల్ల మోసం జరుగవచ్చు. 8, 9 తేదులలో ఆందోళన, అకస్మాత్తుగా దేహ బాధలు.

* * *

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

మీకు ఈవారం అనుకూలంగా ఉంటుంది. ఆలోచించిన ప్రతి పనీ సకాలంలో సంతృప్తిగా జరుగుతుంది మీతో లావాదేవీలు, సంబంధము ఉన్నటువంటివారే మీ మాటను వ్యతిరేకిస్తారు. సుఖ సంతోష కార్యాలు జరుగుతవి. పడమర దిక్కునుంచి లాభ వార్తలు వస్తవి. మీ సందేహాలను, సమస్యలను పోగొట్టి మిమ్ములనుకార్యరంగంలో ప్రవేశపెట్టగల పెద్ద మనుష్యులు లభిస్తారు. వస్త్రాలు, ఆభరణాలు మొదలయినవి కొనగలుగుతారు. ముఖ్యంగా ఇతరుల వ్యవహారాలలో ప్రవేశించకుండా ఉండటంవల్ల మనశ్శాంతి, సుఖము పొందగలుగుతారు. వారం రెండవ భాగంలో అనారోగ్య సూచన ఉన్నవి. పుణ్య కార్యాల నిమిత్తం ఖర్చులు అధికం అవుతవి. ఉపయోగంలేనిఖర్చులువచ్చిపడుతవి కాని, జాగ్రత్తగా తప్పించుకోగలుగుతారు. వృత్తిలో అభివృద్ధి కనుపిస్తుంది పిల్లల ఆరోగ్యం గురించి జాగ్రత్తగా ఉండవలసిన సమయం 3, 4, 5 తేదులలో గౌరవ లాభం, ప్రయాణాలు, బంధువుల రాక.

* * *

కన్య :

(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా)

మీ అదృష్టం కలసివస్తుంది. కుటుంబంలోని వారు మీ పనులలో అన్ని విధాలా సహాయం చేస్తారు. ధన సహాయం లభిస్తుంది. అధికారులవల్ల మీరు అనుకున్నంత ప్రయోజనం పొందలేకపోతారు. దూరపుప్రయాణాలు చేయవలసి వస్తుంది. చాలాకాలంగా నెరవేరకుండా ఆందోళనను కలిగిస్తూన్న పనులు ఈ సమయంలో ఒక మార్గానికి వస్తవి. గౌరవం లభిస్తుంది. వృత్తిలో కార్యభారం, ఆందోళన విశేషంగా కనిపిస్తుంది. వాహనాలు మొదలయినవి కొనటానికి అనుకూలమయిన కాలం. ఈ సమయంలో నౌకరులు మొదలయిన వారితో

పేచీలు రాగల అవకాశాలున్నవి. సాధ్యమైనంతవరకు మీ పనులను ఇతరులకు వప్పగించకుండా ఉండటం అవసరం. ధనవ్యయం కన్పించినా సౌమ్యంగా పరిష్కరించుకొనటం మంచిది 3, 4 తేదులలో మనస్సులో భయాందోళనలు, శుభ వార్తలు.

*　　　*　　　*

తుల :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు)

గౌరవ ప్రదమైన కాలం. అనేక రకాల మనుష్యులతో పరిచయం లభిస్తుంది. తరచు శుభ కార్యాలలో పాల్గొంటారు విందులు, వినోదాలతో నెమ్మదిగా కాలం జరుగుతుంది. ఖర్చులు క్రమంగా పెరుగుతున్నట్లు తెలుస్తుంది. బంధు మిత్రులకు సహాయం చేయ గలుగుతున్నామనే సంతృప్తి కనిపిస్తుంది. వ్యవహారరంగంలో తొందరపడ తగిన సమయంకాదు తలపెట్టిన పనులలో ప్రతిబంధకాలు వస్తూ ఉంటవి. అయితే ధైర్యంతో ప్రయత్నాలను సాగించగలుగుతారు. కుటుంబంలో ఖర్చులు పెరుగుతవి. తప్పనిసరిగా కొన్ని పనులు పైనవేసుకుని నెరవేర్చవలసి వస్తుంది. పిల్లల ఆరోగ్యం గురించి జాగ్రత్తగా ఉండవలసిన సమయం. విశేషంగా డబ్బు పెట్టుబడి పెట్టవలసి వస్తుంది. ప్రయాణ కార్యక్రమాలు నిలుపుకోవలసి వస్తుంది. 8, 9 తేదులలో కార్యభంగం, బంధు విరోధాలు, దైవ కార్యాలకై ఖర్చులు.

*　　　*　　　*

వృశ్చికం :

(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

మనశ్శాంతి తక్కువ. తరచు బంధు విరోధాలు వస్తూ ఉంటవి. అయినవారివల్లనే మీ పనులకు ప్రతిబంధకాలు కనిపిస్తవి. ఆదాయంలోపించగల సమయం. లోగడ మీకు ఆశపెట్టినవారు చల్లని మాటలతో తప్పుకుంటారు. వృత్తిలో మార్పులు రాదగిన సూచన లున్నవి. కాని తొందరపడి చేత ఉన్నదానిని వదలుకొనటంమంచిదికాదు. ఆరోగ్యం జాగ్రత్తగా చూచుకొనండి. ముఖ్యంగా విశ్రాంతి, ఆహార విహారాలలో నియమము, శ్రద్ధ అవసరం. మిత్రుల వద్దనుంచి శుభవార్తలు తెలుస్తవి. నూతన ప్రయత్నాలలో మిత్రుల సలహా లభిస్తుంది. కాని, అందువల్ల ఉపయోగం కనుపించకపోవచ్చు. నిదానంమీద అన్ని పనులు కలసి వస్తవి. ఖర్చులు మాత్రం అధికం. 5, 6 తేదులలో కార్యభారం, శుభవార్తలు, చికాకు.

*　　　*　　　*

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా)

ఇతరులదృష్టిలో మీ అంతస్తు బాగానే ఉంటుంది. ఆదాయము, గౌరవము క్రమంగా పెరుగుతవి తరచు పొరపాట్లు జరుగుతరా ఉంటవి. కాని, అందువల్ల ప్రత్యేకంగా కష్ట నష్టాలు మాత్రం ఉండవు. సంఘంలో మీమాటకు నిలువ లభిస్తుంది. అంచారంతో కూడిన పనులు అధికంగా ఉంటవి. వయితే దేహ సౌఖ్యం అంతగా ఉండదు. తరచు జీర్ణకోశాలయందు బాధ, రక్తదోషంవల్ల కలిగే మార్పులు కనుపిస్తవి. విశ్రాంతిగా ఉండటం అవసరం. సూర్యపూజ, లలితాస్తోత్రం పారాయణచేసుకొనటం మంచిది సుఖం లభిస్తుంది శత్రుజయం పొందగలుగుతారు. దైవానుగ్రహంవల్ల వృత్తి వ్యాపారాలలో ఏర్పడిన ప్రతిబంధకాలు, పోటీలు తొలగిపోతవి. ఆదాయం విశేషంగా పెరుగుతుందని అనుకోవద్దు. ఈవారంలో విలువగల వస్తువులుకొనే ప్రయత్నాలు అనుకూలించవు. 6, 7 తేదులలో అధిక కోపం, వస్తు నష్టం, దుర్వార్తలు.

*　　　*　　　*

మకరం :

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం ధనిష్ఠ 1, 2 పా)

గ్రహబలం బాగున్నది. బాహ్య విషయాలలో మీరు చురుకుగా వ్యవహరించగలుగుతారు. ఆదరణతో సహాయంచేయగలవారు లభిస్తారు. బంధువుల మూలంగా చికాకు కలుగుతుంది. కాని, ఏ విషయంలోను కల్పించుకొనకుండా ఉండటంవల్ల సుఖం పొందగలుగుతారు. ధనాదాయం సంతృప్తికరంగా ఉంటుంది. ఇతరులు మిమ్ములను అనవసరంగా రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తారు. ఎదురుచూస్తున్న శుభవార్తలు సకాలంలో అందుతవి. దూరపు ప్రయాణాలు నిర్ణయించుకొంటారు. అయితే అకస్మాత్తుగా ఆటంకాలు రాగలవు. పుణ్యకాలక్షేపాలు దైవ కార్యాలు మొదలయినవాటితో కాలం నెమ్మదిగా జరుగుతుంది. ఇతరుల కార్యభారం క్రమంగా తగ్గించుకొంటారు. 3, 4, 5 తేదులలో కార్యసిద్ధి, సంచారము, మనస్సులో భయము.

*　　　*　　　*

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)

మీ ప్రయత్నాలు ఫలించటం మాట ఎలా ఉన్నా భయం మిమ్ములను ముందుకుపోకుండా చేస్తూ ఉంటుంది మీ మాటనేర్పుతో అందరిని మెప్పించగలుగుతారు. పిల్లలమూలంగా సంతోష, సుఖాలు లభిస్తవి. ధనాదాయం బాగుంటుంది. రాజకీయాలలో నలుగురిని ఒక దారిలో నడుపగలుగుతారు. తరచు ప్రయాణాలు చేయవలసి వస్తూ ఉంటుంది. ఇంతకుముందు మీకు మాట ఇచ్చిన పెద్ద మనుష్యులు సక్రమంగా సహాయం చేస్తారు. ధన సంబంధమైన వ్యవహారాలు మిమ్ములను చికాకు పరుస్తవి. వృత్తిలో మీరు అనుకున్నంత కష్ట నష్టాలు ఏమీ ఉండవు. 6, 7 తేదులలో అపవాదులు, దండుగ ఖర్చులు.

*　　　*

మీనం :

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి)

ఈ సమయంలో మీ మాటను కాదనేవారు ఉండరు తలచిన పనిని వెంటనే కార్యరూపంలో పెట్టగలుగుతారు ఫలితంమాత్రం మీరు అనుకున్నంత విశేషంగా ఉండకపోయినా లోపం మాత్రం ఉండదు. బంధువులవద్దనుంచి అనుకూల వార్తలు తెలుస్తవి. తలవని తలంపుగా జరిగిన పొరపాటు పనులవల్ల దేహశ్రమ, ఖర్చులు మితిమీరగల అవకాశాలున్నవి. కుటుంబంలోనివారిఆరోగ్యం గురించి జాగ్రత్తగా ఉండండి. వ్యవహారరంగంలో తోటివారి సలహా, సహాయము లభిస్తవి కాని, ప్రతి విషయంలోను సందేహాలు మిమ్ములను విడువకుండా బాధిస్తూ ఉంటవి. నిబ్బరంతో ఉండండి. 8, 9 తేదులలో కష్టవార్తలు, కలహ ప్రసంగాలు. ★

ఈవారము ధరలు

బంగారుధర ఈవారం బాగా పెరగగల అవకాశాలున్నవి వెండి ధర వారం ఆరంభంలో తగ్గి 6 వ తేదీనుంచి పెరుగుతుంది.

పసుపుధర మందీలో నిలుస్తుంది. నూలుధర క్రమంగా పెరుగుతుంది. ప్రత్తి ధర బాగా పెరుగుతుంది.

వేరుశనగపప్పు ధరలో తరచు హెచ్చు తగ్గులు వస్తూ ఉంటవి. నూనెధర కొద్దిగా మందీవచ్చి నిలుస్తుంది. నూవులనూనె ధర కొద్దిగా మందివచ్చి తిరిగి పెరుగుతుంది.

మినుముల ధరలో హెచ్చు తగ్గులు ఉండవు. కందులకు గిరాకి వస్తుంది. మిర్చి ధర వారం రెండవభాగంలో పెరుగుతుంది.



చిత్రకారుడు:- చి త్ర్యు సూర్యనారాయణ పు (ము - లపల్ల గాము)

ర్లతో తగవులాడుతోంది. రావు గొడవ అణిచి "ఏమిటిలా వచ్చారు" అన్నాడు.

"చూద్దామని"—రావు వాడిన వాక్యాన్నే వాడింది పార్వతి.

"రండి నేను చూపెడతా'— తనూ పార్వతి అన్న మాటలే అన్నాడు.

"మీరేశాఖ లీడ్ చేస్తున్నారు? అడిగింది

"చేపలు"

"పార్వతి నవ్వుతూ "అవుతే ఆ బ్రాంచ్‌నే చూద్దాం" అంది.

"వద్దులెండి. పాములూ, పక్షులూ అన్నీ చూశాక దానికి వద్దురుగాని" రావు బయలుదేరాడు పార్వతినీ — ఆమె బృందాన్ని వెంటపెట్టుకొని రావు రే 'షాకు' ఇస్తాడేమోనని పార్వతి జాగ్రత్తగా ఉంది మళ్ళీ ఓమాటు — ఈ జంతువులు 'షాకు' కూడా ఇస్తాయా? — అనుకొంది. ఆమె వూహకు ఆమెకే నవ్వొచ్చింది. రావు పాములని, తేళ్ళని—రక రకాల జంతువులను ముట్టుకొని చెబుతోంటే వాళ్ళకి కొద్దిగా ఆశ్చర్యం వేసింది మధ్య మధ్యలో రావే వాళ్ళని ముట్టకండి జాగ్రత్త' అంటూ హెచ్చరించ సాగాడు ప్రొద్దున తను ఇచ్చిన 'షాకు' ఇంత తొందరగా మర్చిపోయాడేమిటి—చెప్మా అని అనుకొంది. అయినా తన జాగ్రత్తలో తను ఉండటం మేలనుకొంది. అన్నిశాఖలు చూపించాక రావు తన చేపలశాఖ దగ్గరకు వచ్చాడు. తను అందంగా ఆకర్షణీయంగా అమర్చినవి చూస్తూ వాళ్ళు ఆనంద పడుతున్నా — బయటికి ఏమీ తెలియనీకపోవటం రావుకి నవ్వు తెప్పించింది. అలాగే చూస్తూ చివరి బల్ల దగ్గరకు వచ్చారు. గొంతు ఒకమాటు సవరించుకొన్నాడు.

"చూడండి—పార్వతీజీ వీటిని 'రే—చేప'లంటారు. ఇవి చాలా ఆకర్షణీయములైనవి మన దేశ సముద్ర ప్రాంతాలలో దొరకవు' అంటూ చేతిని తొట్టిలోఉంచి సున్నితంగా అరచేతిమీదుగా ఒక రే—చాప తీసి చూపాడు

మెర్క్యురీ లైట్లలా మెరుస్తున్న ఆ చేపను ఓ అమ్మాయి ముట్టబోయింది. "అహాహా! ముట్టకండి. ఇవి చాలా ప్రమాదం—ఖరీదయినవీనూ" రావు మళ్ళీ చేపను తొట్టిలోకి విడిచిపెట్టాడు. రావు స్టైలు చూస్తుంటే పార్వతికి నవ్వాగడం లేదు. నాటకంలో హీరోలా బట్టీ పట్టినట్టు గడగడా వప్పచెబుతున్న అతనిని చూసి ఆమెకు నవ్వు వచ్చింది.

"భలేవారే! మీరు ముట్టుకొని—మేము ముట్టుకుంటే ప్రమాదమంటారేమిటి?" అంటూ హేళనగా బీకరులో చెయ్యిపెట్టి అట్ట ముక్కను పట్టినట్లు గుండ్రని బిస్కట్‌లాఉన్న ఆ 'రే' చేపను బయటికిపట్టి తీసింది పార్వతి.

వెంటనే ఆమె నరాలన్నీ ఒక్కసారి గింజుకొన్నాయి. అమ్మా!' అంటూ గట్టిగా చెయ్యి విదిలించికొట్టింది. 'రే — చాప నేలమీదపడి చచ్చివూరుకుంది

ఈమాటు పార్వతి — తనకు తగిలిన షాకు నుండి తేరుకునేటప్పటికి ఒక్క నిముషం పట్టింది. ఆమె ఎర్రని చెక్కిళ్ళు కందిపోయాయి. అవమానంతో గట్టిగా ఉఛ్వాస నిశ్వాసాలను సల్పుతూ రావు వైపు ఉగ్రంగా చూచింది పార్వతి.

రావు నవ్వుతూ 'జువాలజీ అంటే ఇంతేనండీ'

అన్నాడు.

అంతిమ విజయం

(27-వ పేజీ తరువాయి)

ఆ మాటతో పార్వతి కంట్లో నీళ్ళు తిరిగాయి. పక్కనున్న అమ్మాయిలంతా గొడవ చేశారు. రామం కంగారుగా పరిగెత్తుక వచ్చాడు ఈ గొడవంతా చూచి "ఏమిట్రారావు—ఇది" అన్నాడు

"ఏం లేదురా! ఈమె పొద్దున ఫిజిక్సుహాలులో ప్రవేసిస్తుండగానే షాకు ఇచ్చింది నేను అంతా చూపెట్టాక చివర ఇచ్చాను అంతే భేదం ఇంకా వివరం చెప్పాలంటే విను. ఒక్క ఫిజిక్సులోనే ఎలెక్ట్రిసిటీ ఉండదు జువాలజీలో జంతువులుకూడా షాక్ నివ్వగలవని నిరూపించాను. ఈ 'రే' చాప చూచావా దీన్ని ఒకవైపునుంచి ముట్టుకొని పైకి ఎత్తితే షాక్‌కొట్టదు రెండువైపునుంచి అట్టముక్కను పట్టినట్లు ఎత్తినట్లయితే దిమ్మతిరిగేలా షాక్ ఇస్తుంది అమ్మాయిగారు సరిగ్గా ఆపనే చేశారు అంతే" రావు కంఠంలో వింత విజయం స్ఫురించింది.

తన కూతురికి షాక్ తగిలిందని విన్న ప్రిన్సుపాల్ పరిగెత్తుకొంటూ వచ్చాడు. విద్యార్థులంతా గుమికూడారు పెద్దగొడవగా మారింది క్షణంలో పరిస్థితి.

ఇంతలో ఎగ్జిబిషన్ చూడటానికి వచ్చిన రావు నాన్నగారు కూడ—అక్కడికే వచ్చారు. ప్రిన్సుపాలు ఆయన బాల్యమిత్రులు. "ఏమిట్రా" అంటే 'ఏమిట్రా'' అనుకొన్నారు ఒకర్నొకరు చూచుకొని తరువాత ఇద్దరూ, తమ పుత్రికారత్నం పుత్రరత్నం చేసిన ఘనకార్యం తెలుసుకొని, ఇద్దరు అక్కడే తమ బిడ్డల్ని చీవాట్లుపెట్టారు ఇంతలో ప్రిన్సుపాల్ గారికి హఠాత్తుగా పెద్ద సందేహం వచ్చింది

"చూడు—రావ్ ఈ రే—చేపలు—అవుటాఫ్‌పోర్షన్ గదా? దీని విషయం నీకెలా తెలుసు" అని ప్రశ్నించాడు ఆయన కూడా జువాలజీ ప్రొఫెసరు.

"లైబ్రరీలో—ఏదో పుస్తకంలో చదివానండీ"నసిగాడు రావు

"గుడ్!" తన కూతురికి షాకు నిచ్చినా రావుకి చదువుమీదగల శ్రద్ధను మెచ్చుకో లేకుండా ఉండలేకపోయాడు ప్రిన్సిపాల్ తరువాత ఇద్దరు మిత్రులూ కలిసి వీరిద్దరికి ముక్కు చెంపలు వేయించి స్నేహంగా ఉండాలనిచెప్పి— వెళ్ళిపోయారు.

*   *   *

ఎగ్జిబిషన్ ధర్మమా-ప్రిన్సుపాల్‌గారి-రావు తండ్రి వాళ్ళ స్నేహం ధర్మమా—ఏమయితే ఏమి ఒక శుభ ముహూర్తాన మిసెస్ పార్వతీరావుగా మారిన పార్వతీ, రావు — ఇద్దరు కంపార్టుమెంటులోంచి బయటికి చూస్తూ స్నేహితులకి టాటా చెబుతున్నారు రైలు బయలుదేరుతుందనగా పార్వతి స్నేహితురాండ్రు ఆమెకో ఈవినింగ్ క్యాప్ ఇస్తూ 'మీహనీమూన్ బహుమతి' అన్నారు.

పార్వతి సిగ్గుతో రావువైపు క్రీగంటిచూపు చూచింది మిత్రబృందం పకాలుమన్నారు. వెంటనే రామం అన్నాడు "ఒరేయ్ రావూ. మీరు బయలుదేరుతున్న బండి ఏదో తెలుసా "గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్" అని. మళ్ళీ నవ్వుల పువ్వులు రాలాయి.

రైలు బయలుదేరింది. రావు కిటికీలోంచి బయటికి చూస్తూ ఏమండ్రీ ఇప్పుడే మంటారు!





"ఏం సుబ్బన్నా! ఇవాళ యింకా బేరం తగిలినట్టు లేదే" అని, నిద్రగన్నేరు చెట్టు నీడలో కూర్చుని చుట్ట కాల్చుకుంటున్న సుబ్బన్నను పలకరించాడు స్టేషను మాస్టరు. ఆయన సాధారణంగా ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడడు. సుబ్బన్న చుట్టముక్క అవతల పారేసి లేచి నుంచుని "ఏదీ! ఇంతవరకూ బాడిగ తగల్లేదు బాబుగారూ? కాసిని మంచినీళ్లిప్పించండి. నాలిక పిడచగట్టుకుపోతున్నది" అన్నాడు.

స్టేషనుమాస్టరిచ్చిన మంచినీళ్ళు తాగి సుబ్బన్న మళ్ళీ నిద్రగన్నేరు చెట్టు నీడలో కూర్చున్నాడు. కటకటాలకవతల బండివక్కనే చెట్టు నీడలో సోమరిగా గడ్డిపరకలు కొరుకుతూ పడుకుని ఉన్నది యెద్దు. "ఎండ లిప్పుడే మరీ ఎక్కువగా ఉన్నాయి" అనుకున్నాడు సుబ్బన్న పై పంచె పరుచుకుని పధుం వాలుస్తూ. ఆకాశంలో తెల్లని మబ్బులు రెండు మూడు ఒకసారి మొగలి పొదలవలె, మరికొంత సేపట్లోనే గుబురుగా పెరిగిన చెట్లవలె రూపాంతరాలు పొందుతున్నాయి. ఒక కాకి—దాహం గొన్నది కాబోలు, నీరసంగా ఎగిరిపోతున్నది. టెలిగ్రాఫ్ తీగలమీద కూర్చుని ఒక బుల్లిపిట్ట రాగాలు తీస్తున్నది. నిద్రగన్నేరు చెట్టు క్రింద మెత్తని పువ్వులు రాలి ఉన్నాయి.

నేలమీద పరిచిన చిన్న పై పంచె మీద ముడుచుకుని పడుకున్నాడు సుబ్బన్న. స్టేషను మాస్టరూ, మరొక పోర్టరూ తప్ప ఆ పరిసరాల్లో మరెవరూ లేరు. దూరంగా కూత వేసుకుంటూ ఏదో గూడ్సుబండి నెమ్మదిగా వస్తున్నది. సుబ్బన్నకు మగతగా నిద్రపడుతూ వుండగా రొదచేసుకుంటూ వచ్చి ఆగి అతని నిద్రను చెడగొట్టింది. చేతిలో రెండు జెండాలు పుచ్చుకుని వచ్చిన పోర్టరు సుబ్బన్నను "ఒక పొగాకు పాయ యిట్టా పారెయ్యవయ్యా" అని అడిగాడు.

సుబ్బన్న లేచి కూర్చుని బనియను జేబులోనుంచి ఒక పొగాకు కాడ తీసి అతని చేతి కిచ్చి "ప్యాసింజరు బండి వచ్చే వేళ కాలేదా యింకా?" అని

అడిగాడు పోర్టరు వెళ్లిపోతూ "అబ్బే! అప్పుడే యెక్కడ? ఇంకా గంట గడవాలి. ఎక్స్ ప్రెస్ వెళ్లిపోవాలిగా" అని జవాబు చెప్పాడు.

సుబ్బన్న పొగాకుతీసి చుట్టచుట్టుకుంటూ కూర్చున్నాడు ఇవాళ పొద్దున్న తన వూరినుంచి స్టేషనుకు వచ్చిన తర్వాత యింతవరకూ బాడిగ లేదు. రెండు ప్యాసింజరుబండ్లు వచ్చి వెళ్లి పోయాయి. అయినా ఆ స్టేషనులో ఒక్క పురుగైనా దిగలేదు. పదిగంటలబండిలో పదిహేనేళ్ల కుర్రాడొకడు దిగాడు కానీ, వాడు "బండి అక్కర్లేదని" చెప్పి నడిచే వెళ్లిపోయాడు. ఒక్కడి కోసం బండి కడితే తనకు మాత్రం గిట్టుబాటు కావద్దూ? తగిలే పెద్ద బేరమే తగలాలి. భార్యా భర్తలూ, నలుగు రైదుగురు పిల్లలూ, పెట్టెలూ బెడ్డింగులూ—యివన్నీ దిగితే యింక కావలసిందే ముందీ? ఏ రూపాయన్నరో చేతిలో పడకుండా ఉంటుందా? అయినా, ఇవాళ వట్టిబండి తోలుకుని ఇంటికి వెళ్లక తప్పేట్టు లేదు ఆ స్టేషనులో దిగేవా రెక్కువగా పగటిపూటే దిగుతారు. 'రాత్రిళ్లు బండిదొరక్క యిబ్బందిపడవలసి ఉంటుంద'నే భయంతో పొద్దు గూకిన తర్వాత అక్కడికి చేరే రైళ్లో ఎవరూ ప్రయాణం చెయ్యరు. స్టేషను కెటువైపు వెళ్లినా నాలుగ మైళ్లలోపున వూరే లేదాయిరి.

సుబ్బన్న చుట్టచుట్టుకోవటం పూర్తిచేసి కొనగిల్లి నోట్లో ఉంచుకుని జేబులోనుంచి అగ్గిపెట్టె తీసి వెలిగించుకున్నాడు దూరంగా ఎక్స్ ప్రెస్ కూత వినిపించింది. దూరానికే యింత దారుణంగా వినిపించే యీ కూత దగ్గరలో ఉన్న వాళ్లని నిజంగా హడలగొడుతుంది క్రమంగా దవ్వు డెక్కువై విపరీతమైన వేగంతో దుమ్ము లేపుతూ రైలు పట్టాలను అదరగొడుతూ కన్నుమూసి తెరిచేలోగా వెళ్లిపోయింది ఎక్స్ ప్రెస్.

సుబ్బన్న చుట్టపొగ వదులుతూ ఆలోచనలో పడ్డాడు. అతనికి యాభైఅయిదేళ్లుంటాయి. తలా, గడ్డమూ కనుబొమలూ నెరసినయ్. ఒక నీరుకావిధోవతి మోకాళ్లదాకా కట్టుకుని పైన చేతులున్న బనియను వేసుకుని ఉన్నాడు. "తల్లి కడుపులో ఉండగానే తండ్రిని మింగిన రాక్షసుడ'ని చిన్నతనంలో అందరూ అతన్ని అసహ్యించుకునేవారు. అతని తల్లి కూడా తర్వాత ఎంతో కాలం బ్రతకలేదు. ఆమె చివరిదశలో అప్పటికి ఆరేళ్లవాడయిన సుబ్బన్నను గురించి కుళ్లి కుళ్లిదుఃఖించేది 'తను చస్తే తర్వాత యీ పసివాడి గతిఏమిటా!' అని ఆ మాతృహృదయం క్షోభించిపోయేది. అయినా ఆమెచావును ఎదిరించలేకపోయింది. ఒకనాడు బయటవర్షం ధారలుకట్టి కురుస్తూవుండగా వూరిచివరగాఉన్న ఆవూరింట్లో కొడుకును గురించిన దిగులుతో నిండినఆ కళ్లలోనుంచే



బండి సుబ్బన్న తాను జీవితాంతం కూడబెట్టిన ధనం సద్వినియోగం చెయ్యాలనుకున్నాడు. తీరా చూస్తే ఆ డబ్బులో సగానికి పైగా...

భ్రష్టయోగి

ఆమె ప్రాణం పోయింది. కనురెప్పలు వాల్చకుండా కొయ్యవలె బిగుసుకుపోయినతల్లిని చూసి అతడు భయంతో పక్క యింట్లోకి పరుగెత్తుకుపోయి పెద్దగా ఏడ్చాడు. తర్వాతవర్షం వెలిసింది. అందరూ చేరి తలా ఒక చేయివేసి అంత్యక్రియలు జరిపించారు.

తర్వాత వూరిపెద్దరైతులలో ఒకడైన నాయుడు జాలిపడి ఆరేళ్ల సుబ్బన్నను తన యింట్లోనే ఉంచుకొని తిండి పెడుతూ ఉండేవాడు. మొదట్లో గొడ్లను తోలుకురావటం, గడ్డి కోసుకురావటం, వేళకు యింట్లో అందరికీ పక్కలు వెయ్యటంతో మొదలై క్రమంగా పెద్ద పెద్ద పనులను చెయ్యవలసి వచ్చింది. పద్దెనిమిదేళ్లు నిండేసరికి సుబ్బన్న పెద్ద పాలేరయినాడు. పొలానికి సంబంధించిన బరువులూ, బాధ్యతలూ అతని నెత్తినే పడ్డాయి. అయినా అతడు శ్రమ దాచుకోకుండా పని చేసేవాడు. నాయుడు పెద్దవాడై పోయాడు. ఆయన కొడుకులు 'ఇంగ్లీషు చదువులకని' వూరొదిలి వెళ్లిపోయారు. ఇంట్లో నాయుడూ, అతని భార్యా, అతని ముసలి అక్కగారూ తప్ప మరెవరూ ఉండేవారు కాదు. వాళ్లయినా వార్ధక్యంవల్ల ఎక్కువగా కదిలేవారు కాదు. లంకంత ఆ లోగిలిలో మనుష్యుల అలికిడే ఉండేది కాదు. ఆ నిశ్శబ్దవాతావరణంలో సుబ్బన్న మాత్రం అటూ యిటూ తిరుగుతూ అన్ని పనులూ చేస్తూ ఉండేవాడు ఆతర్వాత కొద్ది నెలల్లోనే నాయుడు, తనకన్నా ముసలివారందరూ అలాగే చావుకోసం నిరీక్షిస్తూ ఉండగా ఒకనాటి తెల్లవారుజామున ఒంటరిగా పడుకునివుండి కన్ను మూశాడు. అప్పటికి ఆయన కొడుకులు ముగ్గురూ 'ఇంగ్లీషు చదువులలో పీకలదాకా మునిగి ఉన్నారు. ఆ చదువులే వాళ్లకు తల్లిదండ్రులకంటె, పిత్రార్జితమైన ఆస్తికంటె ముఖ్యమైనవేమో! అవే తమను ఉద్ధరిస్తాయని వారనుకున్నారేమో!

వార్త తెలిసి అందరూ వచ్చారు. ఏదీ మిగిలిపోలేదు. అన్నీ అందరి సహకారంతో సక్రమంగానే జరిగిపోయాయి. కాని సుబ్బన్న మాత్రం రోజుల తరబడి ఒంటరిగా సావడిలో కూర్చుని నాయుణ్ని గుర్తు చేసుకుని దుఃఖించేవాడు. నాయుడు లేని ఇల్లిప్పుడు అతని కళ్లకు శూన్యంగా కనిపిస్తున్నది. నాయుడి కొడుకులు మళ్లీ మామూలుగా చదువులకు వెళ్లిపోయారు. నాయుడి భార్య వాళ్లతో వెళ్లి పట్నంలో ఉండేందుకు ఒప్పుకోలేదు. ఆమె, వృద్ధురాలైన నాయుడి అక్కగారితోపాటు ఆ యింట్లోనే ఉండేది.

ఆ తర్వాత అయిదారునెలలకు సుబ్బన్న ఒకనాటి సాయంకాలం యింటికి వస్తూ హఠాత్తుగా నిలబడిపోయాడు. అస్తమిస్తున్న సూర్యుడి కిరణాలు చెరువులో నీళ్లకు బంగారు పూత వేస్తున్నాయి. చెరువు గట్టునే ఉన్న కుంకుడుచెట్టు మీద రకరకాల పక్షులు గోల చేస్తున్నాయి. నడుంమీద నీళ్లతో నిండిన బిందెను ఉంచుకొని కొద్దిగా తడిసిన పచ్చని పాదాలకు అడ్డం వస్తున్న పరికిణీ కుచ్చెళ్లను కుడిచేత్తో కొద్దిగా పైకి పట్టుకుని, మెట్లెక్కి వస్తూ కనిపించింది రత్తమ్మ. సుబ్బన్న అలా నుంచునివుండి ఆలోచనలో పడిపోయాడు. ఆమె అన్న చౌదరిగారి పాలేరు. వాడు సుబ్బన్నకు బాగా తెలుసు. చిన్నతనంలో అందరూ కలిసి ఆడుకుంటూ ఉండేవారు. సుబ్బన్న ఆమెను చివరిసారిగా పన్నెండేళ్ల పిల్లగా ఉండగా చూశాడు. తర్వాత ఆమె మళ్లీ కనిపించనేలేదు. చాలా జాగ్రత్తగా చూస్తే తప్ప గుర్తుపట్టనేలేనంతగా మారిపోయింది. చిన్నప్పుడు చాలా చిలిపిగా ఉండేది. ఇప్పుడా కదలికలలోనే ఒక ఠీవీ, అందమూ, దర్పా కనిపిస్తున్నాయి. ఆమె నడిచి వెడుతూనే సుబ్బన్న వంక ఒక్కసారి చూసింది. ఆ నల్లని కళ్లు అతన్ని గుర్తుపట్టినట్టే అనిపించింది. ఆమె మరుక్షణంలో తల వంచుకుని తన దారిన తాను వెళ్లిపోయింది. సుబ్బన్న ఎన్నో మధురోహలలో తేలియాడుతూ యింటికి వచ్చాడు ఆనాటి రాత్రి ఎన్నో మధురమైన కలలు కన్నాడు.

మర్నాడు సాయంకాలం నిమ్మతోటలో ఒక చెట్టు క్రింద కూర్చుని ఉండగా సుబ్బన్న రత్తమ్మ అన్న నుద్దేశించి, "మీ చెల్లెలొచ్చినట్టుంది కదురా! నిన్న సాయంకాలమే చూశాను. చాలా మారిపోయిందిరా" అన్నాడు. వీరన్న నవ్వి "నిన్న పొద్దుగూకిన తర్వాత చెరువుకు నీళ్లకని పోయి వచ్చి నాతో చెప్పిందిలే. నువ్వక్కడ కనిపించావటగా? ముందు గుర్తుపట్టలేదట, తర్వాత ఫలానా" అని గుర్తు తెచ్చుకుని యింటికి రాగానే నాతో చెప్పింది. ఇన్నాళ్లనుంచీ మా మేనత్తగారి యింట్లోనే ఉంది కదురా, అందువల్ల ఎరికలేదు. అక్కడ మా మేనమామ కొడుకుతో మనువు కూడా కుదిరింది. రేపు మాఘమాసంలో ఆ శుభకార్యం కానిచ్చేదామనుకుంటున్నాం" అన్నాడు.

సుబ్బన్న శిలాప్రతిమవలె కూర్చుండిపోయాడు. తర్వాత చాలాసేపు పెదవి కదపలేదు. చీకటి ప్రపంచాన్ని అజ్ఞానం వలె ఆవరించుకుంది ఆకాశంలో నక్షత్రాలు మాత్రం 'మినుకు మినుకు' మంటున్నాయి. సుబ్బన్న చీకటిలో నడిచి, చీకటితో నిండిన యింటికి వచ్చాడు. నాయుడి భార్యకు జ్వరం. ఆమె రెండురోజులనుంచి లేవలేకుండా పడివుంది. నాయుడి అక్కగారికి పగలే చూపు సరిగా ఆనదు. సుబ్బన్న వెళ్లేటప్పటికి ఆమె చీకట్లో తడువుతూ దీపంబుడ్డికోసం వెదుకుతున్నది.

ఆ రాత్రి గాలి కదలటమే మానివేసింది. సుబ్బన్న నడవలో చాపమీద పడుకున్నాడు. అతనికి విపరీతంగా ఉక్క పోస్తున్నది. ఊపిరాడటంలేదు. పైగా దాహంతో నాలుక పిడచగట్టుకు పోతున్నది. అతడు నీరసంగా లేచి బయటికి వచ్చాడు. వళ్లంతా నలగకొట్టినట్టు నొప్పులుగా ఉంది. అతని వొళ్లతనికి తెలియదు. ఎక్కడో ఒక కుక్క ఏడుస్తున్నది. సుబ్బన్న వంటిమీద స్పృహ లేకుండానే ఆ నాలుగు మైళ్లూ నడిచి స్టేషనుకు వచ్చాడు. ఏదో రైలు సిద్ధంగా ఉంది. స్టేషన్లో ఒక కుండలో ఉన్న నీళ్లను కడుపునిండా త్రాగి కదలబోతున్న రైలెక్కాడు

తర్వాత అతడు యుద్ధంలో చేరాడు. రకరకాల వ్యక్తులతో కాలం గడిపాడు. ఆశలూ, మమతలూ, సుఖాలూ, దుఃఖాలూ వేటినీ పట్టించుకోకుండా, చీకూచింతా లేకుండా రోజులు వెళ్లబుచ్చాడు చాలా పర్యాయాలు వెంట్రుకవాసిలో చావును తప్పించుకున్నాడు. యుద్ధం అయిపోయిన తర్వాత అతనికి మారుమూల ఉన్న చిన్న స్టేషనూ, తన వూరూ, వూరి చివరగా ఉన్న తన యిల్లూ అన్నీ గుర్తుకు వచ్చాయి. అతడికి మార్గాంతరం లేక నెమ్మదిగా బయలుదేరి తన వూరికి వచ్చాడు. ఆ స్టేషనలాగే ఉంది. తన వూరూ లాగే ఉంది. వూరికి పడమటివైపు చివరగా ఉన్న పెద్ద భవంతిని చూసేసరికి అతని కళ్లు ఆర్ద్రములైనాయి. అది నాయుడి యిల్లు. నాయుడి భార్యా, ఆయన అక్కగారూ ఎప్పుడో పోయారు. ఆయన రెండోకొడుకు మాత్రం యిక్కడే ఉండి వ్యవసాయం చేసుకుంటున్నాడు. మిగిలిన యిద్దరూ ఇంగ్లీషు చదువులు చదివి ఏ వంద రూపాయలకో ఎక్కడో అరవ చాకిరీ చేసుకుంటూ ఎవరి క్రిందనో బ్రతుకుతున్నారు.

రెండో సినిమాకు వెళ్ళివచ్చిన ఒకాయన ఎంతకీ నిద్ర రాకపోగా డాక్టరుకి ఫోనుచేసి ఏమండీ డాక్టరుగారూ ఎంతకీ నిద్ర రావటంలేదండీ అని చెప్పాడు. డ్యూటీనుంచి అప్పుడే ఇంటికొచ్చిన డాక్టరుకు కోపం వచ్చింది. సరే ఫోను అలాగే పట్టుకోండి జోల పాడుతాను అన్నాడు.

ఎమ్. అన్నమ్మ (యాసునూరు.)

భ్రష్టయోగి

కంట లొచ్చే సమయంలో మాత్రం సెలవులు పెట్టి అక్కడికి వచ్చి భాగాలకోసం కీచులాడు కుంటూ ఉంటారు.

సుబ్బన్న యిల్లు బాగుచేయించుకుని చేరాడు. ఎన్నోసార్లు ఆతడు స్టేషనునుంచి కాలినడకను రావటంవల్ల కలిగిన యిబ్బందిని అనుభవించాడు. ఒక్కడికే యింత కష్టంగా ఉంటే ఆడవాళ్లతో, పిల్లలతో యిక్కడికి వచ్చేవా రెంతగా కష్టపడ వలసి ఉంటుందో ఊహించాడు. తర్వాత కొద్ది రోజుల్లోనే తన దగ్గర ఉన్న డబ్బుతో ఒక మంచి ఎద్దును కొని బండిచేయించాడు. అప్పటినుంచి సంవత్సరాల తరబడి వూరినుంచి స్టేషనుకూ, స్టేషనునుంచి వూరికీ బండి తోలటమూ, యింట్లో ఉన్న కాస్సేపూ వండుకుని తినడమూ మొక్కలతో పనీ, అతని దినచర్యలలో ప్రాముఖ్యం వహించినై. రత్తమ్మ అతనికి మళ్లీ చాలాసార్లు కనిపించింది. ఆమె కిప్పుడు ముగ్గురు పిల్లలు. మొన్న పుట్టింటికి వచ్చినప్పు డామెను చూశాడు ఆమె చాలా బలహీనంగా ఉంది. అందమైన ఆమె మొహం రక్తవిహీనమై పాలిపోయి ఉంది. వీరన్న, చెల్లెలికి ఆ వూరి ఆచార్లుచేత ఏదో మందు యిప్పిస్తున్నాడు.

ఆలోచనల సుడిగుండంలో పడి మునకలు వేస్తున్న సుబ్బన్న అదిరిపడ్డాడు. పోర్టరు అతని వీపుమీద తట్టి "ప్యాసింజరు వస్తున్నది" అన్నాడు. సుబ్బన్న హడావిడిగా లేచి పైపంచె దులిపి భుజంమీద వేసుకున్నాడు. రైలప్పుడే కనుచూపు మేరలోకి వచ్చింది. స్టేషను మాస్టరు పోర్టరును కేకవేస్తూ యువతలికి వచ్చాడు.

రైలు ఒక్క నిముషంసేపు మాత్రమే ఆగింది. సుబ్బన్న అలా చూస్తూ నిలబడే ఉన్నాడు. రైల్లో నుంచి ఎవరూ దిగలేదు. ఒకాయన మాత్రం చేతితో మరచెంబుతో కిందికి దిగివచ్చి 'ఇక్కడ మంచినీ ళ్ళుండవా ? పిల్లలు నీళ్ళకోసం ఏడు స్తున్నారు" అన్నాడు. సుబ్బన్న చెంబు తీసుకుని మీ రెక్కండి బాబుగారూ ! రైౖ లెక్కువసేపు ఆగదు. నేను నీళ్ళు పట్టి యిస్తాను లెండి" అంటూ పంపు దగ్గరికి వెళ్లి చెంబునిండా నీళ్లు పట్టి రైలు కదలబోతూ ఉండగా ఆయన చేతి కిచ్చాడు. రైలు కూతవేసి కదిలింది.

కొద్ది క్షణాల్లోనే మళ్లా అంతా నీరవమై పోయింది. ఎండ వేడిమి కొద్దిగా తగ్గింది. దూరంనుంచి సముద్రం గాలి వీచటం ప్రారంభించింది. సుబ్బన్న నెమ్మదిగా యువతలికి వచ్చి ఎద్దును లేపి బండి కట్టాడు. క్రింద మిగిలిన నాలుగు గడ్డిపరకలనూ తీసి బండిలో వేశాడు. పోర్టరు అతన్ని చూసి "యింటిదోవ పట్టావా ? శుభం వెళ్లిరా!" అన్నాడు.

సుబ్బన్న ఒక్క గెంతు గెంతి బండిలో కూర్చొని ఎద్దు నదిలించాడు. ఆ ఎద్దు పేరు లచ్చి. సుబ్బన్న అదిలించగానే అది వేగంగా నడవటం ప్రారంభించింది.

సుబ్బన్న మళ్లీ ఆలోచనలో పడ్డాడు. తను పెద్దవాడై పోతున్నాడు. నిన్న సాయంకాలం హరికథ మొదలుపెట్టబోయే ముందు వీరన్న కనిపించి నిట్టూర్చి 'ఏమిటోరా' పెద్దవాళ్ళ మైపో తున్నాం! నాకూ నెలరోజులనుంచీ దగ్గూ, లో జ్వరమూ. మా చెల్లెలి సంగతి నీకు తెలుసుగా వంట్లో రక్తమే లేదన్నాడు ఆచార్లుగారు. మందు తింటున్నది" అని చెప్పాడు నిజమే తను ఒంటరివాడు. తన కెవరూ లేరు. ఉన్నట్టుండి ఏ అర్ధరాత్రి వేళనో కన్ను మూస్తే ! ఇంతవరకూ తా నెవరికీ ఏవిధంగానూ ఉపయోగపడ లేదు. ఇంత జీవితమూ చాలా మామూలుగా గడిచిపోయింది. రోజు కున్న యిరవైనాలుగు గంటల లోనూ దాదాపు ఎనిమిది గంటలు—అంటే మూడోభాగం—నిద్రకిందనే గడిచిపోయింది. మిగిలిన రెండు భాగాలలోనూ ఒక భాగం పొట్టకూటి కోసం శ్రమపడటంతో సరిపోయింది. మూడో భాగం కాలకృత్యాలు తీర్చుకునేందుకూ, తన ఇంటి పెరట్లో కూరపాదులకు సేవ చేసేందుకూ, ఎద్దుకు పరిచర్య చేసేందుకూ చెల్లిపోయింది.

> "నీ వంటి పెద్దదొంగ నింతవరకూ చూడలేదు. నీ నిబ్బరం, అఘాయిత్యం..." అని జడ్జిగారంటూ ఉండగా దొంగ, మాటకి అడ్డువచ్చి "ఈ పొగడ్తలికి నేను లొంగనండోయ్!" అన్నాడు.

బండి నెమ్మదిగా సాగిపోతున్నది. పంటకాలవ వెనకబడిపోయింది. ఆకాశంలో మబ్బులు ఎర్రగా ఉన్నాయి. ఎవరో యిద్దరు వ్యక్తు లేదో మాట్లాడుకుంటూ నడిచిపోతున్నారు.

సుబ్బన్న చుట్టముట్టించాడు. అతనికి మరో విషయం గుర్తుకు వచ్చింది. తాను యుద్ధంలో పనిచేసే రోజులలో అప్పన్న అనేవా డొకడు ఉండేవాడు వాడికి చుట్టపొగ అసలు సరిపడేది కాదు. చుట్ట ముట్టించినప్పుడల్లా "ఒరే ! సుబ్బన్నా ! ఆ పొగ కొంచెం అటువైపు వూదు నాయనా ! నీకు పుణ్యం ఉంటుంది" అంటూ ఉండేవాడు. వాడు నాలుగేళ్ల క్రితం ఎక్కడో కనిపించి, ఏదో గవర్నమెంటు ఆఫీసులో పంఖా లాగుతూ 'బ్రతుకుతున్నా' నని చెప్పాడు.

బండి పొలిమేర దాటి వూళ్లో ప్రవేశించింది. సూర్యుడు అస్తమించినా యింకా కొద్ది వెలుగు ఉన్నది రత్తమ్మ అన్నగారి యింటిముందు నుంచుని పిల్ల లాడుకుంటూవుంటే చూస్తున్నది. సుబ్బన్న అటువై పొక్కసారి చూసి మళ్లీ తలవంచుకుని ఎద్దు నదిలించాడు మెళ్లో మువ్వలు 'గలగల'మని మోగుతూ వుండగా ఎద్దు వేగంగా నడుస్తున్నది.

సుబ్బన్న యిల్లు చేరుకునేసరికి వెలుగు క్రమంగా క్షీణిస్తున్నది. ఆకాశంలో నక్షత్రాలు నల్లని తివాచీమీద వెదజల్లబడిన రత్నాలవలె ప్రకాశిస్తున్నాయి.

అదొక పూరిల్లు. వాకిట విశాలమైన ఆవరణలో ఎన్నో రకాల కూరపాదు లున్నాయి. ఇంటి కప్పు నిండా దట్టంగా అల్లుకుని వున్నది సొరపాదు. కాయల బరువుకు కప్పు వంగిపోతున్నది. సుబ్బన్న ప్రతిరోజూ రెండో మూడో కాయలు కోసి ఎవరో ఒకరి కిస్తూనే ఉంటాడు. మొట్ట మొదటి సారిగా కాచిన కాయను మాత్రం కోయకుండా ముదరబెట్టి గింజలకోసం వేరే ఉంచాడు. వాకిట్లో చిక్కుడుపాదుకు చక్కగా పందిరి వేశాడు. రెండు మూడు రోజుల కొకసారి బుట్టెడు కాయలు కోసి వాళ్లకూ వీళ్లకూ యిస్తూ ఉంటాడు.

సుబ్బన్న ఎద్దును విప్పి చుట్టు పాకలో కట్టేసి దాని ముందింత గడ్డి పడేసి పెరట్లోకి వెళ్లి కాళ్ళూ, చేతులూ, మొహమూ కడుక్కున్నాడు. తర్వాత యింటి తాళం తీసి జేబులో ఉన్న అగ్గిపెట్టెతో గూట్లో ఉన్న బుడ్డిదీపం ముట్టించాడు. రెండు మూడు రోజుల క్రితమే అలకబడిన ఆ మట్టి యింట్లో దీపపు వెలుగు మందంగా వ్యాపించింది.

సుబ్బన్న బనీను జేబులోనుంచి ఒక బేడ నాణెం తీశాడు. అది అతని ఆనాటి సంపాదన. అంత తక్కువ రాబడి ఈమధ్య ఎప్పుడూ లేదు. అతడు తలపంకిస్తూ 'ఇవాళ బయల్దేరిన వేళ మంచిదికాదు.' అనుకుని యింట్లో మూలగా ఉన్న ఒక చెక్కను తొలగించి నేల లోపల ఉన్న ఒక కొయ్యపెట్టెను తెరిచాడు. అందులో ఒక కుండలో ఆ బేడ నాణెం పడేసి మళ్లీ యథాప్రకారం మూత వేసి యువతలికి వచ్చి వంట ప్రయత్నం మొదలుపెట్టాడు.

ఆ కుండలో దాదాపు పది పన్నెండేళ్లనుంచీ అతడు సంపాదించిన డబ్బంతా ఉంది. అంతా చిల్లర. అతనికి కాయితపు ముక్కలమీద నమ్మకం లేదు. "ఏ చెదలో పట్టి నాశనమైపోతాయి" అనుకునేవాడు. అతని అవసరాలకు పోను రాబడిలో చాలాభాగం మిగిలేది. ఎంత మిగిలితే అంత ప్రతి రోజూ ఆ కుండలో వేశాడు. చిల్లరతో ఆ కుండ దాదాపు నిండినట్టే. ఇవాల్టిలాగా ఒక బేడ డబ్బులు మాత్రమే దొరికిన రోజులూ ఉన్నాయి. బాగా బేరం తగిలి రెండేసి రూపాయల చొప్పున చిల్లర దొరికిన రోజులూ వున్నాయి

సుబ్బన్న కుండలో బియ్యం పోసి పొయ్యిమీద ఉంచి, పుల్లలతో మంట చేశాడు. అన్నం ఉడుకు పట్టింది. పొయ్యి వెలుగు ఆ చిన్న గదిలో మట్టి గోడలకు బంగారంపూత వేస్తున్నది. సుబ్బన్న పుల్లలను పైకి తోస్తూ ఆలోచిస్తున్నాడు. క్రిందటి రాత్రి ఆ వూళ్లో ఎవరో ఒకాయన హరికథ చెప్పాడు. సుబ్బన్న సాధారణంగా ఎక్కడికీ కదిలే రకం కాదు. అయినా నిన్నటి రాత్రి నిద్ర పట్టలేదు. అందువల్ల ఎక్కడికి వెళ్లలేదు. వంటినిండా దుప్పటి కప్పుకుని కూర్చుని సుబ్బన్న కథ విన్నాడు. అదొక భక్తుడి కథ. ఆ భక్తుడు మొదట్లో పరమ దుర్మార్గుడు. కిరాతకపు పనుల వాడికి ఆనందం కలిగించేవి. కనిపించినవారి నందర్నీ

హింస పెట్టేవాడు. దోవలు కొట్టి పొట్టపోస్నకునేవాడు. అటువంటి నీచుడు ఒక బాటసారి వల్ల జ్ఞానం పొంది పూర్తిగా మారిపోయాడు. తాను ఏ బాటలో నిస్సహాయులైన బాటసారులను దోచుకొని నానా బాధలూ పెట్టాడో, ఆ బాట మీదనే ఒక చిన్న పందిరి వేసుకుని కుండలనిండా చల్లని నీళ్ళు ఉంచుకుని దాహంగొన్న బాటసారులకు నీళ్లివ్వటం ప్రారంభించాడు. అతడు కాలం గడిచేకొద్దీ పండిన ఆకువలె తయారై చివరకు ఒకనాటిరాత్రి ప్రాణం విడిచాడు. అతనికోసం ప్రత్యేకంగా ఒక విమానం వచ్చి అతన్ని వైకుంఠానికి తీసుకుపోయింది.

ఈ కథ సుబ్బన్నకు బాగా నచ్చింది. అతడనుకున్నాడు. తను పెద్దవాడయిపోయినాడు. రాత్రి హరికథలో ఆయన చెప్పిన మృత్యు లక్షణాలలో కొన్ని అప్పుడే కనిపిస్తున్నాయి. 'నా' అనుకోదగినవా రెవరూ లేరు. చస్తే వూళ్లో నలుగురూ చేరి తగలబెట్టి ఒక్కసారి నిట్టూర్చి వూరుకుంటారు. తర్వాత యీ స్థలమూ, పాకా, బండీ ఎద్దూ అన్నీ పరుల పాలై పోతాయి. తనను మళ్లీ ఎవరూ తలచుకోవలసిన అవసరమే లేదు. మహా అయితే 'ఇంట్లో రకరకాల కూరపాదులు వేసి ఏ ఋతువులో కాచే కాయగూరలను ఆ ఋతువులో పండించి అప్పుడప్పుడు మనకు యిస్తూవుండేవాడు' అని ఏ ఒకరో, యిద్దరో అనుకుంటారేమో !

సుబ్బన్న కుండను దింపి పొయ్యి ఆర్పివేసి బయటికి వచ్చాడు. దీపం దగ్గరగా కూర్చుని చుట్టచుట్టుకుంటూ మళ్లీ ఆలోచనలో పడ్డాడు. ఆ చిల్లర ఎంతవుందో తనెప్పుడూ లెక్కపెట్టలేదు. అయినా ఎంత లేదన్నా ఏ మూడు వందలరూపాయలో వుండకపోదు. తానొకవేళ యింతకుముందు అనుకున్నట్టు కన్ను మూయ్యటం జరిగితే అంతా నేలపాలే. మహా అయితే తర్వాత ఎన్నాళ్ళకో ఎవరికో దొరుకుతుంది. ప్రస్తుతానికి ఎవరికీ అక్కడ చిన్న నేలమాళిగ ఉన్నట్టూ అందులో డబ్బుతో నిండిన కుండ ఉన్నట్టూ తెలిసే అవకాశం లేదు. దీన్నంతటినీ ఏమి చేసేట్టు ?

సుబ్బన్న తర్వాత పరధ్యానంగానే భోజనం ముగించాడు. అన్నం చాలా మిగిలిపోయింది. గిన్నె మీద మూత ఉంచి ఆ చోటు నీళ్లతో శుభ్రం చేసి అతడు బయటికి వచ్చి ఆరు బయట కుక్కిమంచం వాల్చుకుని యింట్లోనుంచి పక్కగుడ్డలు తెచ్చి పరుచుకుని కూర్చున్నాడు.

తూర్పున సప్తర్షిమండలం మెరుస్తున్నది. పౌర్ణమి వెళ్లిన ఆరో రోజు. చంద్రుడు, కొద్దిగా కొరికి పారేసిన వెన్నముద్దవలె ఉదయిస్తున్నాడు. చంద్రబింబం పక్కనే ఒక నక్షత్రం మహా శోభతో ప్రకాశిస్తున్నది.

సుబ్బన్నకు ఏదో స్ఫురణకు వచ్చి తల పంకించి "బాగా గుర్తుకు వచ్చింది. అలా చేస్తే బాగానే ఉంటుంది. పొద్దున్నే ఆ మూల కాసిన సొరకాయ తీసుకుని యీ చిల్లర అంతా మూట గట్టుకుని ఆయన దగ్గరికి వెళ్లాలి" అనుకున్నాడు. అతనికి గుండెలమీదినుంచి ఏదో బరువు దింపినట్టయింది. తర్వాత మరికొద్ది సేపటిలోనే హాయిగా వీస్తున్న చల్లనిగాలికి అతనికి నిద్ర ముంచుకు వచ్చింది.

తెలతెలవారుతూ ఉండగా అతనికి మెలకువ వచ్చింది. రకరకాల పక్షులు రకరకాలుగా అరుచుకుంటూ అన్ని దిక్కులా ఎగిరిపోతున్నాయి. సుబ్బన్న లేచి కాల్యాలన్నీ తీర్చుకుని చన్నీళ్లలో ప్రతిరోజూ వలెనే స్నానం చేసి క్రితం రాత్రి నిర్ణయించుకున్న ప్రకారమే సొరకాయ కోసుకుని కుండలో ఉన్న చిల్లర అంతా మూట కట్టుకుని బయల్దేరాడు.

అతడు బయలుదేరింది ఆ వూరి కరణంగారి యింటికి ఆయన పేరు ఆదినారాయణ. ఆయన కొన్నాళ్ల క్రితమే నలుగురితోనూ "మన వూళ్లో ఒక స్కూలు ఉండితీరాలి. మన పిల్లలు చదువు కోసం రోజూ రెండు మైళ్ళు నడిచిపోవటం ఏమీ బాగాలేదు. మీరు యధాశక్తిగా తోడ్పడితే నేను ప్రభుత్వంతో సంప్రదించి మరి కాస్త సహాయం రాబట్టగలను" అన్నాడు. అందుకు నలుగురూ సమ్మతించి శాయశక్తులా తోడ్పడ్డారు. మరి కొన్నాళ్లకే ఆ ఏర్పాట్లన్నీ పూర్తి కాగలవని ఆయన ప్రభుత్వంతో సంప్రదించిన మీదట అందరికీ చెప్పాడు.

ఆయన పంచలో కూర్చునివుండి సుబ్బన్నను చూసి "ఏం సుబ్బన్నా! మీ సొరచెట్టు కాపు ఉడిగిపోలేదూ ? నీ చేతు లేం చేతులోగాని కాలం గాని కాలంలో గూడా మీ యింట్లో కాపు ఉంటుం దేమిటోయ్" అన్నాడు.

సుబ్బన్న సొరకాయను ఆయన పక్కనే ఉంచి 'చేతుల్లో ఏముంది బాబుగారూ ! అంతా ఆ భూదేవి చలవ" అన్నాడు. ఆయన మళ్లీ "ఆ మూటేమిటి ? చిక్కుడుకాయలు కూడా తెచ్చినట్టున్నావే" అన్నాడు. సుబ్బన్న అటూ యిటూ చూసి "కాదు బాబుగారూ ! మీ రట్టా ముందు గదిలోకి రండి. చిన్న మనవి చేసుకుంటాను" అని జవాబిచ్చాడు. ఆయన లేచి ముందు గదిలోకి వచ్చాడు. సుబ్బన్న ఆ మూటను బల్లమీద ఉంచి కొద్దిగా కంపిస్తున్న కంఠస్వరంతో అంతా చెప్పాడు. "దీన్ని ఏదో మీకు తోచినట్టుగా వినియోగం చెయ్యండి. ముసలిముండావాణ్ణి. ఎప్పటి కేమవుతుందో చెప్పలేముగదా బాబుగారూ" అన్నాడు అతని గొంతు గద్గదికమయింది. పై పంచెతో కళ్లొద్దుకుని యింక మాట్లాడలేక "నేను వెళ్తాను బాబుగారూ !" అంటూ అక్కడ ఒక్క క్షణం కూడా నిలబడకుండా త్వరత్వరగా నడిచి వెళ్లిపోయాడు.

ఆయన కొద్ది క్షణాలు నోట మాట లేకుండా ముగ్ధుడై నిలబడిపోయాడు. తర్వాత తేరుకుని ఆ మూట ముడి విప్పి చిల్లర నంతటినీ బల్లమీద పోశాడు. వెంటనే ఆయన శిలాప్రతిమవలె చేష్టలుడిగి అప్రతిభుడై చేత్తో నుదుటిమీద కొట్టుకుని దీనంగా 'అయ్యో' అనుకున్నాడు. ఆ చిల్లర అంతా ఒక నెలరోజుల క్రిందట ప్రభుత్వమువారు వాడకంలోంచి రద్దుచేసిన పప్పు బేడలూ అణాలూ అర్ధణాలూను ! కొన్ని తెల్లని బేడ లున్నాయి. అక్కడక్కడ మాత్రం కొన్ని పావలా బిళ్లలూ, తెల్ల అణా బిళ్లలూ ఉన్నాయి. మొత్తానికి ఆ డబ్బులో దాదాపు తొంభై శాతం చెల్లదన్నమాటే.

ఆయన వాకిట్లోకి వచ్చి చూశాడు. దూరంగా నిబ్బరంగా అడుగులు వేస్తూ, మహదానందంతో తేలికపడిన మనస్సుతో నడిచిపోతున్నాడు బండి సుబ్బన్న. ★

'మధ్యేమధ్యే పానీయం'

ఒకానొక ఇల్లు జప్తు చెయ్యడానికి వచ్చిన ఆఫీసరు గుమాస్తాని ఇంటిలోకి పంపి ఆ యింట్లో ఉన్న వస్తువులజాబితా వ్రాయమని చెప్పి తను వీధి గుమ్మంలో కూచున్నాడు. వస్తువుల జాబితా వ్రాస్తున్న గుమాస్తాకు ఒకబల్లపై బ్రాందీ బుడ్డీ గ్లాసు కనబడ్డాయి. వెంటనే నోరూరి ఒక గ్లాసు వేసుకున్నాడు. మళ్ళీ జాబితా వ్రాయడం ప్రారంభించేడు. కొంతసేపు అయ్యాక అతని దృష్టి మళ్ళీ బ్రాందీ బుడ్డీపైకి పోయింది. మరో గ్లాసు వేసుకొని తనపని కొనసాగించేడు. "ఏమి చెప్మా ఇంత సేపయింది, వస్తువుల జాబితా ఇంకా పూర్తి కాలేదని కాబోలు" అనుకుంటూ ఆఫీసరు లోపలి కెళ్లేసరికి గుమాస్తా నేలమీదపడి ఉన్నాడు. అతని ప్రక్కనేపడి ఉన్న జాబితాలో ఆఖర్న వ్రాసి ఉన్నది ఇది:

గిరగిరతిరిగే తివాసీ ఒకటి.

ఎ. వి. ఎస్. రావు (విశాఖపట్నం)

వనితాలోకం :

మీ వాళ్లేం పెట్టారు?

మా పక్కింటి సావిత్రమ్మగారి కొత్త కోడలు కాపరానికి వచ్చిందని తెలిసి చూసేందుకని వెళ్లాను. అసలు పెళ్లయిన తరువాత మూడునిద్రలకి వచ్చినప్పుడు అయిన పరిచయం తరువాత ఒకటి రెండుసార్లు వచ్చినప్పుడు కలుసుకోవడంతో స్నేహంగా మారింది నాకూసరోజకూ—అంటే సావిత్రమ్మగారి కోడలికి. చదువుకున్న పిల్ల—షుమారుగా నావయస్సే కావడంవలన మా కిద్దరికీ స్నేహం చప్పున కలిసింది. ఆ నాలుగురోజుల పరిచయాన్నిబట్టి నే నా అమ్మాయినిగురించి గ్రహించినది—నమ్రతకలదని, చదువుకున్న పిల్లల పొళ్లు పెళ్లు లేనిదనీను.

నేను వెళ్లేప్పటికి నాలానే పలకరించి పోదామని వచ్చిన ఇరుగుపొరుగువారంతా చుట్టూ కూర్చున్నారు. మధ్యన సరోజ తల వంచుకుని కూర్చుంది సిగ్గుతో.

"ఏమోయ్, చివరికి మా ఊరుదాని వయిపోయావు ?" అన్నాను నవ్వుతూ.

నా మాటలు వినబడంగానే ప్రాణం లేచివచ్చినట్లుగా నా వంక చూసి తృప్తిగా నవ్వింది.

వాళ్లతోపాటు కూర్చున్నాను.

"ఇంతకీ మీవాళ్లిచ్చిన సారె చూపించావు కావు కోడలా !" అంది మా వీధినే ఉంటున్న ఒక పిన్నిగారు.

సరోజ చూపించాలని కాబోలు లేవబోయింది. అంతలో ....

"ఆఁ కాళ్ళు, చేతులు ఇచ్చి పంపించారు. అమాత్రం ముద్దూ ముచ్చటూనా వదినా మా ముఖానికి" అంది సావిత్రమ్మగారు.

నీరయిపోయి ముణుచుకు కూర్చుంది సరోజ. నా కెంతో జాలేసింది.

"అవుతే ఏమీ ఇవ్వకుండానే ఎలా పంపించిందమ్మా మీ అమ్మ" అనడిగింది మరో ఆవిడ.

సరోజ ఏమీ మాట్లాడలేదు. మళ్లీ వాళ్లత్తగారే అందుకుంది—

"ఇచ్చారులేవమ్మా పిన్నీ—మొగుడూ పెళ్లాం రేపు వేరింటికాపరం పెట్టాక కాఫీలు తాగేందుకు తలో స్టీలు గ్లాసు, అన్నానికి డబ్బాసోలెడు గిన్నె" అని నవ్వింది. ఆవిడ నవ్వుతో అంతా గొంతు కలిపారు.

సరోజ ముఖం ఎర్రపడింది !

నాలో—నాకు తెలియకుండానే వాళ్లందరిమీద కోపం వచ్చేసి "ఇంకేం ఇవ్వాలండి పిన్నిగారూ — చక్కని కళగల ముఖం ఇచ్చారు — దానికి వన్నెతెచ్చే గుణాలు నేర్పారు, చదువు చెప్పించారు. ఇవి చాలవుటండి మనకి" అన్నాను నవ్వుతూనే.

నామాట వా రందరికీ చేదుగా ఉండి మొత్తం మీద టాపిక్ మార్చారు.

తరువాత సరోజతో మాట్లాడుతూ—"ఇంకా నువ్వు వాళ్లమాటలే పట్టించుకుని బాధపడుతున్నట్టున్నావు సరోజా, ఈ పరీక్ష మే మందరం అనుభవించి అవమానం పొందినవాళ్ళమే ఆమాట కొస్తే వీళ్లలో ప్రతిఒక్కరు అనుభవించినవారే ! అందరినీ సంతృప్తిపరచడం మన తరం కాదు. ఇంకో ఇరవయి ఏళ్ళు పోయాక నువ్వూ నీ కోడలిని ఈ మాటలతోనే ఆహ్వానిస్తావు !" అన్నాను.

ఇద్దరం నవ్వుకున్నాం.

ఇంటికి వచ్చానన్నమాటే గాని ఆ సంఘటనే నా మనస్సులో ఉండిపోయింది.

ప్రతి తలిదండ్రులకి కూతుర్ని మంచిఇంట్లో పడి సుఖపడాలన్న కోరిక ఉండటం సహజం.

వసంత

కట్నం మోయలేమని తెలిసుండి కూడా సిద్ధపడతారు. ఆ కోరికతోనే. కట్నం, ఆపైన లాంఛనాలు, మగపెళ్లివారికి కోపాలు రాకుండా మర్యాదలు—వీటితోటి కన్యాదాత హూనం అయిపోతాడు. మరీ ఆస్తిపరులు తప్ప మామూలు మధ్య తరగతి కుటుంబీకులు ఈ దెబ్బ నుంచి రెండు మూడేళ్లదాకా కోలుకోలేరు. దీనిమీద పులిమీద పుట్రలాగా వచ్చిపడుతుంది అమ్మాయిని కాపరానికి పంపించడం.

అక్కడికీ తన శక్తివంచనలేకుండా అమరుస్తాడు ఆడపిల్లతండ్రి. కాని అవి అత్తగార్లకంటికి ఆనవు. అసలు ఈ విషయంలో కేవలం అత్తగార్లని అనీ లాభంలేదు. ఇరుగు పొరుగు అమ్మలక్కలదృష్టికి నదరుగా ఉండాలన్న కోరిక వలన వస్తాయి ఈ నిరుత్సాహాలు, తేలికమాటలూనూ.

కాపరానికి వెళ్లబోయే ఆడపిల్లకీ ఉంటాయి కోరికలు — తను లెక్కలేనన్ని వస్తువులు, సారె చీరెలతో ఆర్భాటంగా వెళ్లాలని. అక్కడివాళ్ల నందరినీ దిగ్భ్రాంతుల్ని చేయాలనీను. కాని పుట్టింటివారి పరిస్థితులు కళ్లారా చూస్తున్నందువలన నిజంగా తండ్రిరక్తం తాగుతున్నట్టే బాధపడుతుంది. ఇటు పుట్టింటికి అటు అత్తగారి మాటలకి మధ్య నలుగుతుంది. మళ్లీ తనూ ఒకరికి అత్తగారయితే ఇవన్నీ మర్చిపోతుందనుకోండి !

మా వదిన కాపరానికి వచ్చినప్పుడు మా అమ్మ సాధించటం మొదలెట్టింది. "అంత పసుపు పండుతుంది మీవాళ్ళకి—మరి కాస్త యిస్తే ఆస్తంతా కరిగిపోతుందా" అని.

మా వదిన నాతో బాగా స్నేహంగా ఉండేది. అందువలన "నువ్వు నాకేమిస్తావో చూద్దాంగా" అనేశాను కోపంతో.

"ఏడిశావు ముది మాటలూ" అని ఒక్క మొట్టు మొట్టింది.

చూడగా, చూడగా నా కనిపిస్తుంది—అసలు ఆడదాని శత్రువు ఆడదేనని. కొత్తకోడలు—వేరే కాపరం ఉండేదాకా ననుకోండి—అత్తవారిల్లు అంటే హడిలేందుకు కారణం అత్తగారు. అత్తగారు అల్లరి పడటానికి కారణం కోడలు. కట్నం దగ్గర పేచీకికూడా సాధారణంగా ఆడవాళ్లే కారణం. తమ కొడుక్కి 'ఇన్నివేలు' పుచ్చుకున్నామని చెప్పుకోవడం ఘనతగా భావించేవాళ్లు కొల్లలు. సారెచీరెల దగ్గరా సూటీ పోటీ మాటలు మనవాళ్లవే !

మరీ సమష్టికుటుంబాల్లో ఈ బాధలు ఎక్కువ. ఎక్కువ సారెతో వచ్చిన కోడలు తక్కువ సారె తెచ్చిన తోడికోడల్ని చులకనగా చూస్తుంది—అక్కడికి తానేదో ఘనమైనట్టు !

మన జీవితాలు సుఖంగా సాగాలంటే మన మనస్తత్వాలు మారాలి. ప్రతి ఆడదీ తనూ ఒకప్పుడు కొత్తకోడలేనన్న భావం, ఈ అవమానం, సూటిపోటీమాటలు అనుభవించానన్న విషయం మరిచిపోకూడదు. అసలే ఆత్మీయుల్ని వదిలివచ్చానన్న బెంగతో ఉండే ఆ అమ్మాయిని సానుభూతితో పలకరించాలి—తనేమీ కోల్పోలేదన్న నమ్మకం కలిగించాలి.

అందరూ పోట్లాడతారని నా ఉద్దేశం కాదు.

ఇప్పుడంతా చదువుకుంటున్నారు. కనీసం ఈ తరంవాళ్లయినా ఈ విషయం గుర్తుంచుకొని అత్తగారంటే తప్పులెంచే అధికారి లాంటిది కాదని తమకి హితైషి అని అనిపించుకోవాలి. ★

ఒకతను ఆసుపత్రిలోకి పరిగెత్తుకుంటూవచ్చి, 'డాక్టరుగారు నన్ను రక్షించండి. నాకు ఏవిషయమూ కొన్ని క్షణాలకంటె జ్ఞాపకం వుండటంలేదు. పిచ్చెక్కుతుందేమోనని భయంగా వున్నది' అన్నాడు.

'ఇది ఎంతకాలం నుంచి వున్నది' అన్నాడు డాక్టరు.

'ఏది? ఎంత కాలం నుంచి వుంటున్నది' అన్నాడా రోగి.

ఎం. రామకృష్ణ (గుంటూరు)


దైవ పరీక్ష
అబ్బి రఘురామరెడ్డి

పూర్వకాలంలో మగధదేశాన్ని ధర్మదత్తుడు అనే రాజు పరిపాలించేవాడు. అతడు ప్రజలను కన్నబిడ్డలు లాగ చూసుకునేవాడు. అందుచేత ప్రజలు హాయిగా కాలం వెళ్లబుచ్చేవాళ్ళు. అతడు ప్రతిదినము బీదలకు దానకర్ణుని లాగ దానాలు చేసేవాడు. ప్రతిరోజూ చాలా మంది బీదవాళ్ళు అతన్ని యాచించేవాళ్ళు.

ధర్మదత్తుని దానశీలతను పొగడని వాళ్ళు ఆ దేశంలో ఎవ్వరూ లేరు!...కొంత కాలానికి రాజుగారి కోశాగారం ఖాళీ అయిపోయింది. రాజుగారికి ఏమి చేయడానికి పాలుపోలేదు. "ఇంతకాలం తను చేసిన దానాలవలన తన కీర్తి బాగా వ్యాపించింది. ఇప్పుడు దానం చేయలేదంటే తన కీర్తికి దెబ్బతగులుతుంది!" అని ఆలోచించాడు.

ఇటువంటి సమయంలో ఒక బ్రాహ్మణుడు ధర్మదత్తుని దగ్గరికి వచ్చాడు. రాజుగారు అతన్ని అన్ని విధాలా సత్కరించి కారణం అడిగాడు. ఆ బ్రాహ్మణుడు, "రాజా! నీ దానశీలత నా చెవుల్లో పడింది... నేనొక వ్రతం చేయదలిచాను. దానికి ఒక లక్ష రూపాయలు కావాలి! మీరు తప్ప ఈ ప్రపంచంలో మరెవ్వరూ నాకు ఈ మొత్తాన్ని ఇప్పించలేరని తెలిసి మీ దగ్గరికి వచ్చాను. నాకీ మాత్రం సహాయంచేసి పుణ్యం కట్టుకో మహారాజా! నీ పేరు చెప్పుకుంటాను" అన్నాడు. ధర్మదత్తునికి ఏమీ పాలుపోలేదు. కొంతసేపు ఆలోచించాడు. ఒక ఆలోచన అతనికి తట్టింది.

"బ్రాహ్మణోత్తమా ? ఒకసారి లక్షరూపాయలడిగావు అంత మొత్తం ప్రస్తుతం లేదు!... ఓ వారంరోజులు గడువు యిప్పించారంటే మీకు ఆ మొత్తాన్ని అందిస్తాను! ఆలస్యం అయినందుకు మన్నించండి! వీలైనంతత్వరలో మీ కందిస్తాను!..." అన్నాడు ధర్మదత్తుడు.

"రాజా! మీరన్నట్లు అప్పుడే యిప్పించండి. నా వ్రతానికి ఇంకా పక్షంరోజులుంది...మీ దయవల్ల నా వ్రతం జయప్రదంగా జరుగుతుంది" అంటూ ఆ బ్రాహ్మణుడు రాజువద్ద సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు. ఇప్పుడు ధర్మదత్తుడు ఒక క్లిష్ట సమస్యలో చిక్కుకున్నాడు; చాలా సేపు చింతించి ఆఖరికి ఓ దారికి వచ్చాడు.

వంగదేశాన్ని పరిపాలిస్తున్న సింగసేనుడు ధర్మదత్తుని ప్రియమిత్రుడు. ఇద్దరూ ఒకే గురువుదగ్గర విద్యలు నేర్చుకున్నారు. అప్పుడు ఇద్దరూ—ఎవరికెటువంటి సహాయం కావాలన్నా ఒకర్నొకరు సహాయం అడుక్కుందాం" అని అనుకున్నారు.

ధర్మదత్తుడు సింగసేనుని సహాయంకోరటానికి మొదట వెనుకదీశాడు. కాని అంతకంటే మరి వేరే మార్గం లేదు. మరో మూడు నెలలు దాకా తన కోశాగారంలోనికి కాసైనా రాదు. మరి బ్రాహ్మణుడు వారంరోజుల్లో కావాలని కోరాడు. అందువల్ల ఆఖరికి ధర్మదత్తుడు తన బాల్యమిత్రుని సహాయం కోరటానికి నిశ్చయించుకొన్నాడు.

వెంటనే ధర్మదత్తుడు తనే స్వయంగా వంగదేశానికి ఓ మంచి గుర్రంమీద బైలుదేరాడు. అతడలా బైలుదేరి, ఆఖరికి వంగదేశాన్ని చేరుకున్నాడు. రాక రాక వచ్చిన తన మిత్రుని సింగసేనుడు సమస్త విధాల మర్యాదచేసి, "ధర్మదత్తా! రాకరాక యిన్నాళ్ళకు వచ్చావు. ఓ మూడు నెలల పాటు నాతో వుండు!" అని కోరాడు.

కాని అందులకు ధర్మదత్తుడు అంగీకరించలేదు. ఒక్కరోజుమాత్రం వుంటానికి అంగీకరించాడు. సింగసేనుడు ధర్మదత్తునితో ఆ వేళంతా కబుర్లు చెబుతూ గడిపాడు.

ధర్మదత్తుడు లక్షరూపాయలు అడిగితే ఏమంటాడో? ఓ వేళ అతని వద్ద కూడ డబ్బులేకపోవచ్చు. ఏమని అడిగేది? అని మదిలో పరిపరివిధాల చింతించి, ఆఖరికి సహాయం కోరటానికి నిశ్చయించుకోలేదు!... ...మరి బ్రాహ్మణుడికి ఎలా సహాయం చెయ్యడం?... ... ...

మరుసటిరోజు ధర్మదత్తుడు తన దేశానికి ప్రయాణమయ్యాడు. అప్పుడు సింగసేనుడు ధర్మదత్తునికి కానుకగా మూడు లక్షల విలువగల ముత్యాల హారాన్ని కానుకగా యిచ్చాడు. ధర్మదత్తుడు మదిలో "దీన్ని ఆ బ్రాహ్మణునికి యిచ్చేస్తే సరిపోతుంది!" అని తలపోశాడు. అతడలా వస్తువుండగా దారిలో ఒక బీదవాడు కన్నీరు కారుస్తూ, "రాజా! మా పాలిట కల్పవృక్షమా ఈ వేళ నేను నా కుమార్తెకు పెళ్లి చేశాను. కట్నం ఇవ్వలేదని నా కూతుర్ని వదిలేశాడు! బాబూ మీకు పుణ్యం వుంటుంది! నా కూతురి కాపురం కాపాడండి!!... అని దీనంగా వేడుకొన్నాడు. ధర్మదత్తునికి అతనిమీద జాలివేసింది - వెంటనే ముత్యాల హారాన్ని అతనికిచ్చివేశాడు. వాడు సంతోషంగా వెళ్లిపోయాడు.

తర్వాత రాజు తన దేశాన్ని చేరుకున్నాడు. ఆశ్చర్యం! రాజుగారి కోశాగారం బంగారంతో నిండి వుంది! ధర్మదత్తునికి భలే ఆశ్చర్యం వేసింది. అకస్మాత్తుగా అతనిముందు

(48 వ పేజీ చూడండి)



యుక్తి

ఆర్.వి.ఆనందరావు

అది కర్ణాటక చక్రవర్తి శ్రీ కృష్ణ దేవరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని బహు ప్రజారంజకంగా పరిపాలించే రోజులు. మంత్రి తిమ్మరుసు రాయలవారికి అండగా వుండి పరిపాలనలోని లోపాలను సవరింపజేసి జనానురాగాన్ని పొందే రోజులు. ప్రజలు కష్టమంటే ఏమిటో ఎరుగని రోజులవి.

ఇలా వుండగా రాయలసామంతుల్లో ఒకడైన గజపతి రాయలపై కుట్రకు దిగాడు. చారులమూలంగా ఈ విషయం కాస్తా రాయలకు తెలిసిపోయింది. వెంటనే రాయలు తగిన సైన్యాన్ని సమకూర్చుకుని గజపతిపై దండెత్తాడు. గజపతి భయపడి కొంతమంది సేవకులతోసహా తన ఒక్కగానొక్క కుమార్తెను వెంటబెట్టుకుని అడవుల్లోకి పారిపోయాడు.

కోట రాయలచేజిక్కింది. గజపతి సైన్యములో కొంతమంది రాయలకు లొంగిపోయారు. గజపతి మాత్రం అరణ్యంలోనే కాపురం చేస్తూ వచ్చాడు.

గజపతి కుమార్తెను గురించి, ఆమె అందచందాలు, గుణగణాలను గురించి రాయలవారికి తెలిసింది. ఎలాగైనా ఆమెను పెండ్లాడాలనుకున్నాడు. అప్పటినుంచీ రాయలు సరిగ్గా సభకు హాజరుకాకుండా, ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ అదోలా అయిపోతూ వచ్చాడు. తిమ్మరుసుకు ఇది అర్థంకాలేదు. ఎలాగైతేనేం, ఒకరోజు ధైర్యం చేసి రాయల ఎడతెగని ఆలోచనలకు కారణమేమిటని అడిగాడు.

రాయలు ఆ ముసలి మంత్రివద్ద గజపతి కూతురును గురించి చెప్పి ఎలాగైనా ఆమె తనకు దక్కేటట్లు చూడమన్నాడు.

తిమ్మరుసు ఆ మరునాడే అడవుల్లో వుంటున్న గజపతికి రాయల అభీష్టాన్ని తెలియజేస్తూ, "మీరు ఈ వివాహానికి అంగీకరించినట్లయితే మీ రాజ్యాన్ని మీకే తిరిగి యిచ్చేస్తాము. మీరు మాకు సామంతులుగా వుండనవసరం లేదు. మీ రాజ్యాన్ని మీ యిష్టం వచ్చినట్లు మీరు ఏలుకోవచ్చు'' అని కబురు పెట్టాడు.

కబురు విన్న గజపతి మహదానందంతో దాని కంగీకరించి తన కోట చేరుకున్నాడు.

వాళ్ల వంశాచారం ప్రకారం పెండ్లికి ముందు వరుడు వధువుని చూడకూడదు. కానీ రాయలకు తన కాబోయే అర్థాంగిని ఒక్కసారైనా చూడాలని కోరిక పుట్టింది. తన కోరికను మహామంత్రి చెవిలో పడేశాడు. మంత్రి బాగా ఆలోచించి ఏదో ఒక ఉపాయాన్ని రాజుగారి చెవుల్లో గొణిగాడు.

మరునటి రోజు తిమ్మరుసు మంత్రి ఒక్క సేవకుణ్ణి మాత్రం వెంటబెట్టుకు సరాసరి గజపతి కోటకు బయలుదేరాడు. అతని వెంటవచ్చిన భటునిచేతిలో ఒక తాంబూలపుతట్ట వుంది. తిమ్మరుసు ఆ తట్టలోని ఆకు వక్కల్ని మాటిమాటికి వేసుకుంటూ కోటలోకి ప్రవేశించాడు.

అక్కడ ఓ పెద్దహాలులో గజపతి కూతురు కొంతమంది చెలికత్తెలతో ఆడుతూ పాడుతూ వుంది. మహామంత్రి చూడ్డంతోటే ఆటపాటల్ని కట్టిపెట్టి అతని ఎదురుగా నిలబడి "నాన్నగారు లేరు. వేటకు వెళ్లారు" అంది తలవంచుకునే!

తిమ్మరుసు మందహాసంచేస్తూ, "ఏమీ లేదమ్మా! నీ పెళ్లివిషయమై మాట్లాడాలని వచ్చానంతే!" అన్నాడు. గజపతికూతురు అమితంగా సిగ్గుపడిపోయి మొహాన్ని తన వేళ్లతో కప్పుకుంది.

"చూశావట్రా! మీ మహారాణిగారికి ఎంతసిగ్గో!" అన్నాడు మంత్రి ఆ సేవకునివేపు చూచి.

"ఉండాల్సిందేగా" అన్నాడా సేవకుడు గంభీరంగా. గజపతి కూతురు మెల్లగా తలెత్తి ఆ భటునివేపు చూచింది. ఆశ్చర్యచకితురాలైంది. తనకళ్ళను తానే నమ్మలేకపోయింది. ఆశ్చర్యం! ఆ భటుని మెళ్లో తన తండ్రి రాయలకు కానుగ్గా ఇచ్చిన రత్నాల హారం తళుక్కుమంది. తన చెలికత్తెలతో ఏమో మెల్లిగా చెప్పింది.

(48 పేజీ చూడండి)

ప్రణయావేశం

(19 వ పేజీ తరవాయి)

కనిపెట్టి నా ప్రేమ గురించి ఆమెతో నువ్వు చెప్పెయ్. ఆమె ఇష్టపడే సూచన కన్పించిందా— మా యిద్దరికీ 'లైన్ క్లియర్' సిగ్నలిచ్చెయ్యి. లేక పోతే 'రెడ్' సిగ్నలు చూపించు"

"బాగానే వుందికాని 'లైన్ క్లియర్' అంటే నీ వుద్దేశమేమిటి?"

"అంటే నువ్వు కాస్త నాకు "హింట్' ఇచ్చి తప్పుకుంటే, నేనిప్పుడు నా ప్రేమను వ్యక్తం చేస్తాను."

"అంతేనా? మరి తర్వాత కార్యక్రమం నువ్వను కున్నంత సులభంకాదే!"

"ఏం? ఆమె యిష్టపడినట్లయితే వెంటనే పెళ్ళి చేసేసుకుంటాను."

"మరి మీ అమ్మా, నాన్న, వాళ్ళమ్మా, నాన్నా ఒప్పుకోవద్దూ?"

"అవన్నీ 'మైనర్ థింగ్సు' వాటి గురించి తరువాత ఆలోచిద్దాం. ముందర ముఖ్యమైన విషయాన్నిగురించి ఆలోచించు."

శ్రీహరి చాలాసేపు ఆలోచించాడు. కాని వీళ్ళ యిద్దరి పెళ్ళికీ బోలెడన్ని ఆటంకాలు కన్పిస్తూనే వున్నాయి. సుధను తను ఎక్కువగా 'స్టడీ' చెయ్యలేదుగాని శేషగిరి మాటల్నిబట్టి ఆమెకు శేషగిరంటే ఇష్టంలాగే వుంది. పోనీ సత్యాన్ని కూడా 'కన్సల్ట్' చేద్దామంటే శేషగిరి సత్యానికి విషయం ఎంతమాత్రం తెలియనివ్వద్దన్నాడు. శేషగిరికి తన తలి తండ్రులకన్నా అంత భయంలేదు గాని, సత్యం దగ్గర చాలా భయం, గౌరవమూనూ. ఇంతకీ ఒక తెనుగు అబ్బాయి మహారాష్ట్రపు పిల్లను పెళ్ళాడడంఅంటే మాటలా? శ్రీహరికి తన పినతల్లి జ్ఞాపక మొచ్చింది. అవిడ ఈ మహారాష్ట్రపు కోడల్ని గుమ్మమెక్కనిస్తుందా? వీళ్ళు ఈ వూళ్ళో కాపరం చెయ్యాలిసిందే. మధ్య తను ఈ సమస్యల్లో ఇరుక్కున్నాడే!

మర్నాడు సాయంకాలం శేషగిరి హుషారుగా వచ్చాడు. శ్రీహరి, శేషగిరి వుత్సాహాన్ని, సుధని టీ కి పిలిస్తే రావడానికి ఆమె అంగీకరించడమే కారణమని అర్థం చేసుకున్నాడు. శేషగిరి, శ్రీహరి దగ్గరికివచ్చి "అన్నయ్యా! మంచి ఛాన్సు. సుధ మనల్ని ముగ్గురినీ రేపు తన యింటికి టీ పార్టీకి రమ్మంది" అన్నాడు.

"ఏమిటి విశేషం?"

"రేపు తన పుట్టిన రోజట. సాయంకాలం ఆరు గంటలకి పార్టీ. ఆమెను స్టడీ చెయ్యడానికి నీకు మంచి అవకాశం దొరుకుతుంది.

"మరి సత్యం కూడా వుంటాడే?"

"ఆ విషయం నువ్వు నాకు వదిలెయ్. వాడు ఎల్లాగా పార్టీకి రాడు. వాడికి రేపు ఆఫీసులో తోలెడు పనుంది. మనం మట్టుకు చాలా జాగ్రత్తగా ప్రిపేర్ అవ్వాలి. ఇవ్వాళ సుధ ఏమందో తెలుసా?"

"ఏమంది?"

"మిస్టర్ రావు. నువ్వు నాకు ఆత్మ బంధువ్వి. అందుచేత నిన్ను తప్ప ఇంకెవ్వరినీ పార్టీకి పిలవను. మీ బ్రదర్స్‌ను కూడా తీసుకురా! అందిరా"

శ్రీహరికి ఈ ప్రేమ గురించి అగమ్య గోచరంగా వుంది. శేషగిరిలో ప్రత్యేక గుణాలేమీ లేవు. చదువు డబ్బూ, తెలివీ, అందమూ అన్నీ వున్న సుధ, శేషగిరిలో ఏంచూసి ప్రేమిస్తోంది? 'నువ్వు నాక ఆత్మ బంధువ్వి' అని ఒక స్త్రీ ఒక పురుషుణ్ణి అందంటే ఆమె అతన్ని సోదరుడిగానైనా భావిస్తూ వుండాలి. లేదా తన ప్రేమ కర్షమైన వాడిగానైనా భావించాలి. ఒకవేళ ఆమెదంతా సోదర ప్రేమ అయితే శేషగిరిని ముందుగానే దానికి సిద్ధపరచడం మంచిది.

"ఒరేయ్! ఆత్మబంధువు అంటే రెండర్థాలున్నాయి. సోదరుడిగా చూసుకునేవాణ్ణి కూడా ఆత్మ బంధువే అంటారు......"

"అవునురోయ్! కొంపతీసి చివరికిదంతా సోదర ప్రేమ అంటుందేమిటి? అలాగైతే నాకు "పొటాసియం సైనేడే శరణ్యం" అన్నాడు శేషగిరి బిక్క మొహంతో.

"ఖంగారు పడకు. రేపు సాయంకాలం ఏదో ఒకటి తేలిపోతుంది."

శేషగిరి అన్నట్లే సత్యం తనకు ఆఫీసు వర్కుందని పార్టీకి రాలేననీ చెప్పాడు. సాయంకాలం ఆరు గంటలకల్లా! శ్రీ హరి, శేషగిరీ ఇద్దరూ మంచి సూట్లు వేసుకొని, చేతుల్లో ఖరీదైన ప్రజంట్లు పట్టుకొని మిస్ సుధ ఇంటికి బయల్దేరారు.

మర్నాడు.

మిస్ సుధ తండ్రి అశోక్ దేశపాండే, రిటైర్డు జడ్జి! ధంతోలీలో మంచి భవనం కట్టించాడు. ఆయనకు ఆరుగురు కూతుళ్ళు, ఇద్ద రబ్బాయిలు. అబ్బాయిలిద్దరూ మంచి హోదాలలో వున్నారు. ముగ్గు రమ్మాయిలకు పెండ్లి చేశాడు. ఇంకా ముగ్గు రున్నారు పెళ్ళికి. ఆయనకు పిల్లలంటేనూ, ముఖ్యంగా ఆడపిల్లలంటేను చాలా ప్రేమ. వాళ్ళ యిష్టం వచ్చినట్లు నడుచుకోనిస్తాడు. పరమ వేదాంతి. పగలల్లా భగవద్గీతా, భారతం, రామాయణం, జ్ఞానేశ్వరీలాంటివి చదువుకోడం, సాయంకాలం తోట పని చెయ్యడం ఆయన కలవాటు.

శ్రీహరీ, శేషగిరీ వచ్చేటప్పటికి ఆయన తోటలో వున్నారు. సుధ మేడమీదనుంచి వీళ్ళనుచూచి క్రిందకుదిగివచ్చి వీరి నిద్దరినీ ఆహ్వానించి, హాలులోకి తీసుకువెళ్ళి కూచోబెట్టింది. సుధ అలంకారం శేషగిరి ప్రత్యేకంగా పరిశీలించటంచూసి శ్రీహరి తనలో తను నవ్వుకున్నాడు. రోజాకలర్ పట్టు చీర, మహారాష్ట్ర పద్ధతిలో కట్టుకుని, అదే కలరు జాకెట్టు వేసుకుంది. తలంటి పోసుకొనివుందేమో జుట్టులో నొక్కులు బాగా కన్పిస్తున్నాయి. జడ చట్ట చుట్టి పువ్వులు పెట్టుకుంది. మొత్తం మీద ఆమె ఒక గులాబీ పువ్వులా వుంది.

శేషగిరిని ఆహ్వానించడంలోనూ, అతనితో మాట్లాడడంలోనూ, ఆమె మొహంలో ద్యోతకమవుతున్న విశేష అభిమానం శ్రీహరి కనిపెట్టాడు. ప్రతీదానికీ "మిస్టర్ రావు నీ కిష్టమని శ్రీఖండ్ చేయించాను" "మిస్టర్ రావు నువ్వు రోజా కలర్ లైక్ చేస్తావని ఈ చీర కట్టుకున్నాను" "మిస్టర్ రావు నిన్ను మా 'ఫాదర్'కి పరిచయం చేస్తాను" అని ఆమె శేషగిరిగురించి ప్రతీ నిముషమూ ఎంతో శ్రద్ధ చూపించడంతో శ్రీహరికి పూర్తిగా అనుమానం తీరిపోయింది. ఆమె నిస్సందేహంగా శేషగిరిని ప్రేమిస్తోంది. శేషగిరి ఆమెతో తన మనస్సులో వున్నది చెప్పెయ్యచ్చు, అనుకున్నాడు శ్రీహరి.

ఇంతలో సుధ అక్కా, తండ్రీ కూడా లోపలికి వచ్చారు. సుధ తండ్రికి వీరిద్దరినీ పరిచయం చేసింది. సుధ అక్క మునుపు వారిని స్టేషనుల్లో చూసివుండడంచేత, తానే వారిని పలకరించింది. ఆమె పేరు సుజాత. ఆమె బి. ఏ. పాసయి ఎం. ఎ. కి కట్టింది. ఆమె కూడా వీరితో చనువుగా మాట్లాడసాగింది. ఆమె కూడా ఎకనామిక్సు తీసుకోవడంవల్ల శ్రీహరితో ఎక్కువగా మాట్లాడసాగింది.

దేశపాండేగారు శేషగిరిని అనేక ప్రశ్నలు వేస్తున్నారు. అతను ఏం చదివిందీ, భవిష్యత్తులో ఏం చెయ్యదల్చుకున్నదీ, వివిధ విషయాలమీద అతనికి ఎలాంటి అభిప్రాయాలున్నదీ అన్నీ తెలుసుకుంటున్నారు.

మిస్ సుధ ఆరు ప్లేట్లు పెట్టింది. శ్రీహరి ఆరవ ప్లేటు ఎవరికాఅని ఆలోచిస్తున్నాడు. ఇంతలో బయట మోటరు సైకిలు ఆగిన చప్పుడయింది. సుజాత కిటికీలోంచిచూసి "శంకర్ కూడా వచ్చేశాడు. సుధీ! టీ తీసుకురా" అని సుధతో అంది. సుధ ప్లేట్లనిండా గులాబ్‌జాములూ, సమోసాలూ, మిక్చర్, బిస్కట్లూ, పళ్ళూ అన్నీ వేసేసింది. లోపలికివెళ్ళి టీ కెటిల్ ట్రే లో కప్పులూ సాసర్లూ బాయ్‌చేత పట్టించుకు వచ్చింది.

నల్లగా, పొడుగ్గా వున్న ఒక వ్యక్తి లోపలికి వచ్చాడు. అతను రాగానే దేశపాండేగారూ, అక్కా చెల్లెళ్ళూ గౌరవంగా ఆహ్వానించారు. అతని పేరు శంకర్

చరిత్ర పాఠంపైన విసుగు పుట్టి రామారావు కిటికీలోంచి దూరంగా గేదెపాలుతీస్తున్న దృశ్యాన్ని చూస్తూ కూర్చున్నాడు. ఇది గమనించిన ఉపాధ్యాయుడు, రామారావ్! హుమయూన్ పాలిస్తూఉండగా ఏం జరిగింది?" అని గద్దించాడు. రామారావు కంగారుగా లేచి "గేదె తన్నేద్దామని చూసింది సార్!" అన్నాడు.

అని, "ఎయిర్ ఫోర్సు"లో పైలట్ పని చేస్తున్నాడనీ శ్రీహరికీ, శేషగిరికీ పరిచయం చేశారు.

దేశపాండేగారు శంకర్‌ని అతని సెలవు ఎప్పుడయిపోతుందో, ఏఏ వూళ్ళు వెళ్ళదల్చుకున్నాడో అన్నీ వివరాలు అడగసాగారు. శంకర్ అన్నిటికీ సమాధానం హుషారుగా చెప్తున్నారు. సుధనీ, సుజాతని నవ్వుతు పలకరించాడు. సుధకోసం మంచి రిష్టువాచి ఒకటి బహుమానంగా తెచ్చాడు.

శ్రీహరీ, శేషగిరీ అతనెవరా? అని ఆశ్చర్యపడ్డారు. కానీ క్రమంగా అదే తెలుస్తుంది అని వూరుకొన్నారు.

పార్టీ ప్రారంభమైంది. అందరూ ప్లేట్లల్లోః ఖాళి చెయ్యడం మొదలెట్టారు. దేశపాండేగారు అతిథుల్ని పలకరిస్తూ, తాను తిరిగిన వూళ్ళూ, చదివిన గ్రంథాలూ, తెలుసుకొన్న విషయాలూ అన్నిటిగురించీ చెప్తున్నాడు. శ్రీహరీ, సుజాతా తమ సంభాషణ ఎకనమిక్సుతో ప్రారంభించి, పుస్తకాలూ, సినిమాలు, విద్యార్థులూ, ఆంధ్రులూ, మహరాష్ట్రులు అన్ని విషయాల గురించి మాట్లాడేస్తున్నారు. శేషగిరీ, సుధా ఆఫీసు విషయాలూ, కొత్తగా వచ్చిన సినిమాలూ, ఇద్దరి భవిష్యత్తు గురించి మాట్లాడుతున్నారు దేశపాండేగారి మాటలు శ్రద్ధగా వింటున్నది శంకర్ ఒక్కడే.

అందరూ టీ త్రాగడం పూర్తి చేశారు. దేశపాండేగారికి చదరంగం అంటే పిచ్చి. శంకర్ కూడా బాగా ఆడతాడు. అందుకని టీ అవగానే వాళ్ళిద్దరూ చదరంగం ఆడుకోవటానికి వెళ్ళిపోయారు.

శ్రీహరి తనకి మంచి అవకాశం దొరికిందని, తను అనుకున్న పని ప్రారంభించదలచాడు. సుజాత తనతో చనువుగా మాట్లాడడం అతనికి కొంత ధైర్యం కలిగించింది. సుధ మనస్సును ఆమె మాటల ద్వారా తెలుసుకోవాలని

"మిస్ సుధా. ఇవాళ మాకు చాలా సంతోషంగా వుంది. మీ నాన్నగారిని కలుసుకునే భాగ్యం లభించింది మాకు. మనమంతా ఇక్కడ ఇలా కూచుని మాట్లాడుకోవడం ఒకే కుటుంబంలో మనుషుల్లా వున్నాం" అని శేషగిరివైపు చూచాడు.

శేషగిరి 'బాగా వున్నావు' అన్నట్లు తలవూపాడు.

"నిజానికి మా శేషగిరి చాలా అదృష్టవంతుడు. మిస్ సుధలాంటి స్నేహితురాలు దొరకడం వాడి అదృష్టం."

"అదేమిటి! నన్ను గురించి అలా పొగిడేస్తున్నారు. మిస్టర్ రావు ఎంతో మంచివారు. ఆయన తప్ప, ఆఫీసులో వాళ్ళెవరూ నాయందు మంచితనం చూపించలేదు. నిజంగా అక్కా! ఆయనా నేనూ స్నేహంగా వున్నామని ఆఫీసులో వాళ్ళంతా ఓర్చలేకుండా వున్నారు నిజం.కదూ మిస్టర్ రావ్?"

"అవును. మనిద్దరిమధ్యా ఎలాగైనా కలతలు పెట్టాలని చాలామంది ప్రయత్నించారు. నా గురించి ఎంతో చెడ్డగా ఆమెతో చెప్పారు. ఆమె చాలా గర్వం కలదిఅనీ, ఎవర్నీ లెక్కచెయ్యదనీ నాతో చెప్పారు. కాని మిస్ సుధంత మంచి వ్యక్తిని నేనెక్కడా చూడలేదు. మీ యెదుట పొగడ్డంకాదుగానీ. ."

"నో! నో! మిస్టర్ రావు. మీది చాలా ఉదార హృదయం....."

"ఎంతమాత్రంకాదు. మిస్ సుధా, మీది చాలా సరళ స్వభావం . ."

"మీరు అనాలని అంటున్నారు మిస్టర్ రావు. మీ అంత మంచివారిని నేనింతవరకూ చూడలేదు."

"అబ్బే మీ తెలివి తేటలు ముందు నా మంచితనం ఏమూల. నిజంగా మీ....."

"ఆగండి. మీరు చదివినన్ని పుస్తకాలు నే చదవలేదు."

(శేషగిరి ఎన్ని పుస్తకాలు చదివాడో శ్రీహరికి తెలుసు శ్రీహరి చెప్పిన పుస్తకాలూ, వాటిలో కొటేషన్సూ శేషగిరి జ్ఞాపకం వుంచుకొని సుధ ముందు అన్నీ తను స్వంతంగా చదివినట్టు వాగేశేవాడు. సుధ, శేషగిరే అవన్నీ చదివాడనుకొంది)

"మీలో వున్నన్ని మంచి గుణాలు నాలో లేవు" అని శేషగిరి దీనంగా అన్నాడు.

వీళ్లిద్దరూ ఒకరి నొకరు పొగడుకోవడం ఎంతవరకూ వెళ్తుందోనని శ్రీహరి "మీరియిద్దరూ మంచివాళ్ళే. కాస్సేపు నిదానంగా కూచొని మీ బంధాన్ని దృఢతరం చేసుకోండి. నేనూ మిస్ సుజాతా అలా గార్డెన్‌లోకివెళ్ళి కొన్ని చెట్లనెలా పెంచడమో చర్చించి వస్తాము" అని లేచాడు సుజాత కూడా శ్రీహరి వెనక్కాల వెళ్తూ.

"సుధీ! ఆయన మన అతిథి సుమా. అనవసరంగా దెబ్బలాడకు" అంది.

శ్రీహరీ, సుజాతా తోటలోకి వెళ్ళగానే సుధ శేషగిరివైపు తిరిగి "మిస్టర్ రావ్ నువ్వు ఇవాళ నా పుట్టిన రోజు పార్టీకి రావడం నాకెంతో సంతోషంగా వుంది" అంది.

శేషగిరి కూడా ఆమాటే అందామనుకుంటున్నాడు అదొక్కటే కాకుండా ఇంకా చాలా విషయాలు మాట్లాడుదామనుకుంటున్నాడు కాని ఏం మాట్లాడడమో అతనికి తోచడంలేదు. శ్రీహరి కూడావుంటే బాగుండుననుకొన్నాడు. సరిగ్గా ఈ సమయంలో ఏం మాట్లాడాలో ఎలా మొదలెట్టాలో తెలియక అవస్థ పడుతున్నాడు. ఆలోచించి, ఆలోచించి అతి కష్టంమీద "టీ చాలా బాగుంది" అన్నాడు.

"అయ్యో! మర్చిపోయాను. ఇంకొంచెం పోస్తానుండు" అని సుధ కెటిల్‌లోని టీ కొంత శేషగిరి, కప్పులో పోసింది. శేషగిరి తన కిష్టంలేకపోయినా, ఆ టీ కూడా తాగేశాడు సుధ,శేషగిరివైపే చూస్తోంది.

"మిస్టర్ రావు నువ్వివాళ ఎలాగో వున్నావు."

శేషగిరికి ఈ మాట తను ఎదురు చూస్తున్న అవకాశమిచ్చినట్లయింది తన మనస్సులో వున్నదంతా చెప్పదల్చుకున్నాడు. "మిస్ సుధా! నా మనస్సులో సీమీద. .." అని మొదలు పెట్టిన శేషగిరికి సరిగ్గా ఆ సమయానికి వెనకనుంచి.

"వెరీ సారీ. త్వరగా రావాలనుకున్నానుగాని రాలేకపోయాను. మీ పుట్టినరోజున నా అభివందనాల్ని స్వీకరించండి" అంటూ చేతిలో ఒక పొట్లంతో ప్రవేశించిన సత్యం మాటలు విన్పించాయి

శేషగిరిలోని ఉత్సాహమంతా కన్నంపడిన బెలూన్‌లో గాలిలా ఎగిరిపోయింది. మిస్ సుధ, సత్యాన్ని ఆహ్వానించి అతనికి టీ, స్వీట్సూ ఇచ్చింది. అదే సమయానికి శ్రీహరి కూడా గార్డెన్‌లోంచి వచ్చేశాడు.

శ్రీహరి వస్తూనే శేషగిరి మొహంవేపు చూశాడు. శేషగిరి మొహంలో కొసినా ఉత్సాహం లేదని గ్రహించాడు. సత్యం, సుధతో ఏదో మాట్లాడుతున్నాడు. శేషగిరి, శ్రీహరివైపు జాలిగా చూశాడు.

ఇంతలో సుజాత కొన్ని పుస్తకాలు పట్టుకొని వచ్చి శ్రీహరితో "మా యూనివర్సిటీ నిర్ణయించిన పుస్తకాలివి" అని వాటిని అతని చేతికిస్తూ, సుధతో "సుధీ మిస్టర్ హరి నాకు స్టడీస్‌లో హెల్పు చేస్తామన్నారు" అంది.

సత్యం "అవును వాడు ఎం. ఏ. ఫస్టు క్లాసుతో పాసయ్యాడు. ఐ. ఎ. యస్.కు కట్టమంటున్నాను" అన్నాడు

శ్రీహరి పుస్తకాల గురించి సుజాతతో మాట్లాడుతుండగా, లోపల్నించి శంకర్‌వచ్చి తను వెళ్తున్నానని అందరితో చెప్పాడు.

శంకర్‌తో మరాఠీలో మాట్లాడుతూ సుధ అతన్ని సాగనంపి రావడానికి వెళ్లింది. శ్రీహరి సుజాతని "అతను మీకేమైనా బంధువా?" అని అడిగాడు. శేషగిరీ, సత్యం కూడా ఆమె వైపు ప్రశ్నార్థకంగా చూశారు.


"కొద్ది రోజుల్లోనే మా బంధువు అవుతాడు. అంటే మా చెల్లెలి కాబోయే భర్త" అంది.

శ్రీహరీ, శేషగిరీ షాక్ తిన్నట్లు ఫీలయ్యారు. శ్రీహరి, శేషగిరికోసం చాలా విచారించాడు. సుజాతను వివరాలు అడుగుదామనుకున్నాడు గాని, అంతలో శంకర్‌ను సాగనంపి సుధ తిరిగి రావడంవల్ల అడగలేకపోయాడు. శేషగిరి పాతాళానికి క్రుంగిపోయాడు. ఇంతవరకూ తనదే అనుకున్న సుధ, తనతో ఏనాడూ సూచనగానైనా అనకుండా, ఇంకొకరి సొత్తైపోతోందని విపరీతమైన ఆశాభంగాన్ని పొందాడు. శ్రీహరి ఇంక ఎక్కువసేపు తా మక్కడవుంటే శేషగిరి మరీ బాధ పడతాడని, సుధతోనూ, సుజాతతోనూ చెప్పి తనూ, సత్యం, శేషగిరీ ఇంటికి బయల్దేరారు.

దారిలో శ్రీహరీ, సత్యం, సుధ మంచితనం గురించి, మహరాష్ట్రుల ఆచార వ్యవహారాలగురించి అనేక మాటలు మాట్లాడారుగాని శేషగిరి ఏమీ మాట్లాడలేదు. దెబ్బ తిన్న పక్షిలా, ఒంటరిగా తన ఆవేదన ననుభవిస్తున్నాడు.

శ్రీహరికేమైనా సానుభూతి మాటలు చెప్పాలనుందిగాని, ఏమైనా అంటే సత్యం ఈ విషయం తెలుసుకుంటాడేమోనని జంకాడు. సత్యానికీ విషయం పొత్తిగా తెలియదు కాబట్టి, శేషగిరి సంగతే అతను పట్టించుకోలేదు

లాడ్జికి వెళ్ళిన తరువాత ముగ్గురూ ఆకలిగా లేదని భోజనాలు చెయ్యకుండా పడుకున్నారు.



సత్యం పగలంతా కష్టపడి పని చెయ్యడంవల్ల వెంటనే నిద్రపోయాడు. శ్రీహరికి నిద్ర పట్టలేదు ఇంతకాలం సుముఖంగా వుందనుకున్న శేషగిరి ప్రణయ వ్యవహారం ఇలా విషాదాంతమైందేమా! అని ఆలోచిస్తూ ఒక అరగంట గడిచాక, శేషగిరి ఏం చేస్తున్నాడో అని అతని పక్కవేపు చూశాడు. శేషగిరి ప్రక్కమీదలేడు.

శ్రీహరిలేచి వరండాలోకి వెళ్ళాడు. శేషగిరి సిగరెట్టు కాలుస్తూ వరండాలో కూచున్నాడు. శ్రీహరి దగ్గరకువచ్చినా మాట్లాడలేదు, శ్రీహరి.

"ఒరేయ్! నువ్వు అనవసరంగా మనసు పాడు చేసుకోకు. అన్నీ మనం అనుకున్నట్లే జరిగితే మనం దేవుడితో సమానమైపోదుం. ఏదో ఆమె నీలో కొంత ఆశను రెచ్చగొట్టింది. నువ్వు మన స్ఫూర్తిగా ప్రేమించావు. నీ తప్పేమీలేదు. ఇక ఆమెను మర్చిపో" అన్నాడు.

"నా బాధ నీకు తెలియదు అన్నయ్యా. నన్నిలా వదిలెయ్"

"నాకెందుకు తెలియదురా! కాని ఇప్పుడెంత ఆలోచించినా ప్రయోజనమేముంది. అనవసరంగా నువ్వు బాధపడడం తప్ప"

"ఇంత మోసం చేస్తుందనుకోలేదురా! ఆఖరి క్షణందాకా అభిమానం చూపిస్తూనేవుంది. సత్యం అన్నయ్య లేకపోతే అక్కడే నాలుగూ అడిగేద్దును. ఎన్ని మాటలు చెప్పింది! ఎంత ప్రేమ చూపింది! ఇవన్నీ అబద్ధాలనీ, నన్ను వట్టి 'ఫూల్'నిచేసి ఆడించిందనీ, ఇప్పుడు తెలుస్తోంది. ఛీ! ఈ ఆడవాళ్ళని నమ్మకూడదురా"

"నేను కూడా చివరివరకూ నిన్ను ప్రేమిస్తోందనే అనుకున్నానురా. మన తెనుగమ్మాయి అయితే ఇంత నటన చెయ్యగలిగివుండేదికాదు. మహారాష్ట్రుల లక్షణమే ఇది కాబోలు!"

"ఒరేయ్! నేను ఇంక ఆమెతో మాట్లాడదల్చుకోలేదు. ఆమె మొఖం కూడా చూడను. వీలైతే ఈ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేస్తాను లేకపోతే నాకు ట్రాన్స్‌ఫరు చేయించమని 'డైరెక్టర్ని' అడుగుతాను.

"శేషగిరీ—చూడు! ఒక స్త్రీ అందులోనా—మన జాతికాదు. మన బంధువుకాదు నిన్ను మోసం చేసిందని, నీ భవిష్యత్తు నువ్వు పాడుచేసుకోకు. ఆమెను లెక్క చెయ్యవద్దు. జరిగినదంతా పీడకల అనుకోరా! పోయి పడుకుందాం"

శ్రీహరి ఎంత చెప్పినా శేషగిరి పడుకోలేదు. కొంతసేపయ్యాక శ్రీహరి వెళ్ళి పడుకున్నాడుగాని, శేషగిరి ఆలోచిస్తూ, సిగరెట్లు కాలుస్తూ రాత్రంతా మేలుకొనే వున్నాడు అతనికి నిద్ర రాలేదు.

ప్రొద్దున్న కాఫీ త్రాగుతూ సత్యం, శేషగిరిని "అలా వున్నావేంరా? జ్వరమొచ్చిందా?" అని అడిగాడు. శేషగిరి "అబ్బే! ఏంలేదు కొంచెం వంట్లో బాగుండలేదు. ఇవాళ ఆఫీసు మానేస్తాను" అన్నాడు.

సత్యం, శేషగిరివంటిమీద చెయ్యివేసి "ఫీవరుందిరా. థర్మామీటరు పెట్టుకుని చూడు" అని తను దగ్గరుండి థర్మామీటరు చూశాడు. శేషగిరికి బాగా జ్వరం వచ్చేసింది. నూట నాలుగు డిగ్రీలుంది. సత్యం డాక్టర్ని తీసుకొస్తానన్నాడు. శేషగిరి

ప్రణయావేశం

తగ్గుతుందన్నాడు.

శ్రీహరిని, శేషగిరిని చూస్తూ వుండమని, సత్యం ఆఫీసుకు వెళ్ళిపోయాడు. శ్రీహరి శేషగిరికి ఎంతో బోధించాడు. అన్నిటికీ శేషగిరి "సుధ నన్ను మోసం చేసిందిరా" అనడం తప్ప మరేమీ జవాబిచ్చేవాడు కాదు.

శేషగిరి ఆఫీసుకు సెలవు చీటీ పంపాడు. సుధకి శేషగిరికి వంట్లో బాగులేక ఆఫీసుకు రాలేదని తెలిసింది. సాయంకాలమేవచ్చి చూద్దామనుకొంది. సత్యాన్ని అడిగింది. "రావుకి ఎలా వుంది?" అని. సత్యం జ్వరంవచ్చిందని చెప్పాడు. సాయంకాలం ఎంత ప్రయత్నించినా, ఆమె పని తెమలలేదు. ఆమె ఆఫీసునుంచి బయల్దేరేటప్పటికి రాత్రి ఎనిమిది గంటలయింది. అందుకని తిన్నగా తన ఇంటికి వెళ్ళిపోయింది.

సత్యం సాయంకాలం ఆఫీసునుంచి వస్తూ డాక్టర్ని తీసుకువచ్చాడు. శేషగిరికి ప్రొద్దుటినుంచీ జ్వరం అలాగేవుంది. డాక్టరు పరీక్షచేసి 'ఏమీ జబ్బు లేదు అనీ, బహుశా ఎక్కువగా ఆఫీసు వర్కు చెయ్యడంవల్ల వచ్చివుంటుందనీ చెప్పి బాగా విశ్రాంతి తీసుకోమనీచెప్పి, మందు రాసిచ్చి వెళ్ళిపోయాడు.

శేషగిరి మూసిన కన్ను తెరవకుండా పడుకొన్నాడు సత్యం, శ్రీహరి అతనిపక్క దగ్గర కూర్చొని గంట గంటకీ టెంపరేచరు చూస్తూ రాత్రంతా గడిపారు. శేషగిరి జ్వర తీవ్రతలో "సుధా! నన్ను మోసం చేశావు!" అని పలవరించడం సత్యం విన్నాడు. సత్యానికి అనుమానంవేసి శ్రీహరిని అడిగాడు శేషగిరీ, సుధా దెబ్బలాడుకున్నారా? అని.

శ్రీహరి జరిగినదంతా సత్యంతో చెప్పేశాడు. సత్యం ఆలోచించి "సుధ అలా మోసం చెయ్యదే? ఇందులో ఎక్కడో పొరపాటుంది. రేపు నేను కనుక్కుంటాలే" అన్నాడు.

మర్నాడు ప్రొద్దున్నే సుధ వాళ్ళ లాడ్జికి వచ్చింది. సత్యం ఆమెను ఆహ్వానించి, శేషగిరికి ఒంట్లో బాగులేదని, రాత్రంతా ఎక్కువ జ్వరం కాచిందని చెప్పాడు. సుధ, శేషగిరినివెళ్ళి చూస్తానంది. సత్యం కొంచెంసేపు ఆగమనీ, తను సుధతో మాట్లాడ దల్చుకున్నానని చెప్పాడు. ప్రక్కగదిలో శేషగిరివద్ద కూర్చున్న శ్రీహరివచ్చి సుధను పలకరించాడు. సుధకు సత్యం మాటలు అర్థం కాలేదు. తను రావును చూద్దామని ఎంతో ఆశతోవస్తే సత్యం తనతో మాట్లాడతాననడం ఆమెకు ఆశ్చర్యం కలిగించింది.

"మిస్ సుధా, నా తమ్ముడు మీ యెడల చాలా అభిమానంతో వున్నాడని మీకు తెలుసు. మీరు కూడా అతని యెడల చాలా స్నేహభావంతో వున్నారు నా తమ్ముడు చాలా అమాయకుడు. మీకు ఇంతకు ముందే వివాహం నిశ్చయమైందని తెలియక....'

"నాకా? వివాహమా?"

"అవును. మీకే మిస్టర్ శంకర్‌తో నిశ్చయమైందని....."

వరుడు."

శ్రీహరీ సత్యం ఒకరి మొహం ఒకరు చూచుకొన్నారు. శ్రీహరి "మరి నిన్న మిస్ సుజాత అలా చెప్పిందే?"

"ఏమని"

"శంకర్ మీ కాబోయే భర్త అని."

"పొరపాటు. ఆమె చెప్పడంలోనైనా పొరపడి వుండాలి. మీరు వినడంలోనైనా పొరపాటుగా విని వుంటారు."

"లేదు. ఆమెను మేము శంకర్ ఎవరని అడిగితే మా చెల్లెలికి కాబోయే భర్త అని చెప్పిందే?"

"అవును. నా తరువాతి చెల్లెలు కుసుమ్ బొంబాయిలో చిత్రలేఖనం అభ్యసిస్తోంది. ఆమె శంకర్ ప్రేమించుకున్నారు."

శ్రీహరి ఆశ్చర్యపోయాడు. సత్యం చిరునవ్వు నవ్వి "మిస్ సుధా! మీరు మమ్మల్ని క్షమించాలి. శేషగిరి మీమీద అనవసరంగా అపోహపడి జ్వరం తెచ్చుకున్నాడు" అని జరిగినదంతా సుధకు చెప్తుంటే శ్రీహరివెళ్ళి శేషగిరితో ఈ సంగతి చెప్పేశాడు. శేషగిరి వెంటనేలేచివచ్చి "మిస్ సుధా! నిజంగానా? శంకర్‌కీ నీకూ ఏవీ సంబంధంలేదా? చెప్పు సుధా! చెప్పు!" అని అడిగాడు.

"మిస్టర్ రావు నిజంగానే చెప్తున్నాను శంకర్ కుసుమ్‌కి కాబోయే భర్త. నువ్వు నాకోసం ఇంత దిగులు......"

"చాలు. నాకింకేమీ చెప్పొద్దు. నిన్ను అనవసరంగా అనుమానించినందుకు క్షమించు."

"అసలు తప్పంతా నాదే మిస్టర్ రావు. ముందే మీకీవిషయం...."

"నో! నో! తప్పునాది నీలాంటిదేవతని శంకించాను."

"కాదు. తప్పు నాదే నీకు చాలా బాధకలిగించాను."

"ఎంతమాత్రమూకాదు. నిన్ననవసరంగా అపార్థం చేసుకున్నాను"

"అబ్బే! నా తప్పుకు నేను నన్నెప్పటికీ క్షమించలేను."

"నువ్వు అమృతమూర్తివి."

"నువ్వు మహాత్యాగివి."

సత్యం "ఇద్దరూ ఆగండి. శేషగిరీ నువ్వు ఇక ఎంతమాత్రం ఆలస్యం చెయ్యకుండా ఆమె అభిప్రాయం కనుక్కుంటే తక్కిన ఏర్పాట్లు నే చేస్తాను. శ్రీహరీ పదరా అలా వెళ్ళొద్దాం" అని, సత్యం, శ్రీహరీ మేడదిగి క్రిందికి వెళ్ళారు.

శేషగిరి "సుధని "మా అన్నయ్య ఏమన్నాడో విన్నావా?" అని అడిగాడు.

సుధ నవ్వి "ఏమిటది?" అంది అమాయకంగా మొహంపెట్టి.

"నీ అభిప్రాయం కనుక్కోమన్నాడు."

"దేని గురించి?"

"మన వివాహం గురించి"

"నాకేం తెలియదు" అని ఆ గదిలోంచి బయటకు వెళ్ళిపోతూ, "నేను కూడా ఇవాళ సెలవు పెట్టదల్చుకున్నాను. కాస్సేపటిలోవచ్చి, మీ జ్వరం సంగతేమిటో కనుక్కుంటాను. అంతవరకూ విశ్రాంతి తీసుకోండి" అని చెప్తూ మెట్లుదిగి వెళ్ళిపోయింది.



వనితా వాణి

ఆడవారు - ఐకమత్యం

19—4—61 తేదీ పత్రికలో జయశ్రీ గారు వ్రాసిన "ఆడవారు ఐకమత్యం" వ్యాసం నాకు చాలా నచ్చింది. జయశ్రీగారు వ్రాసినట్లే మగవారికి ఉన్న ఐకమత్యం ఆడవారికిలేదు. వారితో నేను ఏకీభవిస్తున్నాను. రచయిత్రికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు.

—కె. అమృతవల్లి, (చీరాల)

*　　*　　*

వనితాలోకం శీర్షికలో జయశ్రీగారు వ్రాసిన "ఆడవారు—ఐకమత్యం"లో ఆడవారి అసమర్థతను చక్కగా నిరూపించారు. నిజం చెప్పాలంటే ఇద్దరు ఆడవాళ్లు పొత్తుగా ఎంతో కాలం వుండలేరు. వారు వ్రాసినట్లు ఐకమత్యం విషయంలో మనం పురుషులముందు సిగ్గుతో తలవంచవలసిందే. వారు సూచించినట్లు ఐకమత్యముగా ఉండాలంటే అసూయ, ఈర్ష్య మొదలగు దుర్గుణములు మన స్త్రీ జాతిలో నశించాలి. అప్పుడే మనజాతి పురుషజాతికి సమానం కాగలదు. ఇటువంటి చక్కని వ్యాసము వ్రాసినందుకు జయశ్రీగారికి నా ధన్యవాదములు.

—జి. నారాయణి (మదరాసు—2)

*　　*　　*

ఆంధ్ర సచిత్ర వార పత్రికలో జయశ్రీగారు వ్రాసిన "ఆడువారు—ఐకమత్యము" అన్న వ్యాసము చాలా బావుంది. మనము ఐకమత్యముగా లేనిదే ఏపనీ చేయలేము. ఆడువారిలో ఐకమత్యముతోపాటు ఓర్పు, సహనము అన్నీ ఉండాలి. సాధారణంగా ఆడువారిలో ఈర్ష్య ఎక్కువగా ఉంటుంది. ఎంతసేపు ఒకళ్ళని చూసి అసూయ పడటము, వాళ్ళని గురించి వీళ్ళని గురించి ఆడిపోసుకోవటము ఎక్కువ. ఈర్ష్య ముందరపుట్టి, వీళ్ళు (ఆడువారు) తరువాత పుట్టారేమో అని పిస్తుంది.

—కోటంరాజు లీల, (విజయవాడ)

*　　*　　*

ప్రేమా - పెళ్లి

19—4—61 తేదీ పత్రికలో శ్రీమతి కనకదుర్గ వ్రాసిన "ప్రేమా—పెళ్ళి" వ్యాసము చాలా బాగుంది.

"ఏ స్త్రీ అయినా, అధికారం ఉందిగదా అని భర్త అలుసు తీసుకొని, శృతిమించి ప్రవర్తించకూడదు." "అణకువగా వుంది గదా అని అణగద్రొక్కకుండా మగవాడు వుండాలి."

నిజంగా ఈ రెండు వాక్యాలు, వీరి వ్యాసములోని సుభాషితాలు. ఆలు మగలు ఆ సుభాషితుల్ని అమలు జరిపితే వారి జీవితములు స్వర్గతుల్యములే. రచయిత్రికి నా వందనములు.

—సువర్ణ కృష్ణ, (విజయవాడ)

*　　*　　*

19—4—61 ఆంధ్ర సచిత్ర వార పత్రికలో పి. కనకదుర్గగారు రాసిన ప్రేమ — పెళ్ళి, అనే వ్యాసం చదివేను. నిజంగానే కనకదుర్గగారు వ్రాసిన దానికి నేడు సమాజంలో జరిగే దానికి ఏమి తేడాలేదు. పురుషులకన్నా స్త్రీలకే గర్వం ఎక్కువ. చదువుకోని స్త్రీలను హేళన చేయటం తప్ప గౌరవించటంచేతకాదు. కనకదుర్గగారు స్త్రీలకు, పురుషులకు కూడా పనికి వచ్చేటట్లు వ్యాసం రాసినందుకు నేను వారిని చాలా అభినందిస్తున్నాను.

—బేబీ సరోజ, (భట్టిప్రోలు)

*　　*　　*

స్త్రీలకు వ్యసనాలు లేవా!

12—4—61 తేదీ ఆంధ్ర సచిత్ర వార పత్రికలో కె. లీలాశంకర్‌గారు వ్రాసిన వ్యాసము "మగవారి వ్యసనాలు : మగువల పాట్లు" యదార్థమును చిత్రీకరించునట్లుగా ఉన్నది. కాని ఒక విషయమును మనము ఆలోచించవలయును. "మంచి—చెడూ" అనేవి మగవారిలోనే గాక, మగువలలో కూడ ఉంటవనే విషయమును మనము మరువరాదు. సమాజములో చెడు అనేది తీసివేయువలెనన్న పురుషునితోపాటు స్త్రీ కూడా పాటుపడవలెను. కుటుంబములో స్త్రీని హింసించే మగవాళ్ళు, మగవాళ్ళని బాధపెట్టే స్త్రీలు లేకపోలేదు. మమకారాలు మగవారికేగాక మగువలకు కూడ ఉంటవి. మగవారిలో జూదము సిగరెట్లు కాల్చడం వ్యసనాలు. స్త్రీలలో ఆడంబరము, ఐశ్వర్యమును కోరుకొనుట అనేవి కూడ వ్యసనాలుగానే భావించవలసి వస్తుంది.

—అయ్యదేవర జయలక్ష్మి (మద్రాసు—14)

*　　*　　*

12—4—61 ఆంధ్ర సచిత్ర వార పత్రికలో కె. లీలాశంకర్‌గారు వ్రాసిన 'మగవారి వ్యసనాలు : మగువల పాట్లు' అను వ్యాసం చాల బాగున్నది. రచయిత్రి చెప్పినట్లు మధ్యతరగతి కుటుంబీకులలో ఈ వ్యసనాలు ఎక్కువగా కనిపించుచున్నవి. అసలే ఈ రోజులలో తినడానికి తిండి లేకపోయినా మీసాలకి సంపెంగ నూనె అన్నట్లు ఈమధ్య తరగతి కుటుంబీకులు త్రాగుడు, జూదం మొదలగు వ్యసనాలకులోనై ఇంటిపరిస్థితి పట్టించుకొనరు. ఇటువంటి మనుష్యుల్ని ఈ రోజులలో చాలా మందిని చూస్తున్నాం. కె. లీలాశంకర్‌గారి వ్యాసంవలన కొందరి మనస్సైనా మారుతుందని తలుస్తాను.

—కె. యశోద (అమలాపురం)

పేరు చెబితే తప్పా!

19—4—61 తేదీ పత్రికలో శ్రీమతి ప్రభంజనరావుగారు వ్రాసిన ఉత్తరంలో పేరు చెబితే తప్పా? అని అడిగినారు. తమ భర్తపేరు తమ్ముడికో అన్నయ్యకో ఉంటే వరసప్రకారం పిలుస్తారుకాని పేరుపెట్టి సాధారణంగా పిలవరు. తగినంత అవసరం ఉంటేగాని చెప్పరు భర్తపేరు. చెబితే భర్తకి ఆయుక్షీణమని పెద్దలు చెప్పుదురు. ఇలాటప్పుడు శ్రీమతి ప్రభంజనరావుగారు ఈ విషయం వ్రాయటం విచారకరం.

—వి. సావిత్రి (హైదరాబాద్)

★

అజ్ఞానము

ఒక పల్లెటూరి ఆసామి ధనవంతుల అబ్బాయితో "అయ్యా ఈ గణారెము (గడియారము) ఎంత" అని అడిగాడు.

ధ. అ:-రెండువందలు.

ప. ఆ:-మరి బాబూ దాన్నిదేంతో చేయించారు? బంగారమా? వెండా?

ధ. అ:-బంగారమూ కాదు. వెండీకాదు.

ప. ఆ:-"ఐతే దాన్నెందుకు చేయించినట్టు? దానికంత ఖరీదెందుకు!" అర్థంకాక బుర్ర గోక్కోసాగాడు.

—ఎ. రామయ్య (ఊటీగల్.)

మామయ్యో! లెక్క రావటంలేదు.

రాము అనే బండ కుఱ్ఱాడు ఒకడున్నాడు. రాము సెకండు ఫారంలో చేరాలని ప్రయత్నం. అందుకని పట్నం వెళ్ళి వాళ్ళ మావయ్య (ప్రయివేటు టీచరు) దగ్గిర మూడు సంవత్సరాలు ప్రయివేటు చదివాడు. ఏ లెక్కన్నా అన్సరు రాకపోతే "మావయ్యా ఈ లెక్క రావడం లేదు" అని అడిగేవాడు. రాము ఆ లెక్క చేసేదాకా వాళ్ళ మావయ్య చితకబాదేవాడు. ఆ దెబ్బలు పడలేక "అత్తయ్యో" అని గోలపెట్టి ఏడ్చేవాడు. ఆవిడ వచ్చి కొట్టకుండా చేసేది. ఎలా ఐతేనేమి రాము రెండవఫారంలో చేరాడు

ఆవాళ మొదటి రోజు. లెక్కల మాష్టారు వచ్చి ఒక లెక్క చెయ్యమని చెప్పారు. ఆ క్లాసులో లెక్కల మాష్టారి అమ్మాయి కూడా చదువుతుంది. మన రాముకి లెక్క ఎన్నిసార్లు చేసినా అన్సరు రాలేదు. చికాకుగా పరాకులో "మావయ్యా లెక్కరావడం లేదు" అని బిగ్గరగా అన్నాడు. క్లాసంతా గొల్లుమన్నారు. లెక్కల మేష్టారికి కోపం వచ్చి పేకబెత్తంతో చితకబాదడం మొదలుపెట్టాడు. మళ్ళా రాము అలవాటులో పొరపాటున "అత్తయ్యో" అని అరిచాడు. మళ్ళా పిల్లలంతా గొల్లుమన్నారు!

టి. వి. సూర్యనారాయణరెడ్డి
(పెనుగొండ)

యుక్తి!

(43 వ పేజీ తరువాయి)

వాళ్లు ఒక్కొక్కరే అక్కడినుంచి జారుకుంటున్నారు.

ఇదేమీ అర్థంకాలేదు మంత్రిగారికి. తాంబూలం వేసుకుందామని భటునివేపు తిరిగాడు. రత్నాల హారం కంటబడింది. విషయం తెలిసింది. ఆలసిస్తే అవమానం తప్పదు. రాయలకీర్తి మంటగలిసిపోతుంది!"

వెంటనే నోట్లోని తాంబూలాన్ని ఆ భటునిమీద ఊసి "ఛీ.....! చెండాలుడా! సున్నం ఇంత పెట్టొద్దంటే విన్నావు గావు. ఇపుడు నా నోరు పొక్కిపోయింది. పాపిష్టివాడా!" అంటూ కాల్లోని చెప్పు తీసి నాలుగు బాది పారిపొమ్మనట్లు సైగచేశాడు.

ఇంకేముంది! ఆ భటుడు తట్టతో సహా పరుగు లకించుకున్నాడు. తిమ్మరుసు అప్పటికి వాణ్ణివదలక చేతిలో చెప్పు పట్టుకుని నోటికొచ్చిందల్లా తిడుతూ, మాటిమాటికీ నాలుక పీక్కుంటూ వాణ్ణి వెంబడించాడు.

ఈ విడ్డూరం చూచిన కొందరు అబ్బో! ఈ ముసలాయనకి ఎంత కోపం! సున్న మెక్కువైందని ఆలా బాదటమా"! అని నోళ్లు నొక్కుకున్నారు.

ఎలాగైతేనేం! తిమ్మరుసు ఆ భటుని రాయల గుడారందాకా తరుముకొచ్చాడు. పాపం, ఆ భటుడు చాలా అలసిపోయినాడు.

"ఏమిటీ! మంత్రివర్యా! నన్నెందుకు చెప్పుతో బాది తరుముకొచ్చినట్టు?" అన్నారు రాయలు భటుని వేషాన్ని తీసేస్తూ.

"క్షమించాలి ప్రభూ! మీరు మీ వేషాన్ని పూర్తిగా మార్చేశారే గాని తమ మెడలోని రత్నాల హారాన్ని అలాగే ఉంచారు. ఈ హారాన్ని చూచే గజపతికూతురు మిమ్మల్నిగుర్తుపట్టి, తన చెలికత్తెలతో చెప్పి మనల్నిద్దర్నీ అవమానపరచాలని ప్రయత్నించింది. అటువంటి స్థితిలో మీ కీర్తికి కళంకం రాకుండా చూడటం అంటే దీనికిమించిన ఉపాయం వేరొకటి వుండదని నా అభిప్రాయం. దాన్నే నేనూ చేశాను. ప్రభువులు క్షమించాలి" అన్నాడు తిమ్మరుసు.

రాయలు తిమ్మరుసు సమయస్ఫూర్తికి చాల మెచ్చుకుని అతన్ని అమితంగా గౌరవించాడు.

దైవ పరీక్ష

(41 వ పేజీ తరువాయి)

ఇంద్రుడు ప్రత్యక్షమై, రాజా! నేనే దారిలో నీ హారాన్ని తీసుకున్నవాణ్ణి...నీ దానశీలత పరీక్షించమని దేవతలంతా పంపగా నేను నిన్ను పరీక్షించాను. నీవు నిజంగా రెండవ దానకర్ణుడవని పిలవటానికి అర్హుడవు! ...నీ కోశాగారం ఎల్లప్పుడూ బంగారంతో నిండి వుంటుంది! ఎంత తీసినా తరగదు!... దాంతో నువ్వు నీ దానశీలతా నదిని నిత్యమూ పారనియ్యి! నీ కీర్తి ఆచంద్రతారార్కంగా భూలోకంలో నిలుస్తుంది!!...అని వరమిచ్చాడు.

ధర్మసత్తునికి ఆనందబాష్పాలు రాలాయ్! అతనికి సాష్టాంగ నమస్కారం చేసి బ్రహ్మానందం పొందాడు. ★



జూల్స్ వెర్న్ నవల

౮౦ రోజులలో భూప్రదక్షిణం

షాంగ్హై సమీపంలో ఫాగ్ ప్రయాణం ఏమయి వుంటుందో వూహించడం కష్టంకాదు. టాంకడియర్ చేసిన సైగలను యోకహామా స్టీమర్ చూసింది. ఆపదలో ఉన్నదని సహాయం చేయడానికి దగ్గరకు వచ్చింది. ఫిలియస్ ఫాగ్ విషయం వివరించి శాన్‌ఫ్రాన్సిస్కోకు ఈకేవు మాట్లాడుకుని, ఆ ఓడ మీదికి ఎక్కాడు—అయుదా, ఫిక్సులు సహా. ఎక్కే ముందు పైలట్ జాన్‌బన్సీచి జేబులో ఐదు వందల యాభై పౌండ్లు పెట్టాడు. స్టీమరు వెంటనేనాగసాకి, యోకహామాలకు బయల్దేరింది. నవంబరు 14 న ఓడ యోకహామాలో ఆగగానే, ఫిక్సుని పనులేవేనాఉంటే చూసుకోవలసిందని పంపించి ఫాగ్ తిన్నగా 'కర్నాటిక్'' స్టీమరు దగ్గిరకు వెళ్ళి పాస్పార్టు గురించి వాకబు చేశాడు. పాస్పార్టు ఆ ఓడ మీద వచ్చాడని, క్రితం రోజునే దిగి వూళ్లోకి వెళ్ళి పోయాడనీ తెలియగానే అయుదా సంతోషంతో ఉప్పొంగిపోయింది. ఫాగ్‌కూడా ఇంచుమించు అంత పనిచేసి ఉండవచ్చుగాని, ఆ ఆనందం తాలూకు ఛాయలాలు మొహంలో ఏ కోశానా కనబడనివ్వలేదు.

శాన్‌ఫ్రాన్సిస్కో స్టీమర్ తిరిగి సాయంకాలమే బయల్దేరుతుంది. ఇక ఆట్టే వ్యవధిలేదు. ఫిలియాస్ ఫాగ్ వెంటనే అయుదాను వెంటబెట్టుకుని యోకహామానగరంలోకి బయల్దేరాడు. పాస్పార్టును వెదకడానికి. ఇంగ్లీషు ఫ్రెంచి కాన్సల్ కార్యాలయంలో కనుక్కుంటే ఏమీ తెలియలేదు. వీధులవెంట ఎంత తిరిగినా ఏమీ లాభంలేకపోయింది. యదాలాపంగానే, పోతూ పోతూ బటల్కార్ ట్రూపు వారి సాము గరడీల శాలలో ప్రవేశించాడు. అక్కడ స్టేజిమీద పాస్పార్టును, ఫాగ్ చూడగానే గుర్తుపట్టగలిగే వాడనడానికి ఎంతమాత్రం సావకాశం లేదు. కాని వెల్లకిలా పడుకున్న పాస్పార్టు, బాల్కనీలో నిలబడ్డ ఫాగ్‌ను తలక్రిందులుగా చూసి కూడా ఇట్టే గుర్తుపట్టాడు. అదరిపాటులో ఆవేశంలో ఉత్సాహంలో కదలకుండా ఉండలేకపోయాడు. అక్కడితో ఆరడుగులపొడుగు కదిలిందిముక్కు. అక్కడితో దాని మిది జగన్నాధరథం కుప్పకూలిపోయింది. జరిగిన కథలో తానెరగని ఈభాగం అంతా పాస్పార్టు అయుదా చెప్పగా తెలుసుకున్నాడు. మాటల సందర్భంలో ఫిక్స్ సంగతి వచ్చినప్పుడు పాస్పార్టు తన కోపాన్ని, ఆవేశాన్ని బయడపడనివ్వలేదు. తనకీ, డిటెక్టివ్ ఫిక్స్‌కి మధ్య నడిచిన కథ యజమానికి తెలియడానికి ఇది అదనుకాదని, ఇపుడిపుడే చెప్పరాదని పాస్పార్టు

అనువాదం :

ఎస్. పార్థసారథి

నిశ్చయించుకున్నాడు. అందువల్ల తన వంతు, తను జరిపిన కథను చెప్పినప్పుడు ఎక్కడా ఫిక్స్ పేరెత్తకుండా, తప్పంతా తనమీదే వేసుకుని తాను తప్పతాగి నల్లమందుతో పొగతాగి ఒళ్ళు తెలియకపడిపోవడమే అంతటికీ కారణమని ఒప్పుకున్నట్లు చెప్పుకొచ్చాడు.

ఫిలియాస్‌ఫాగ్, ఈ కథ వింటున్నంతసేపూ చలనం లేకుండా మాట లేకుండా కూర్చున్నాడు. ఏమీ అడగలేదు. అడిగిన దానికి జవాబు చెప్పలేదు. కబుర్లు సంజాయిషీలు పూర్తి అయ్యాక, పాస్పార్టు కావలసిన బట్టలు ఓడమీదే కొనుక్కుందికి కొంత డబ్బు ఇచ్చాడు. ఒక గంట గడిచేసరికి, టెంగూ దేవుడి భక్తకోటి తాలూకు వేషం—ఆరడుగుల ముక్కు సహా వేషం తీసి పారేసి పాస్పార్టు, సాధారణ వేషధారణ ముగించాడు.

యోకహామానుంచి శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్తున్న ఆ స్టీమరు పేరు జనరల్ గ్రాంట్. అది పసిఫిక్ మెయిల్ స్టీమ్ షిప్ కంపెనీ వారిది. 2,500 టన్నుల నౌక. బ్రహ్మాండమైన పెద్ద చక్రాలు ఎడా పెడా అమర్చారు. అవికాక పూటుగా గాలి పోసుకు పోవడానికి సమగ్రంగా తెరచాపలు వేశారు. దానాదీనా జనరల్‌గ్రాంట్‌కు గంటకు 12 నాట్ల వేగంతో పోగల సత్తావుంది. అలా వెళ్తే పసిఫిక్ సముద్రం దాటడానికి 21 రోజులు చాలు. ఆ లెక్కన సాగితే ఇది డిసెంబరు 2 న శాన్‌ఫ్రాన్సిస్కో చేరాలి. అక్కడనించి 11వ తేదీకల్లా న్యూయార్కు వెళ్ళవచ్చు. 20 నాటికి లండన్ వెళ్ళి పడవచ్చు. అంటే తను చేరి తీరవలసిన ఉపద్రవపు రోజు 21 తేదీనాటికి కొన్ని గంటలు ముందరే అక్కడ ఉండవచ్చునన్నమాట.

ప్రయాణం కూడా సాఫీగా సాగింది. ఉప్పెనలూ ఉత్పాతాలూ విరుచుకుపడలేదు. ఓడ కూడా తూకం తప్పకుండా పసిఫిక్ సముద్రం, శాంత సముద్రం, అన్న బిరుదును సార్థకం చేసుకుమాట దక్కించుకుంది ఫాగ్ కూడా ఎప్పటిలాగే శాంతంగా, సముద్రుడిలా గంభీరంగా ఉన్నాడు. అతని సహయాత్రికురాలు అయుదాకు ఫాగ్‌పట్ల కృతజ్ఞత ఒకటేకాక, ఇతర విధాల చెప్పుకోతగిన సద్భావాలు కూడా కలగ సాగాయి. అతని మితభాషణ, ఔదార్యం, నిండుతనం ఇవన్నీ ఆమెను ముగ్ధురాలిని చేస్తూ వచ్చాయి. క్రమంగా ఆమె ఆమూగస్థితినుండి ఇవతలికి రావడం తేరుకోవడం తగ్గించివేసింది. ఆమెకు తెలియకుండానే ఆమెహృదయంలో మధురభావాలు పల్లవించాయి. మర మనిషి ఫాగ్‌తో హృదయాన్ని అవి స్పృశించాయో, లేదో అది కదలిందో లేదో అతనికి తప్ప అన్యులకు తెలియదు.

చూశారా?

ఒక క్రిమినల్ కేసులో సాక్షిని పరీక్షచేస్తూ మేజస్ట్రేట్ యిలా అన్నాడు:

"తుపాకీ కాల్చడం నీవు చూశావా?"

"లేదండీ — విన్నాను" అన్నాడు సాక్షి.

"ఈ సాక్ష్యం సంతృప్తికరంగా లేదు. క్రిందకుపోయి నిలబడు" అన్నాడు మేజిస్ట్రేటు.

సాక్షి బోనుదిగి మేజస్ట్రేటు వైపు వీపు త్రిప్పి నవ్వాడు. మేజస్ట్రేటు అతనిని తిరిగి బోనెక్కమని యిలా అన్నాడు.

"కోర్టులో నవ్వడానికి నీకు ధైర్యం ఎలా చాలింది?"

"నేను నవ్వగా మీరు చూశారా? అన్నాడు సాక్షి."

"లేదు, కాని విన్నాను" అన్నాడు కోపంగా మేజస్ట్రేటు.

"ఆ సాక్ష్యం అంత సంతృప్తికరంగా లేదండి" అన్నాడు సాక్షి.

దీనితో కోర్టులోనివారంతా నవ్వారు. మేజస్ట్రేటు కూడ నవ్వక తప్పింది కాదు.

కె. శ్రీదేవి.

* * *

తండ్రి-(కూతురుతో) పాపా ఒక సెకనులో నువ్వు మంచి అబద్ధం చెప్తే నీకు మంచి నెక్లెస్ కొనిపెడతాను.

కూతురు-(వెంటనే) అదే వింటె నాన్నా ఇంత క్రితమేగా చెప్పావు. రెండు నెక్లెసులు కొనిపెడతానని అప్పుడే మర్చిపోయావా?

పార్వతిరావు (దుర్గాపూర్)

80 రోజుల్లో భూ ప్రదక్షిణం

ఫిలియాస్‌ఫాగ్ యాత్ర సాగేతీరు, అది వెళ్ళే సాధనం—వీటిపట్ల అయుదా ఆసక్తి బాగా పెరిగి పోయింది. అడ్డంకులలాటివి వచ్చినప్పుడల్లా ఆమె ఎంతో కలతచెంది కంగారుపడిపోతోంది. వాటి గురించి ఆమె తరచు పాస్పార్తుతో మాట్లాడేది. పాస్పార్తు ఈ వరస కాస్త చూడగానే అసలు విషయం పసిగట్టేశాడు. అతనికీ యజమాని అంటే సంపూర్ణమైన విశ్వాసం కుదిరాయి. వాటికి తిరుగుండదు. యజమాని మంచితనాన్ని, పెద్ద మనిషి తరహాని, ఔదార్యాన్ని ఎంత పొగడినా అతనికి తనివి తీరదు. అయుదా భయ సందేహాలు వెలిబుచ్చినప్పుడల్లా పాస్పార్తు ఆమెకు ధైర్యం చెప్పేవాడు. ప్రయాణం మొత్తంమీద నిజంగా ప్రమాదకరమైన, అతి కష్టమైన భాగం అంతా గడచిపోయింది అనేవాడు. అదిగో మాయదారి దేశాలు చైనా, జపాన్‌లుదాటిపోవడంతోనే అవస్థలు గడిచిపోయాయి. ఇక నాగరిక ప్రపంచంలో వచ్చిపడుతున్నాం. ఇంకేం ఫరవాలేదు. శాన్‌ఫ్రాన్సిస్కోలో దిగగానే రైలెక్కి న్యూయార్కుపోవడం—అక్కడ ఓడఎక్కి అట్లాంటిక్ దాటేసి లివర్‌పూల్‌లో వాలిపడడం — అంతే దీనికి ఉన్న గడువుచాలు. వేళ తప్పకుండా తప్పక చేరిపోవచ్చు' అనేవాడు.

యోకహామానుండి తొమ్మిది రోజులు ప్రయాణం జరిగేసరికి ఫిలియాస్ ఫాగ్ ప్రయాణం సరిగ్గా భూగోళ ప్రదక్షిణంలో సగందూరం పూర్తి అయింది.

అక్షరాలా సగం అనడానికి తార్కాణం—నవంబరు 23 న 'జనరల్ గ్రాంట్' 180 వ దీర్ఘాంశం దాటడమే. సరిగ్గా ఆరేఖ మీదనే దక్షిణార్ధగోళం మీద, ఎదురువైపున లండన్‌వుంది. అయితే ఫాగ్‌కు ఉన్న కాల పరిమితి 80 రోజులలోనూ ఇప్పటికి 52 రోజులు ఖర్చు అయిపోయాయి. ఇక మిగిలినవి 28 మాత్రమే. కాని అక్షాంశాల లెక్క ప్రకారం ప్రయాణం చేసిన దూరం సరిగ్గా సగమే అనిపించినా నిజానికి అతను వచ్చిన దూరం రావలసిన దాంట్లో మూడింట రెండు వంతులు అని చెప్పుకోవాలి. ఎందుకంటే అతని యాత్రామార్గం, అక్షాంశాల దీర్ఘాంశాల వూహా రేఖలమీదుగా ముక్కుకు సూటిగాకాదు. ఎన్ని చుట్టు తిరుగుడు దార్లు తొక్కాడు. ఎన్ని అడ్డంకులు దాటాడు. లండన్‌నించి ఏడెన్, అక్కడనించి బొంబాయి, అట్నించి కలకత్తా, తిరిగి సింగపూర్, సింగపూరునుంచి యోకహామా! ఈ తిరుగుళ్ళు తికమకలూ లేకుండా అతను గనక తిన్నగా 50 అక్షాంశంమీద (లండన్ నగరం ఉన్నరేఖ) సూటిగా ప్రయాణం చేయగలిగి వుంటే అతని భూప్రదక్షిణం 12 వేల మైళ్ళలో తెమిలిపోయేదేకాని రైళ్ళు, ఓడలూ వగైరా ప్రయాణ సాధనాలమీద ఆధారపడక తప్పదు గాబట్టి వాటినిబట్టి పెట్టుకున్న యాత్ర మార్గం 26 వేల మైళ్ళపైచిలుకు తేలింది. అందులో ఇప్పటికి అంటే నవంబరు 23 నాటికి అతను వచ్చిన దూరం కాస్త అటూ యిటూగా 17,500 మైళ్ళు. ఇహ, ఇక్కడినుంచి ఉన్నదంతా సూటి దారే. దానికితోడు ఫిక్స్ కూడా అడ్డంకులు పెట్ట దలచుకోలేదు.

23 వ తేదీన పాస్పార్తు ఇంకో అద్భుతమైన విషయం కనిపెట్టి ఉప్పొంగిపోయాడు. అతనికి యజమాని గొప్పతనంమీద కన్న ఎక్కువగా గురి ఉన్నది ఆదినుంచీ ఉన్నదీ, అతని తాతలనాటి జేబు గడియారంమీద. ఈ ప్రయాణం ఆరంభించింది లగాయతు అతడు లండన్ టైముకు సరిచూసుకు పెట్టుకున్న టైమునే చూసుకు కాలక్షేపం చేస్తున్నాడు. ఆ తరవాత ఏ దేశం వెళ్ళినా టైముం దిద్దుకోలేదు. తన గడియారంతో సరిచూసని గడియారాలు, అవి వున్న దేశాలూ అన్నీ తప్పులని అతని నమ్మకం. ఇన్నాళ్ళకీ రోజున అతని గడియారం ముళ్ళకీ, ఓడ గడియారాలతో ముళ్ళకీ ఏకాభిప్రాయం కుదిరినట్లు కనబడింది. చివరది తనదే రైటు తప్పు వన్నీ తనదారికొచ్చాయి. పాస్పార్తు ఆనందం పట్ట పగ్గాలులేకపోయింది. తన గడియారం తప్పు అని చెప్పిన ఫిక్స్ గనక ఆ వేళకి ఎదురుగాఉంటే ఇది చూపించి చిత్తుచేసేసేవాడే. ఇపుడు అతనేం చెబుతాడో వినాలనిపించింది.

వెధవ. ఎన్ని కబుర్లల్లి చెప్పాడు. తనని బుకాయించడానికి! దీర్ఘాంశాలన్నాడు. మెరిడియన్‌లన్నాడు. సూర్యుడన్నాడు, చంద్రుడన్నాడు. హూ! ఇలాటి వాళ్ళకబుర్లు నమ్ముకుంటే గడియారాల వరస మహా బావుంటుంది. తను అప్పుడే చెప్పాడు. ఏదో ఒక నాటికి అంతగా అయితే ఆ సూర్యుడే దారికివచ్చి తన గడియారంతో జతగట్టి నడుస్తాడని.

పాస్పార్తు ఇటాలియన్ గడియారాలు ఎన్నడూ చూడలేదు. వాటికి మల్లె తన గడియారంపైన 12 గంటలుకాక, 24 గంటలుగా భాగాలు గుర్తించి ఉంటే, తనిలా గర్వపడిందికి ఆస్కారం ఉండేది కాదని అతనికి తెలీదు. అప్పుడు తను ప్రయాణిస్తున్న ఓడమీద ఉదయం 9 గంటలు అయితే, తన గడియారం మాత్రం రాత్రి 9 గంటలు చూపించేది—అంటే 23 వ గంట చూపేదన్నమాట. లండన్‌కీ, ఈ 180 వ దీర్ఘాంశానికీ సరిగ్గా 12 గంటలే తేడా.

ఒకవేళ డిటెక్టివ్ ఫిక్స్, చిత్తైయి పోయి తెల్ల మొగం వెయ్యకుండా, భౌగోళికమైన ఈ కిటుకును బోధపరచ గలిగినా, పాస్పార్తు మాత్రం అది బోధ పరచుకోగలిగేవాడుకాడు. బోధపరచుకొనడం ఎలావున్నా, అసలు ఒప్పుకొనేవాడు. అసలు ఫిక్స్ ఎదురు పడడమే జరిగితే పాస్పార్తు ఈ గడియారాల గోల గురించి మాట్లాడడు. అంతకన్న ముఖ్యమైన అవసరమైన ఇంకో విషయం గురించి ఉపన్యసించేవాడు. అదీ, దాని భాష కూడా ఇంకోలా ఉండేవి.

అయితే ఈ వేళకి ఫిక్స్ ఎక్కడ ఉన్నట్టు? అక్షరాలా పాస్పార్తు ఉన్న ఓడ మీదనే అతనూ తల దాచుకున్నాడు.

యోకహామా చేరాక ఫిలియాస్‌ఫాగ్ పాస్పా

ర్తును వెతకబోగానే, డిటెక్టివ్ ఫిక్స్ నరాసరి ఇంగ్లీష్ కాన్సల్ కార్యాలయానికి వెళ్ళాడు. అరెస్టు వారంటు వచ్చేసింది. వచ్చి తనకోసం కాచుకుంది. బొంబాయినుంచి ఇతనికోసం వెనకాలే వస్తున్న ఆ వారంటు జారీ అయి అప్పటికి 40 రోజులు అయింది. హాంకాంగ్‌లో అతను ఫాగ్ పాస్పార్టులను దొరకనీయకుండా దాచేసి, తనూ వదలివేసిన కర్నాటిక్‌మీదనే ఆ వారంటూ యోకహోమా వచ్చింది. హాంకాంగ్‌లో తను కొంచెం దీన్ని గురించి కనుక్కొనిఉంటే, అప్పుడే ఫాగ్‌ని అరెస్టుచేసి ఉండవచ్చు. ఇప్పుడు ఇది ఉన్నా మానినా ఒకటే. ఇక్కడ ఇది చెల్లదు. ఫాగ్ ఇంగ్లీషు హయాందాటి ఇవతల పడ్డాడు. ఇప్పుడు పట్టుకోవాలంటే ప్రత్యేకం ఎక్స్‌ట్రాడిషన్ ఆర్డర్లు దిగిరావాలి.

సరేకానీ! కానీ అనుకున్నాడు ఫిక్స్. కోపావేశం తమాయించుకుని. ఈ వారంటు ఇక్కడ చెల్లక పోవుగాక, ఇంగ్లాండులో మహారాజులా చెల్లుతుంది గదా. వీడి వాటం చూడగా, పోలీసువాళ్ళ కళ్ళలో పుష్కలంగా దుమ్ముకొట్టేశాంగదా అన్న ధీమా కొద్దీ తిరిగి స్వదేశం వచ్చేటట్టే కనిపిస్తోంది. ఇహనేం. తను ఎలాగా వెంటనంటే ఉంటాడు. బాధగా ఉన్నదల్లా ఒకటే—వీడు డబ్బుని చిత్తం వచ్చినట్టు వెదజల్లేస్తున్నాడు తాతముల్లెలా. ఆడంగి చేరేసరికి అసలేమేనా మిగుల్తుందా అనిపిస్తోంది. ఇప్పటి ప్రయాణ భత్యాలకీ, బహుమతులకూ, కోర్టు కేసులకూ, జరిమానాలకూ, ఏనుగులకు ఇంకా అడ్డమైన వాటికీ వీడు వెదజల్లిన డబ్బూ ఐదువేల పౌండ్లపైచిలుకుంటుంది...."సరే కానీ. బాంకు నిక్షేపం లాటిది. దానికి లోటేమిటి" అనుకున్నాడు ఫిక్స్.

ఇంగ్లాండ్‌కు వెంబడించదలచాడు కాబట్టి, వారంటు జేబులో పెట్టుకుని తిన్నగా తిరిగివచ్చి స్టీమరు ఎక్కి కూర్చున్నాడు డిటెక్టివ్ ఫిక్స్. కొంతసేపు తరవాత ఫిలియాస్ ఫాగ్ అయుదాలు వచ్చారు. వాళ్ళ వెనకే, బ్రహ్మాండమైన వేషం కట్టిన శాల్తీ ఒకటి ఉంది. పాస్పార్టు! ఫిక్స్ గుండె గతుక్కుమంది. ఇప్పుడు తను వాడి ఎదట పడితే ఆనందంతో పలకరించడు. వాడు గొడవ పెడితే తన కథ అడ్డం తిరిగిపోతుంది. అణిగి పడుండడం మంచిదని ఫిక్స్ వెనక్కి తప్పుకుని తిన్నగా తన గదికి వెళ్ళి తల దాచుకున్నాడు. నవంబరు 23 వ తేదీ మాత్రం ఉబుసుపోకకి, వాళ్ళిద్దరికీ డెక్ ముందరి భాగంమీద హటాత్తుగా బేటీ చేసింది. ఫిక్స్ ఉలికిపడి కోలుకునేలోగానే, అతన్నిచూసి పాస్పార్టు ఒక్కసారిగా మీదకు లంఘించి పీక పట్టుకున్నాడు. ఉత్తర క్షణం నించి ఎడతెరిపి లేకుండా ఎడాపెడా కుడీ ఎడమనా డిటెక్టివ్ ఫిక్స్‌ని పిడికిళ్ళు బిగించి కొట్టసాగాడు. ఓడమీద ప్రేక్షకులు చాలామంది పోగయ్యారు. వారిలో అమెరికన్‌లు పందాలు కూడా కాశారు. ఇద్దరిలో ఎవరు గెలుస్తారన్నదానిమీద. అందుకు అట్టేసేపు పట్టనివ్వలేదు. ఇంగ్లీషు బాక్సింగ్ (ముష్టియుద్ధం)మీద ఫ్రెంచి బాక్సింగ్‌దే పైచెయ్యి' అని తేల్చి పారేశాడు పాస్పార్టు.

ఫిక్స్‌ని చిత్తుకింద కొట్టేశాక పాస్పార్టు కోపం తగ్గింది. ఆవేశం చల్లారింది. కొంచెం స్థిమితపడ్డాడు. డిటెక్టివ్ ఫిక్స్ నెమ్మదిగాలేచి నిలబడ్డాడు.

"అయిందా?" అన్నాడు ఇంకా నెమ్మదిగా.

"ఆ. ప్రస్తుతానికిది చాలు."

"అయితే సరే. మీతో కొంచెం మాట్లాడాలి."

"నాతోనా? నే(ను)—"

"మీ యజమాని మేలుకోరి చెబుతున్నా."

డిటెక్టివ్ ఫిక్స్ శాంతం, సాధుత్వంచూసి పూర్తిగా తగ్గిపోయినట్టు తల వంచుకుని అతనివెంట నడిచాడు పాస్పార్టు. ఓడ ముందు భాగాన ఒక చోట కూర్చున్నారిద్దరూ.

"నువ్వు నన్ను కొట్టావు. మంచిదే. సబబే. నేను అనుకున్నదే. దానికేంగాని ఇది విను. ఇంతవరకూ నేను ఫిలియాస్‌ఫాగ్‌కి శత్రువునేకాని ఈ క్షణం నించి ఆయనవేపే" అన్నాడు ఫిక్స్.

"అమ్మయ్య. ఇప్పటికి దారికొచ్చారన్న మాట. ఆయన మర్యాదస్థుడని పెద్ద మనిషి అనీ, ఇప్పటికేనా గురి కుదిరిందా?" అన్నాడు పాస్పార్టు సంతోషంతో.

"కాదు. అదేంకాదు. ఆయన పరమధూర్తుడనే నా నమ్మకం.......ష్....ఆగాగు. తొందరపడకు. నన్ను సాంతం చెప్పనీ. చెప్పేది విను— ఏవిటంటే ఫిలియాస్‌ఫాగ్ ఇంగ్లీషు హయాములోఉన్న దేశాలలో ప్రయాణం చేస్తున్నంత కాలం నాకు అరెస్టు వారెంటు అందేవరకూ, ఆయన్ని ఆపివుంచాలని ప్రయత్నించాను. అందుకోసం నావల్లనైనదంతా చేశాను. బొంబాయిలో పూజారులను పురికొల్పి తరిమించాను. హాంకాంగ్‌లోనీచేత తాగించాను. నిన్నూ, నీ యజమానినీ వేరు చేశాను. ఆయనకి యోకహోమా స్టీమరు అందకుండా చేశాను."

పాస్పార్టుకు తెలియకుండానే అతని పిడికిళ్ళు బిగించుకున్నాయి.

"ఆవేశపడకు.....ఇప్పుడు మీ యజమాని ఇంగ్లాండ్ పోబోతున్నారుగదూ? నేను వస్తాను. కూడానే వస్తాను. ఈ క్షణంనుంచి ప్రయాణంలో ఆయనకి ఏ అడ్డంకులు రాకుండా చూడడం, వచ్చిన వాటిని తొలగించడం—ఇదే నా ఉద్యోగం. ఇదివరకు అడ్డంకులు పెట్టడానికి ఎంత కృషి చేశానో ఇటుపైని వాటిని తప్పించడానికి అన్ని తిప్పలూ పడతాను. నేను ప్లేటుఫిరాయించడానికి కారణం మరేంకాదు. ఇది నాకు అనుకూలమైనది కావడమే. నాకేకాదు. మీవాడు ఇంగ్లాండు త్వరగా చేరడం నీకూ మంచిదే. అతనక్కడ కాలు మోపే వరకూ, నువ్వు ఘరానా వాడిదగ్గిర పని చేస్తున్నావో దొంగకి చాకిరీ చేస్తున్నావో నీకు తెలిసిరాదు."

పాస్పార్టు ఈ ప్రసంగం శ్రద్ధగా స్థిమితంగా విన్నాడు. డిటెక్టివ్ ఫిక్స్ మాయదారి కబుర్లు చెప్పటంలేదని అతనికి తోచింది.

"అయితే మనం ఇకనుంచి స్నేహితులమన్న మాటేనా?" అన్నాడు ఫిక్స్.

జరిగిన కథ

80 రోజులలో భూప్రదక్షిణం సాధ్యమని 20 వేల పౌన్లు పందెం వేసి సేవకుడు పాస్పార్టుతో బయలుదేరతాడు ఫిలియాస్ ఫాగ్. బాంకు దొంగ ఫాగ్ దొరికాడని, అరెస్టుకు బొంబాయికి వారంటు పంపమనీ లండన్‌కు టెలిగ్రామ్ పంపి, ఫాగ్ వెంట సూయజునుంచి బొంబాయికి చేరతాడు డిటెక్టివ్ ఫిక్స్. కాని వారంటు చేరలేదు. బొంబాయినుంచి కలకత్తాకు రైలుబండిలో ప్రయాణం అవుతాడు ఫాగ్. గోథాల్ వద్ద బండి ఆగిపోగా గత్యంతరం లేక ఏనుగుకొని అలహాబాదు వెళ్ళతాడు. దారిలో బలవంతంగా సహగమనానికి పోతూఉన్న అయూదాను రక్షించి ఆమెతో కలకత్తా చేరుకొంటాడు ఫాగ్. అక్కడ వారిని నిలపడానికి ఫిక్స్ చేసిన యత్నం విఫలమైంది. ఫాగ్ ప్రభృతులు 'రంగూన్' ఓడలో పయనం ప్రారంభించారు. ఆ ఓడలోనే ఉన్నాడు ఫిక్స్. ఫాగ్‌ను అరెస్టుచేయడానికి ఛోగట్టా సేకరించాలని పాస్పార్టును చేరదీశాడు. కాని అంతు చిక్కలేదు. లండన్ విడిచిన36 రోజులకు హాంకాంగ్ చేరుకొని, అయూదాతో 'కర్నాటిక్'లో యోకహోమా ప్రయాణానికి ఏర్పాటు చేసుకొన్నారు. కాని ఆ ఓడ తప్పిపోయింది. దానిని షాంగ్‌హైలో అందుకునేందుకు ఫాగ్ "టాంకడియర్" అనే పడవను కుదుర్చుకొని బయలుదేరాడు. పడవ ఫోకియన్ జలసంధి ప్రవేశించాక తుఫాను వచ్చింది. పాస్పార్టు 'కర్నాటిక్'లో అంతకుమునుపే ఎక్కి యోకహోమా చేరతాడు

"స్నేహితులం అనకు.....జతగాళ్ళం. అంటే కలిసి పనిచేస్తాం. తెలిసిందా. ఇదిగో ఈ తరవాత గనక నువ్వు చెప్పిందాంట్లో ఏమైనా భావతు వచ్చిందా మళ్ళీ ఏమైనా పిచ్చిపనులు చేస్తున్నట్టు అనుమానం తగిలిందా అంతే పీక నులిమేస్తాను. సరేనా" అన్నాడు పాస్పార్టు.

"సరే అన్నాడు ఫిక్స్ ముక్తసరిగా.—సరే అనేది పాస్పార్టు షరతులలో పై భాగానికి వర్తిస్తుందని విడిగా చెప్పకుండా.

11 రోజుల తరువాత డిసెంబరు 3 వ తేదీన "జనరల్ గ్రాంట్" గోల్డెన్‌గేట్ అఖాతం ప్రవేశించి, శాన్‌ఫ్రాన్సిస్కో రేవు చేరి లంగరు వేసింది.

పిలియాస్‌ఫాగ్‌కి, గడువులో ఒక్క రోజైనా తగలాలేదు. మిగలాలేదు. ★

హరి వంశము

దీక్షితాయనికి పై ప్రాణములు పైన పోయి నవి. ఆమె తన భయాన్ని, సిగ్గును, భర్తను తాను ఇంతవరకు కనుమొరగి చేస్తున్న మితిమీరిన పుత్ర ప్రేమాన్ని లోపల దాచుకున్నది. పైకి ఇట్లా అన్నది : "స్వామి ! మధ్యాహ్న సంధ్యా సమాగమం ఇది. తీర్థాన్ని అవధరించండి. నిత్యమును ఆచ రించండి. అగ్నికార్యమును తీర్చండి. అభవుణ్ణి పూజించండి. పంచమహా యజ్ఞపరులు కండి. ఇందులో అలస్యం తగదు. స్వామి ! మీకు నేను చెప్పేడి దాననా ! అతిథులైన భూమీసుపర్వులు మొగసాలలో వేచివున్నారు. పక్వాన్నములు, శాకపాకములు చల్లారి పోయిన చవులు తప్పిపోగలవు. ఉంగరం కోసం ఇంత ఆగడం దేనికి ! స్వామి ! దానిని పదిలంగా భరిణలో పెట్టి పెట్టెలో దాచిపెట్టాను. ఇప్పుడు కుడికట్టుకొని ఉన్నదానను. పెట్టె ఎట్లా ముట్టు కుంటాను. అతిథులు, మీరు భోజనము ముగిసిన తర్వాత చూపి యిస్తాను."

ఆ మాటలు విని సోమయాజి మరియు కుపితు డైనాడు. "ఓసి ! సత్పుత్ర జనయిత్రి ! ఓసి సాధ్వి ! ఓసి ! ఆడితప్పనిదాన ! ఓసి ! దేవి ! ఎంత ఒప్పుగా, నిజం పల్కుతున్నావు ! నీ కొడుకు ఎప్పు డైనా స్వాధ్యాయం చదవగా పోయినాడా ! నీవు వాతో పోయినాడని బొంకడం తప్ప ! తెల్లవార గనే తీర్థం ఆడని వానిని, ఆడినాడనటం ఎంత కబబుగా ఉన్నదే ! సంధ్యావార్చని కొడుకుని కప్పి పుచ్చి సంధ్య వార్చినాడని అనడం ఎక్కడ నేర్చు కున్న తెలివితేటలే ! ఎన్నడైనా నీ యీ సుపుత్రుడు అగ్ని వేల్చినాడటే ! ఏమి సోమిదమ్మా దొరికినావే నా ప్రాణమునకు. ఇట్లా అబద్ధములు చెప్పడం వలన ఏమి ఫలము కల్గింది. నీ మాట నమ్మి నేను చెడినాను. నా కొడుకును చెడినాడు. నిజమే తెలిసి ఉంటే, వానిని రక్షించుకొని ఉండేవాడినికదా ! ఇప్పుడు నన్ను భ్రష్టుణ్ణి చేసివావు. నా కొడుకును గూడా భ్రష్టుణ్ణి చేసినావు." సోమయాజి ఆ కోప ములో దుఃఖమును భజించినాడు. ఇంట్లో ఉన్న విలువగల సరుకు లన్నియు కొడుకు జూదములో ఓడిపోయినందుకు ఆయన తెగ విలపించాడు. "సొమ్ములు పోయినవి సరే ! నీ అసంబద్ధ ప్రేమ వలన కులమును నిలుపవలసిన కొడుకు చెడి పోయినాడు. నా గృహాన్ని సర్వమున్నూ నిర్భాగ్యు రాలవు, నీవు పాడుచేసినావు. నీవు నాకు ధర్మపత్నివి. అగ్నిహోత్రార్చనా సహధర్మిణివి. నిన్ను ఏమి చేయ గలను ! చాలు ! ఇంక నీవు కన్న ఆ కొడుకు నాకు వచ్చినవానితో సమానము. వాడు గుణనిధి కాదు. నా కులానికి విషము. తిలలు, దర్భలు తీసుకొనిరా. వానికి ఇప్పుడే నిరాపాంజలులు వదలిపెట్టివేస్తాను. ఓసి ! ఆత్మపత్ని ! కుపుత్రత్వం కంటె, అపు త్రత్వం మేలు. కులపాంసనుడైన వీనిని ఒక్కనిని త్యజించి కులాన్ని రక్షించుకొనడం నీతి."

సోమిదమ్మ నిలువునా నీరైపోయింది. పుత్రు నితోపాటు పతి తన్ను వదలినా వదలగలడు. ఆమె ఆయనను అర్థించింది. "స్వామి ! పుత్రప్రేమం చేత తప్పు చేశాను. ధర్మాన్ని అతిక్రమించి, భ్రష్టుణ్ణి దాచినాను. నన్ను క్షమించండి. నేను నేటినుండి పుత్రునియందైన ఆ ప్రేమను త్రెంచి వేసుకుంటున్నాను"

సోమయాజి శాంతించినాడు. భార్యను చేతుల లోనికి తీసుకున్నాడు.

"ఓసి ! అతిథులు వేచిఉన్నారు. అగ్నికార్యము నకు వేళ మించిపోవుచున్నది. పదపద !"

సోమిదమ్మ హృదయము కుదుటపడినది.

సాందీపనిపర్వం - 13

గుణనిధి యేమో ఇంతకాలము తల్లిప్రేమ ఆధారంగా బ్రతికినవాడు. ఇప్పుడు ఆ ప్రేమ రహి తముకాగా, వాడు దారము తెగిన గాలిపటమువోలె నయిపోయినాడు. వానికి ఇంటిలో తావులేకపోయినది. ఎక్కడికో పోవాలి అనుకున్నాడు! తనవంటి గుణ రహితుని ఆదరించే హితులు ఎవ్వరు? ధనమా, తనకులేదు. విద్యయా తనకు హుళక్కి. మరి ఇంత వరకు వాడు ఒకరికి పెట్ట నేర్చినవాడుగాని, చేయి చాచినవాడుకాదు. అప్పుడు వానికి అనిపించింది. నేను తల్లి దండ్రుల కరదలువిని చదువులు కరచి వున్నట్లయితే ఎంత బాగా వుండివుండేది! ఒక్క విద్యా ధనం తప్ప ఇంకో ధనానికి నిలకడ అంటూ వున్నదా ! ఈ విద్యాధనానికి చోర బాధికముచేత చూరవోవడం అంటూ లేదు. అక్కట ! నేను విద్యా వ్యసనంలో తగులుపడక, ఈ దురోదర వ్యసనంలో ఎందుకు తగులుపడ్డాను! నా అన్వయం ఏమిటి! అక్షర విద్యా అవినయం ఏమిటి ! నా తండ్రులు, తాతలు అందరు మాయజాలురే ! నేను మాత్రము వట్టివాజమ్మనై పోయినాను. గుణ నిధి తన్ను తిట్టుకున్నాడు. తన్ను ఈ విధంగా మార్చిన విధిని తిట్టి పోసినాడు. వానికి ఏమీ తోచలేదు. ఏమీ తోచని రీతిగా వూరంతయు క్రుమ్మరిల్లాడు. ఒకరు తన్ను రమ్మనలేదు. తనకు పట్టెడన్నము పెట్టలేదు. ప్రతిదినము సరిగ్గా ఇంక తెల్లవారక ముందే తన తల్లి తనకు అన్నం కుడువబెట్టేది. అరుణగభస్తిబింబము ఉదయాద్రిపంయిని పొడ తేరగా, గిన్నెలో పెరుగులు, వంటకములు, పడ పిందియలు ఆ తల్లి కుడువబెట్టేది. తల్లి ప్రాణము అట్టిది. అది నిర్భర కరుణాధురీణమైనది. ఇప్పుడు ఇక ఎవ్వరు తనకు అట్లా ఈ త్రితాన్నములు పెడ తారు! గుణ నిధికి ఈ వూరిలో వుండగా ఇక మనస్సు ఒప్పలేదు. వాడు ఆ గ్రామాన్ని వదిలి ఎందేని బయలుదేరిపోయినాడు.

వాని ఆ ప్రయాణం ఒక రాత్రి సాగింది. మరు నాడు ఘుస్రణ కుసుమమాలాకోటి పాటల్య లీలగా కిసలయముల చాయగా, కీరచంచూపుట శ్రీ విస్ర మరస్రమరోర్మావిభ్రమ ప్రౌఢిగా, బినరుణహితుని దీప్తులు ఆకాశంతో పిశంగళత్వాన్ని పొందినాయి. పాట లాంశు జటా భార భాసురుడైన భార్గవుడుపోలె.

రాగ రక్తచ్ఛటానిర్ఝరప్రపూర్ణ చరమ సంధ్యా శమంతకపంచక నదములలో భాస్కరుడు వోల లాడినాడు. ధౌతార కూటకోమలాతపమై వాసరం పలుచబారింది. చరమ సంధ్యాగిరి కిరీట కోటీ రంలో అలంకరించబడిన కొండ గోగుపూవుల గుత్తిని పోని విధంగా సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. అస్తగి రీంద్ర మస్త కన్యస్త ధాతు ధారా ప్రవాహం కరిగి ప్రవహిస్తున్నట్లు సంధ్యారాగం ఆకాశం అంతటా సంచారించుకుంటున్నది. దేవాలయముల అంగణములలో చెట్లకొమ్మలలో పక్షులు కులకులా య మానములై ధ్వనులు చేస్తున్నాయి. అంధక రాక్ష సుని సంహరించినా పరమ శివుని కంఠమూలం దాగికొనివున్న కాలకూటంయొక్క ఛాయనుపోలి అంధకారం బ్రహ్మాండాన్ని ఆవరించుకుంటున్నది. రజనీశుక్త ముక్తాఫలాలు, చుక్కలు పొడుస్తున్నాయి. రేపటి రోజున ఉదయించే సూర్యుని కిరణముల యొక్క ప్రరోహబీజాంకురాలో అన్నట్లు ఇండ్లలో దీపాలు వెల్గుతున్నాయి. గుణనిధికి కొన్ని రోజు లుగా అన్నంలేదు. పేరాకలి పేర్చు కార్చిచ్చుకువలె పెచ్చు పెరుగుతున్నది. కడుపు మండి పోతున్నది. అన్నం ఎక్కడ దొరుకుతుందా అని వాడు అటమ టించిపోతున్నాడు. అవాళ్ల శివరాత్రి. ఆ రాత్రి ఆ గ్రామంలో శైవు డొక్కడు గ్రామ బాహ్య ప్రదేశంలోవున్న శివలింగ స్థానంలో జాగరణ చేసి, నాలుగు జాములు ఉపహారములు సమర్పించు

వాడై, భక్తి విశ్వా సతాత్పర్యంతో నియవ్రతం పూని, బహు శాకములతో బహు పాకములతో బహు భక్ష్య చోష్య లేహ్యములతో బహు వోగిలములతో ఆ శివస్థానం చేరుకున్నాడు. ఆ వంటకములు వాసనలు దిక్కులలో గుబాళిస్తున్నాయి. ఆ పక్వాన్న గంధం నాసికాపుటకుటీ కుటుంబిగా వుంది. గాలి వెరవున ఆ వాసనలు గుణనిధి నాకసిలో ప్రవేశించాయి. వాడు ఆ గంధాన్ని ఆఘ్రాణించాడు. ఆ గంధాన్నిబట్టి శివలింగ స్థానానికివచ్చి చేరుకున్నాడు. శంభు భవన ద్వారంగ్గర కూర్చున్నాడు. లోపల నృత్తగీత వాద్యాలు ప్రవర్తిల్లుతున్నాయి. తనకు ఆకలి వేస్తోంది. ఎంత సేపటి నృత్తగీత వాద్యాలు సర్దుమణగడంలేదు. పొద్దుపోతోంది. తనకు చేసేదిలేదు. తాను గూడా ఆ జాగరం వీక్షిస్తూ కూర్చున్నాడు. అంతలో జాగరం చొక్కు మణగింది. ప్రజలు గూడా చొక్కు మణగారు. గుణనిధికి అప్పుడు వీలు చిక్కింది. కట్టాయి తంబుగా కటిమండలమున తీర్చి దట్టీ చేలను దిండుగా చుట్టాడు. తలుపు కిర్రనకుండగా, కొంచెమైన కీర వాకిటనే తరిమి సందు చేసుకొని తన శరీరాన్ని అందులోంచి లోపలికి చొనిపాడు. చప్పుడుకాకుండా మునివేళ్ళమీద ఒయ్యి నొయ్యిగా నడిచాడు. పూర్తి బిగ్గరగా తీస్తే, ఏమి అవుతుందో అని, గాలిని గూడా బిగపట్టాడు. లోపల దీపం పెద్దదిగాలేదు. కొన చీకటిగా వుంది. ఆ చీకటిలోనే గుణనిధి గుడిలో ప్రవేశించాడు. గర్భ మండపంలో దీపారాధనగా వెల్గించిన కళికలు మసక మసకగా వెల్గుతున్నాయి. గాలికి కదలాడిపోతున్నాయి నిర్వాణదశను వహిస్తున్నట్లు వున్నాయి. గుణనిధి ముందు దీపములు వున్న యెడకు పోయినాడు. ప్రక్కనున్న నేతిపాత్ర అందుకొని ప్రమిదలలో ఆ నేయిని పోసినాడు. దీపకళికలు దీప్తి సంధుక్షములను చేసినాడు. అప్పుడు, గర్భమంటపం తెలివి పడింది. ఎదురుగా క్రింద పళ్లెములతో అపూప సూపములతో అరటి పండ్లతో, ఆజ్యములతో దధిపయః క్షౌద్ర బహు పదార్థములతో ధవళకలమాన్నములతో కలకల్లాడుతూ కన్పించాయి. ఆ పదార్థములను చూచి, కలమాన్నములను చూచి వాడు గ్రుక్కిళ్ళు మ్రింగినాడు. దీప రస్మి మందంగా వుంది. తిరిగి దీపపు ప్రమిదలవద్దకుపోయి తిరిగి ఇంత నేయి ఆ ప్రమిదలలోపోసి, వత్తులను ఎగదోసి, దీపమును పెద్దవిగా చేసినాడు. తిరిగి అన్నపు పళ్లెరములను అన్నింటిని పరిశీలించినాడు ఒక్క పళ్లెం నిండుగా వుంది ఆ అన్నం తాను ఇప్పుడు పెట్టుకుపోతాడు. సుఖంగా ఆరగిస్తాడు. అతనికి ఈ ఆలోచనరాగా, ఒక గాలిపెరవచ్చి, దీపములను ఆర్పివైచినది. గుణనిధి దీపములదగ్గరకు పోయినాడు. ఒక్క వత్తి మిణుకుమిణుగా వెల్గుతున్నది తక్కిన వత్తులు పని చేసెడినట్లు లేవు. ఏమిచెయ్యాలి? తన కట్టుకున్న వస్త్రం అంచును చింపినాడు గుణనిధి. వత్తిగా చేసినాడు. నేతిలో ముంచినాడు. ప్రమిదలో దానిని పెట్టి, వెల్గించినాడు. ఇప్పుడు బాగున్నది. అన్నియు విశదముగా కన్పిస్తున్నాయి. గుణనిధి ఓగిరములు ఉన్న యెడకు పోయినాడు. ఒక్క పక్వాన్న పాత్రాన్ని చేతొ పుచ్చుకున్నాడు. ఆ అన్నాన్ని బహిర్ద్వార భూమిలో భుజించాలని అతని వాంఛ. ఆ వాంఛతో వాడు గుడివెల్వడివస్తూ వున్నాడు. తాను తలచింది ఒకటి. దైవం తలచింది ఒకటి అయింది. గుడిలో చాలామంది నిద్రిస్తున్నారు. వస్తూవుండగా, విధి వశంచేత, గుణనిధికాలు అందులో ఒక్కనికి తగిలింది. వాడు తత్తరపాటుతో లేచాడు. గుణనిధికి భయమైంది. మేను వణికింది. ఆ లేచిన వాడు వానిని చూచి దొంగ, దొంగ అని అరచినాడు. గుణనిధి పరుగు పుచ్చుకున్నాడు. దొంగ, దొంగ అన్న కేకలు తన్ను వెన్ను అంటుతున్నాయి. అతడు భయ విహ్వలుడై పోయినాడు. మరియు పరుగు పెట్టినాడు. అన్నపాత్రం అతని చేతిలోనే ఉంది. దానిని అతడు వదిలిపెట్టలేదు. అతడు దొంగ అనుకుని తలవరులు అతని వెంట పడినారు. అతడు వారికి అందలేదు తలవరులు బాణములు వేసి అతనిని చంపివేశారు.

అతడు చావగా వరుణపాశోగ్రహస్తులై యమభటులు వచ్చారు. వానిని తీసుకొనిపోగా విమానములతో త్ర్యంబకుని కింకరులు వచ్చారు. ఆ వచ్చిన పినాకపాణి భలుపట్టి పత్రిశూల ఖట్వాంగ ప్రముఖ బహువిధ ప్రహరణపాణులు. వారిని చూడగా యముని కింకరులకు భయమైంది. వారిని చూచి యముని కింకరులు కరపంకజములు మొగిడించారు. "అయ్యా! తాము అభవుని కింకరులు. కావున మహాత్ములు. తగవులోనేమి, ధర్మంలో నేమి, పంతంలో నేమి, మీకు అడ్డు వచ్చెడివారు ఈ మూడు లోకాలలోను లేరు. ఇప్పుడు మీ ముందు నిల్వడానికి మేము ఎంతవాళ్ళం. కాని ఇక్కడ ఒక్క విషయం ఉంది. గుణనిధి అనే వీడు కులాచార విహీనుడు, పితృవాక్య పరాఙ్ముఖుడు, సత్యశౌచ్యపరిభ్రష్టుడు, సంధ్యాస్నాన వర్జితుడు. శివనిర్మాల్యహర్త. వీనియందు ధర్మం లేశంకూడా లేదు. వీనిని మాకు వదలండి. కాదు అంటారు. మరి వీని పుణ్యాపుణ్య వివేకం ఏమిటో ఆనతి ఇవ్వండి" అన్నారు.

[గుణనిధి కథ శ్రీనాధుని కాశీఖండము ననుసరించి వ్రాయబడుచున్నది.] ★

న్యూఢిల్లీ లేఖ

(7 వ పేజీ తరువాయి)

అన్నమాట. హిందువులు ధనంతోటే గాక తనువుతోటి కూడా వీరికి రక్షణ కల్పిస్తున్నారు. స్వర్గీయ మవులానా ఆజాద్, హుమయూన్‌కబీర్ ద్వారా సర్దార్ పటేల్‌పై దుమ్మెత్తిపోయించి మహాత్మాగాంధి, పండిట్ నెహ్రూలను గూర్చి అన్యాయంగా మాట్లాడాడు. అయితే కాంగ్రెస్ దృక్పథానికి దగ్గరిగా ముస్లిములను తీసుకువచ్చేందుకని మవులానా సాహెబు చేసిన ఉపన్యాసాల గూర్చి ప్రస్తావన కూడా లేదు. దీనిమీద చరిత్ర నిర్ణయం ఎలా ఉంటుంది ? ముస్లింలీగు అధికారంలోకి రాక పూర్వం కలకత్తాలో ఈద్ ప్రార్థనలకు మవులానాజీ అధ్వర్యం వహించారు. బెంగాలులో ఆయన్ను స్వమతస్థులే తిరస్కరించారు. ఫలితం ఆయన పాత ఢిల్లీలోని కుచాయీ ఖైలాన్‌లో ఉన్న స్వర్గీయ అసఫాలీ గృహంలో తలదాచుకోవాల్సి వచ్చింది. శ్రీ అసఫాలీ కూడా రక్షిత కట్టడంలాంటివాడే.

ఇదంతా పాత కథ. మరి ఈనాడు .... ? దేశంలో మత పక్షాలను నిషేధించాలని కాశ్మీరు ముస్లిం శ్రీ తారిఖ్ కోరుతున్నారు. మలబారులోని ముస్లింలీగు నుంచి మోప్లాలను గాని, బొంబాయి నగరంలో ఉన్న ముస్లిములను గాని ఆకట్టుకొచ్చేందుకు ఆయనొక ఉద్యమాన్ని ఎందుకు నిర్వహించరు ? ఇంతకూ ఆయన చెప్పేదేమంటే మత సంస్థలను నిషేధించటం ద్వారా జాతీయ ముస్లిములుగా చెలామణి అవుతున్నవారి నాయకత్వాన్ని భద్రంగా ఉంచాలని మాత్రమే. తమ ఉద్ధారకుడు స్వర్గీయ ఆజాద్. వీరూ కూడా స్వమతస్థులను తమ దృక్పథంలోకి మార్చుకునేందుకు పిసమంత కృషి చేయటానికికూడా ఇష్టపడరు.

"జాతీయవాదులుగా చెలామణి అవుతున్న ముస్లిములు" అని నేను బుద్ధిపూర్వకంగానే అన్నాను. నిజానికి జాతీయ మతవాదులకు, పచ్చి మతవాదులకు తేడా దాదాపు పూజ్యమనే చెప్పవచ్చు. ఈ ప్రాంతాల్లో అనుకున్నట్లుగా "తేజాసింగ్", జనఖాసింగ్ రెండు పేర్లు ఒక్కరివే. వారిద్దరు సిక్కులే." జాతీయవాదులుగా చెలామణి అవుతున్న ముస్లిములు హిందువుల జాతీయతను ఆసరాగా తీసుకుని, పచ్చి జాతీయవాదుల కంటే ఎక్కువగానే స్వమతస్థులకు తోడ్పడగల్గుతున్నారు. అలీఘర్ విశ్వ విద్యాలయం వ్యవహారమే ఇందుకు నిదర్శనం. ఈ విశ్వవిద్యాలయం వ్యవహారాలను విచారించేందుకు ఒక సంఘాన్ని నియమించారు. అనంతరం శ్రీ పి. ఎన్. సప్రూ సహా మరో ఇద్దర్ని ఈ సంఘ సభ్యులుగా వేశారు. శ్రీ సప్రూను ఈ సంఘంలో వేయటంలో గుట్టు పెరుమాళ్లకెరుక. ఈ సంఘం నివేదిక సమర్పించిందిగాని దాని కింకా వెలుగులోకి వచ్చే భాగ్యం పట్టలేదు.

దేశ విభజనకు పూర్వం మవులానా ఆజాద్‌ను బహిరంగంగా అవమాన పరచింది ఈ విశ్వ విద్యాలయం విద్యార్థులే. పాకిస్తాన్‌లో ఉద్యోగాల కోసం ముస్లింవిద్యార్థులు శిక్షణ పొందుతున్నది ఇక్కడే. ఈ సంగతి యాదాలాపంగా చెప్పానే గాని, ప్రజాధనం దుర్వినియోగ మవుతోందని వచ్చిన ఆరోపణలే ప్రధానంగా చెప్పకోవాలి. కాని కాంగ్రెసువాదులుమటుకు ఈ విషయాన్ని ఎత్తేందుకే సాహసించరేం ? తమను "మతవాదులు"అని ఎక్కడ అనిపోతారో అని వారి భయం. అథవా ఎవరన్నా ప్రస్తావించినా, వారికి కాంగ్రెస్ పార్టీ మద్దతు హుళక్కి. ఇందుకు కారణం, కాంగ్రెస్ మతసంస్థ అని ఎక్కడ పేరు వస్తుందోననే భయం. కాంగ్రెస్ హిందువుల సంస్థ అని స్వర్గీయ జిన్నా అన్నందువల్లనే మహాత్మా గాంధీ పచ్చి ముస్లిం మతవాద సంస్థ జమయుత్—ఉల్—ఉల్—ఇ—మా హింద్ నాయకులతో చేతులు కలిపారు.

* * *

గతవారం భారత మోటారు వాహనాల నిర్మాతల సంఘసమావేశంలో కేంద్ర పరిశ్రమల మంత్రి శ్రీ మనూభాయ్‌షా చేసిన ప్రసంగం లేనిపోని ఆశావాదానికి అవకాశం కల్గించినా, దానిలో కొంత నిజం కూడా లేకపోలేదు. శ్రీ షా యిలా అన్నారు : "యంత్రశక్తితో పనిచేసే రవాణా సదుపాయాలను ఎక్కువమంది ప్రజలకు లభింపచేయాలంటే, దేశంలోని వివిధ వర్గాలవారి కొనుగోలు శక్తికి అనుగుణంగా ఉండే రవాణా సదుపాయాలను అభివృద్ధిపరచటం మన లక్ష్యంగా పెట్టుకోవాలి. ఈ లక్ష్యసాధనకే, స్కూటర్లు, మోటారుసైకిళ్లు, స్వల్పఖరీదు కార్లు తయారు చేసేందుకు ప్రాధాన్యం ఇవ్వటం జరుగుతుంది. వీటివల్ల దేశంలో రవాణావాహనాల ఉత్పత్తి అభివృద్ధిచెందటం ఖాయం. అల్పవ్యయంలో, నాణ్యమైన వాహనాలు తయారు చేయటం అని ఈ లక్ష్యాన్ని నిర్వచించవచ్చు. దీనివల్ల అభివృద్ధి చెందిన ఇతరదేశాల్లో సమన్విత నిర్దుష్ట విధానాల ద్వారా సాధించినట్లుగా మన దేశంలో కూడా, మోటారు వాహనాల తయారీ త్వరితగతిని అభివృద్ధిపరచవచ్చు. ప్రయాణికుల బస్సు రవాణాసదుపాయాలు, అటు ప్రభుత్వంకాని, ఇటు పారిశ్రామికులుకాని వూహించలేనంతగా అన్ని లక్ష్యాలనూ అధిగమించటం మనం చూస్తున్నాము. 1954 లో 2500 బస్సులు తయారు కాగా, 1960 లో 9000 బస్సులు తయారయ్యాయి. 1965 నాటికి వీటి ఉత్పత్తి 20,000 లకు పెరగవచ్చునని ఆశిస్తున్నాం. రవాణా అవసరాలు ఎంతో త్వరితగతిని పెరుగుతున్నాయనటానికి ఇంతకంటే వేరే నిదర్శనం ఏం కావాలి ?"

"మోటారు వాహనాలను, విడిభాగాలను వీలైనంత ఎక్కువగా ఎగుమతి చేయవలసిన ఆవశ్యకతను ప్రత్యేకించి చెప్పనవసరం లేదనుకుంటాను. ఎగుమతి అయ్యే ప్రతి వాహనం వల్ల మనం వెంటనే విదేశీ మారకాన్ని ఆర్జించవచ్చు" అని కూడా శ్రీ షా అన్నారు.

కనుక మోటారు వాహనాల పరిశ్రమ కూడా చక్కెర పరిశ్రమకు నకలు కాబోతుందన్నమాట. చక్కెర ఉత్పత్తిలో స్వయంపోషకత్వాన్ని సాధించేందుకు వినియోగదారులు చక్కెర పరిశ్రమను ఆదుకున్నారు. ఈ చక్కెర నిల్వలు కొల్లలుగా ఉంటే ప్రభుత్వం, పరిశ్రమ విదేశీ మారకాన్ని ఆర్జించేందుకు ఆలోచిస్తున్నారే కానీ, పరిశ్రమను పోషించిన వినియోగదార్ల సంగతి ఎవరికీ పట్టలేదు. అలాగే ఒకవంక కొనుగోలుదార్లు కార్లకోసం బారులుతీరి ఎదురు చూస్తుంటే మంత్రిగారు ఎగుమతులుగూర్చి మాట్లాడుతున్నారు.

ఇహ చక్కెర పరిశ్రమకు సంబంధించినంత వరకు ఎగుమతులను ప్రోత్సహించేందుకు దేశంలో చక్కెర ధరలు పెంచి ధనసహాయం చేయాలని ఆహారమంత్రి శ్రీ ఎస్. కె. పాటిల్ అంటున్నారు. అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థలో ధరలు పెరుగక తప్పదని ఆర్థికశాఖ వేరొక వంక గాలి కబుర్లు చెప్తోంది. చక్కెర విషయంలో వినియోగదారుల ప్రతిఘటన ప్రారంభమైంది. ధరలు పెంచితే చక్కెర నిల్వలు ఇంకా పెరిగిపోతాయి. ఎగుమతులను ప్రోత్సహించేందుకు మోటారు కార్ల ధరలు పెంచితే, పటికిబెల్లానికి వలె స్కూటర్లకు కూడా గిరాకీ పెరుగుతుంది. ★

ఇద్దరు స్నేహితులు ఈ క్రింది విధముగా మాట్లాడుకుంటున్నారు.

మొదటివాడు-'నా గదిలో అయిదు దోమలున్నాయి. అందులో మూడు మొగవి. రెండు ఆడవి."

రెండవవాడు-వాటిని ఆడ, మొగ అని ఏలా నీవు చెప్పగలిగావయ్యా !

మొదటివాడు-మూడు దోమలు సారాసీసాపైనున్నాయి. అందుచేత అవి మగవి. మిగత రెండు దోమలు ముఖంచూచుకునే అద్దంపైనవున్నాయి. అందుచేత అవి ఆడవి.

డి. మణిప్రసాదరావు (చదుము)



శాంతికళావారి "శాంత"లో ఎన్. టి. రామారావు, అంజలీదేవి

<u>సినిమా</u>

గీతా ఫిలిమ్స్‌వారు తమ ద్విభాషా చిత్రం 'ఋష్య శృంగ'' కోసం ఇటీవల ఒక అటవీ దృశ్యాన్ని చిత్రీక రించారు.

తమిళ భాషలో నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలాజీ, తెలుగులో హరనాథ్ ముఖ్య పాత్రలు ధరి స్తున్నారు. ఈ రెండు భాషల చిత్రాల్లోను రాజ సులోచన నాయిక పాత్ర ధరిస్తున్నారు.

తెలుగు భాషాచిత్రంలో మాత్రం రేలంగి, రఘురామయ్య వున్నారు. సూరిబాబు, వంగర, గుమ్మడి, నాగయ్య, గిరిజ, లత మొదలైనవారు రెండు భాషల చిత్రాల్లోను భూమికలు ధరిస్తు న్నారు. ఈ చిత్రానికి కథ, దర్శకత్వం : ముక్కా మల. మాటలు, పాటలు సముద్రాల. సంగీతం : టి. వి. రాజు, ఛాయాగ్రహణం : ఆదిఇరానీ, మెహ్లి ఇరానీ నిర్వహిస్తున్నారు.

మే మాసాంతానికి ఈ చిత్రం విడుదల కావచ్చని తెలుస్తోంది.

*　　*　　*

నాగలోకం సెట్టుపైన నయనోత్సవం కలి గించే నృత్యాన్ని శ్రీకాంత్ ప్రొడక్షన్స్‌వారు చిత్రీక

వార్తా తరంగం

రించారు. అంజలీదేవి ఈ నృత్యం చేశారు. వీరు నిర్మిస్తున్న పౌరాణిక చిత్రం "సతీ సులోచన''లో యన్. టి. రామారావు, కాంతారావు, రాజనాల, చలం, నాగయ్య, సంధ్య మొదలగువారు నటిస్తు న్నారు.

ఈ చిత్రానికి దర్శకులు రజనీకాంత్. నృత్యం: వి. జె. శర్మ. మాటలూ, పాటలూ : సముద్రాల రాఘవాచార్య. సంగీతం : టి. వి. రాజు, ఛాయ : సి. నాగేశ్వరరావు నిర్వహిస్తున్నారు.

*　　*　　*

ఇటీవలనే విజయ—వాహినీ స్టూడియోస్‌లో శ్రీ రామా ఫిలిమ్స్‌వారు తమ "దేశద్రోహులు'' చిత్రంలో ఒక జూదగృహం దృశ్యాన్ని చిత్రీక రించారు. ఈ దృశ్యంలో రాజనాల, రామకృష్ణ, సోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఈ చిత్రంలో యన్. జానకి, యన్. టి. రామా రావు, కాంతారావు, దేవికలు ముఖ్యపాత్రలు ధరిస్తున్నారు.

రాజనాల ఈ చిత్రంలో జూదగాడుగాను, రామ కృష్ణ, సోహన్‌బాబులు ఆ జూదగాండ్ర ముఠాను పట్టుకునేందుకు వజ్రాల వర్తకుల వేషంలో వచ్చిన పోలీసు అధికార్లుగాను నటిస్తున్నారు.

*　　*　　*

డి. బి. యన్. ప్రొడక్షన్స్‌వారు ఇటీవల పెళ్లి పిలుపు చిత్రంలో ఒక నాట్య సన్నివేశం చిత్రీక రించారు. ఈ దృశ్య చిత్రీకరణం వాహినీ స్టూడి యోలలో జరిగింది. ఈ నాట్య సన్నివేశంలో శకుం తల, కళావతి అనే వారు పాల్గొన్నారు. యన్. టి. రామారావు, దేవిక, రేలంగి, గిరిజ, సి. యస్. ఆర్. సూర్యకాంతం, కె. వి. యస్. శర్మ, హేమలత, వై. వి. రాజు, పేకేటి ముఖ్య పాత్రలు ధరిస్తు న్నారు. ఈ చిత్రానికి దర్శకత్వం : ఆమంచర్ల శేషగిరిరావు, సహాయ దర్శకత్వం : పి. కృష్ణం రాజు, రామ్‌చంద్. సంగీతం : ప్రసాదరావు. కథ తూలికాభూషణ్. మాటలు, పాటలు : ఆత్రేయ, ఆరుద్ర, శ్రీ శ్రీ, ఛాయాగ్రహణం : మాధవ్ బుల్‌బులే. నిర్మాత : డి. బి. నారాయణ. మే మధ్య కాలంలో ఈ చిత్రం విడుదల కావచ్చు.

*　　*　　*

శాంతికళావారి సాంఘిక చిత్రం "శాంత" వత్తాక సన్నివేశాన్ని ఇటీవల వీనస్ స్టూడియోస్‌లో చిత్రీకరించారు. ఈ ఘట్టంలో అంజలీదేవి (శాంత) ప్రదర్శించిన ఉద్వేగపూరిత నటన అత్యుత్తమంగా ఉన్నది. విలన్ దురాగతాలకు అతనిని ఆమె దండిస్తున్న సన్నివేశమది.

అది ఒక జూదశాల అక్కడ కుర్చీలు, బల్లలు మొదలైనవన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. అప్పుడే ఏదో కొట్లాట జరిగినట్లు ఇట్టే గ్రహించవచ్చు. కొట్లాట అంతకు మునుపే సెల్యూలాయిడ్ మీదకు ఎక్కింది.

శ్రీనివాస్ (ఎన్. టి. రామారావు) రివాల్వరు సిద్ధంగా ఉంచుకొని విలన్‌కు బుద్ధి చెప్పడానికి గుహాద్వారకు వస్తాడు. కాని విలన్ (గుమ్మడి) తెలివిగా తప్పించుకొని శ్రీనివాసుణి ఒక స్తంభానికి బంధిస్తాడు. ఆ సమయానికి అదృష్టవశాత్తు శ్రీనివాస్ కుమారుడు వేణు (చలం) గుమాస్తా (రేలంగి) అక్కడకు వచ్చి అతనిని రక్షిస్తారు. కొట్లాట జరుగుతుండగా శాంత (శ్రీనివాస్ భార్య) ఒక పెద్ద కర్రతో విలన్ నుదురుమీద కొడుతుంది. అతడు నేలకు ఒరుగుతాడు.

ఉద్వేగంతో రుద్ధమైన స్వరంతో అంజలీదేవి, విలన్ తమ కుటుంబానికి చేసిన ద్రోహాన్ని, అన్యాయాలను ఏకరువు పెడుతుంది. అతనికి పశ్చాత్తాపం కలుగుతుంది. తన దురాగతాలను మర్చిపోయి క్షమించమని శ్రీనివాస్‌ను వేడుకుంటాడు. సరోజ (గిరిజ) తన కూతురేనని తెలుసుకొని, ఆమెను కోడలుగా అంగీకరించవలసిందని అర్థిస్తాడు. సరోజను శాంత పెంచింది. ఈ సంగతి తెలియక విలన్ ఆమెను పెళ్లి చేసుకునే ఉద్దేశంతో అపహరించుకొని పోతాడు. పతాక సన్నివేశంలో ఈ చిక్కులన్నీ విడిపోతాయి.


కృష్ణకుమారి, సూర్యకాంతం, బాలసరస్వతి, కూడా నటిస్తున్న ఈ చిత్రానికి శ్రీ ఎం. అప్పారావు దర్శకత్వం వహిస్తున్నారు. కెమెరా కమల్ ఘోష్. మాటలు సముద్రాల (జూనియర్). రమేష్ నాయుడు సంగీతం సమకూర్చారు. చిత్రం వచ్చే నెలలో విడుదల కావచ్చు.

(58-వ పేజీ చూడండి)

* * *

ఎప్పుడూ ఇంతే—82

శంకర్





కె. ఎ. ఎస్. ప్రొడక్షన్స్ వారి 'మామా భైరవుడు"లో దేవిక

వార్తాభరణం

(58-వ పేజీ తరువాయి)

రామకృష్ణా ప్రొడక్షన్స్‌వారి మొదటి చిత్రం షూటింగ్ వాహినీస్టూడియోస్‌లో చురుకుగా సాగుతోంది. ఇటీవల రాగిణి నాట్యసన్నివేశాన్ని చిత్రీకరించారు. ఈ నాట్యానికి జానకి పాడిన పాటను ఆరుద్ర రచించారు.

అంజలి, ఎన్. టి. రామారావు నాయికా నాయకులుగా నటిస్తున్న ఈ చిత్రంలో గిరిజ, సుమ్మడి, ఛాయాదేవి, ఋష్యేంద్రమణి, కె. వి. ఎస్. శర్మ మొదలయినవారు కూడా పాల్గొంటున్నారు. అప్పుడే 12 రీళ్ళు పూర్తి అయింది. దర్శకుడు శ్రీ వి. మధుసూదనరావు. ఈ చిత్రం కూడా మే నెలలోనే విడుదలవుతుందని తెలిసింది.

* * *

కవితచిత్రావారి తెలుగు సాంఘికం తాలూకు ఒక దృశ్యాన్ని యీ మధ్య విజయ, వాహినీ స్టూడియోస్‌లో తీశారు. కృష్ణకుమారి జట్కాలో వెళుతుండగా, నాగేశ్వరరావు, గిరిజ ఆ వీధిలో ఎదురవుతారు. నాగయ్య, పద్మనాభం, సూర్యకాంతం మొదలైనవారు కూడా నటిస్తున్నారు. ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్నారు. కథ, మాటలు ఆయనే సమకూర్చారు. పాటలు శ్రీశ్రీ, ఆత్రేయ. సంగీతం పెండ్యాల. కెమెరా పి. యల్. రాయ్. చిత్రానికి ఇంకా పేరు పెట్టలేదు.

* * *

శోభా ఫిలిమ్స్ వారి ప్రథమచిత్రం 'తల్లి బిడ్డ' 13 రీళ్ళు పూర్తి అయింది. నిర్మాత శ్రీ ఎం. ఆర్. యడవల్లి స్వయంగా కథా, మాటలు, పాటలు వ్రాస్తున్నారు.

ఈ చిత్రం తాలూకు ఒక సన్నివేశాన్ని ఈమధ్య చిత్రీకరించారు. అది జన్మదినోత్సవ దృశ్యం. బాలయ్య పియానో వాయిస్తుంటే, కృష్ణకుమారి వింటూ వుంటుంది. ఎందరో యువకళాకారులు యీ సన్నివేశంలో పాల్గొన్నారు.

చిత్రంలో నాగయ్య, హరనాథ్, హేమలత, లింగమూర్తి, రాజశ్రీ, మీనాకుమారి, పేకేటి కూడా నటిస్తున్నారు. పి. యస్. శ్రీనివాసరావు దర్శకత్వం వహిస్తున్నారు. ★

రాగరేఖలు

(10-పేజీ తరువాయి)

లింది. అన్నయ్య అసలే వినలేదు.

"అయితే నీ పట్టు విడవవన్నమాట. అలా అయితే ఇక నీకు నాకు సంబంధములేదు. నీవు నా తమ్ముడివి కావనుకుంటాను" అంటూ వెళ్ళి పోయాడు. తన అభిమానం దెబ్బతింది. ఏమి చేయ డానికి తోచక వెంటనే ఆ రాత్రి పట్నం వచ్చే శాడు

మనశ్శాంతికోసం అటూ ఇటూ తిరిగాడు. మనస్సులో వెయ్యి ఆలోచనలు. సినిమాకు వెళ్ళితే నన్నా మనస్సు ప్రశాంతంగా వుంటుందని సినిమా కేసి వెళ్ళాడు. త్రోవలో ఇందిర ఎదురైంది.

"ఇదేమి శేఖర్. ఎప్పుడు రావడం ఇంటినుంచి. అంతా కులాసాయేనా! అలా వున్నావేం. పద రూంకి".

"ఆ ఏంలేదు. కొన్ని పనుండి నిన్ననే వచ్చాను" అంటూ ఆమెవెంట నడవసాగాడు

ఆమె తనను రూంకి తీసుకెళ్ళి నెమ్మదిగా అన్ని విషయాలు తెలుసుకుంది.

"ఎంత పని చేశావ్ శేఖర్! నాకోసం నా జీవితంలో ఇంతేరాసివుంది కాబోలు. అనవసరంగా మీ వాళ్ళతో గొడవ పెట్టుకున్నావు" అంది ఇందిర.

"ఏం చేయను ఇందిరా! నాకా క్షణంలో ఏమీ తోచలేదు. తెగించి ఇలా వచ్చేశాను అంతే" అన్నాడు తను.

"ఇప్పటికైనా మించిపోయింది ఏమీలేదు శేఖర్. వెంటనేవెళ్ళి మీ వాళ్ళు నిశ్చయించిన సంబంధం ఒప్పుకో" అంది ఇందిర.

తను ఆశ్చర్యపోయాడు. "ఏం నేనంటే నీ కిష్టంలేదా ఇందిరా! అలా మాట్లాడతావేం" అన్నాడు తను.

"అదికాదు శేఖర్. అనవసరంగా మీ వాళ్ళతో ఈ గొడవ ఎందుకా అని" అంది ఇందిర.

"ఏదీ కాదు. నా నిశ్చయం ఇక మారదు ఏలా జరగాల్సివుంటే అలా జరుగుతుంది. ఇక ఆ విషయం యెత్తకు ఇందిరా!" అన్నాడు తను.

తనను మార్చడం ఎవరితరంకాదు అనుకుంది కాబోలు ఇందిర మౌనంగా వుండిపోయింది.

ఆ మర్నాడు తనకు ఇందిరకు రిజిస్ట్రారు ఆఫీ సులో చట్టబద్ధంగా పెళ్లి జరిగింది. అంతా తమిద్దర్ని పొగిడారు, మెచ్చుకున్నారు, శ్లాఘిం చారు. సంఘ సంస్కారి అన్నారు. నీలాంటివారు ఇంకా కొంతమందిఉంటే మనదేశం ఎప్పుడో బాగు పడిపోవునన్నారు. తమ ఫోటోలు పేపర్లో పడ్డాయి. మిత్రులు మంచి పనిచేశావన్నారు. పరిచయస్థులు ప్రశంసించారు. అదొక బంగారుకల, తీయని గాధ తా మిద్దరి జీవితంలో అనురాగ రేఖలు.

మళ్లీ కాలేజి తెరిచారు. తనకో పెద్ద సమస్య ఎదురైంది. అన్నయ్య డబ్బు పంపడు. అడగ టానికి తనకు అభిమానం అడ్డు వచ్చింది. ఇద్దరి జీవితాలు పోషించాలి అన్నదే చిక్కుగా పరిణమిం చింది తనకి.

అదృష్టవశాత్తు ఆ కాలేజీలో ఓ లెక్చరరు పదవి

రాగరేఖలు

నికి అదృష్టదేవత ఇందిరనే వరించింది. ఫలితంగా ఇందిర లెక్చరర్ అయింది ఎన్నో ఉద్యోగాలకు అప్లయి చేశాడు. ఏదీ దొరకలేదు. ఈ ఏడాది గడుస్తే తన చదువుకో రూపం ఏర్పడుతుంది. తన జీవితానికో బాట ఏర్పడుతుంది కాని చదవడమేలా. అన్నయ్యకు డబ్బుకు ఉత్తరం రాయాలనిపించింది. కాని వెంటనే ఆ ప్రయత్నం విరమించుకున్నాడు ఇందిర తన అవస్థ గమనించింది కాలేజిలో చదవమంది. కాని తను తన భార్య సంపాదించిన డబ్బుతో చదవడమంటే అతి హేయంగా కనిపించింది. సంఘం తనని వేలెట్టి చూపుతుందనుకున్నాడు.

"వద్దు ఇందిరా! నాకేదో ఉద్యోగం దొరకక పోదులే" అన్నాడు తను.

"మరేం అనుకోకు శేఖర్. ఈ ఒక్క ఏడాది గడుస్తే మన జీవితాలు ఓ తెరిపిన పడతాయి. సంఘానికి భయపడి మనం ఏపనీ చేయలేం చదువు" అంటూ బలవంతం చేసింది ఇందిర.

చూస్తుండగానే రోజులు, వారాలుగా వారాలు మాసాలుగా మాసాలు సంవత్సరాలుగా గడిచాయి. తను మొదటివాడుగా ఉత్తీర్ణుడయ్యాడు. తనకు ఆ కాలేజీలోనే ఉద్యోగం దొరికింది

కాలచక్రం ముందుకు సాగిపోతూవుంది. తమ జీవితాలు సాఫీగా నడుస్తున్నాయి అప్పుడప్పుడు వదిన ఉత్తరాలు రాసేది—అన్నయ్యకి శరీరం బాగుండడంలేదని. ఓరోజు హఠాత్తుగా టెలిగ్రాం వచ్చింది వదిన దగ్గరనుండి అన్నయ్యకు తీవ్రంగా వుందని వెళ్దామా వద్దా అని ఆలోచిస్తున్నాడు తను "వెంటనే వెళ్దాం పదండి" అంటూ ఇందిర బలవంతం చేసింది. వెంటనే ఇందిరతో సహా తమ వూరికి వచ్చేశారు.

అన్నయ్య శరీరం ఏం బాగులేదు మనిషి నీరసించి పోయాడు. ఇందిర చదువుకున్నది కాబట్టి అన్ని విషయాలు తెలుసు కావున క్రమబద్ధంగా అన్ని పరిచర్యలు చేయసాగింది. ఇందిర పరిచర్యలమూలంగా త్వరలోనే కోలుకున్నాడు అన్నయ్య. ఇందిర గుణ గణాలనుచూసి, ఆమె ప్రవర్తనచూసి సంతోష పడ్డాడు అన్నయ్య ఆనందంగా ఇందిరను తనను ఆశీర్వదించాడు. ఆరోజే శాస్త్రయుక్తంగా వచ్చిన పెండ్లి పందిట్లో జరిగింది తమ పెళ్ళి. అన్నయ్య వదినల కళ్ళలో ఆనందబాష్పాలు తమిద్దరి జీవితాల్లో రాగ రేఖలు వెంటనే బయలుదేరిపోయారు పట్నానికి డ్యూటీలోకి జీవితం సాఫీగా, హాయిగా, సంతోషంగా దొర్లిపోతోంది

వరండాలో లైటార్పేసి శేఖర్ దగ్గరకువచ్చి ఏమండీ! ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నారు అని అడిగింది ఇందిర

"ఆ నిన్ను గురించేలే" అన్నాడు కొంటెగా శేఖర్ "అలాగేం" అంటూ సిగ్గుతో చిలిపిగా నవ్వుతూ తలవంచుకుంది ఇందిర. నిండు చంద్రుడు ఫక్కుమన్నాడు జవాబుగా ఆమె తలలోని మల్లెలు విచ్చుకున్నాయి అప్రయత్నంగా శేఖర్ నోటినుండి నండూరివారి


"యెనక జల్మంలోన యెవరమో మనమంటి

పిల్ల మొదలు

పెద్ద వరకూ కుటుంబములో అందరూ చెప్పేది వినండి...



వాటర్‌బరీస్ కాంపౌండ్ యొక్క పేరుగాంచిన ఔషధముల కలయిక యిప్పుడు ఆరోగ్యము చేకూర్చే విటమినులు చేర్చబడి యింకా శక్తివంతము చేయబడినది. అందువలన ఇది యిప్పుడు కుటుంబములో అందరికీ పూర్తియైన టానిక్ అయినది. ఇది పిల్లలకు ఎంతో మంచిది—స్నాయువులు బాగు అగుటకు మరియు మళ్లీ పెరుగుటకు యిది కావలసిన పదార్థము అందచేస్తుంది. దిట్టమైన ఎముకలు మరియు పళ్లువచ్చేలా చేస్తుంది. పనిచేసే పెద్దవారికి వారు కోల్పోయిన శక్తిని మరియు చురుకుదనమును తిరిగి యిస్తుంది మరియు నరములను బలపరుస్తుంది. ముసలివారికి వారి బలహీనమైన కండరములను బాగుచేయుటలో, పోయిన ఆకలిని మరల కలిగించుటలో మరియు రక్తమును వృద్ధిచేయుటలో పనిచేస్తుంది. జబ్బుపడి లేచిన వారిని త్వరలో ఆరోగ్యమును కోలుకొనేలా చేస్తుంది. వాటర్‌బరీస్ విటమిన్ కాంపౌండ్ పిన్నా పెద్దా అందరికీ బాగుగా గుణము కలిగిస్తుంది.



వాటర్‌బరీస్
విటమిన్
కాంపౌండ్

మీకు శక్తి ఉత్సాహముల నిచ్చును










ఈ రకముది కూడ లభిస్తోంది: క్రిసోట్ మరియు గ్వైకాల్‌తో కూడిన వాటర్‌బరీస్ కాంపౌండ్ ఎఱ్ఱ లేబిల్‌గల సీసాలో కూడ లభించుచున్నది. ఇది దగ్గుజబుబులకు ఉత్తమమైన టానిక్.

వార్నర్ లేంబర్ట్ ఫార్మస్యూటికల్ కంపెనీ
(పరిమితమైన బాధ్యతతో యు.ఎస్.ఎ.లో స్థాపింపబడినది)

WVC 161

గళ్లనుడికట్టు—50



అడ్డం

1 చేదు చూడరు.

3 వెదికి—పోయారంటారు!

5 'సామవేదికన్న'లో ఎత్తైన సూచన.

7 ఆషా—గా, ఎలా?

8 సారంగ మృగంలో జాగ్రత్తగా వెతికితే సముద్రం.

9. ఆ మునిసిగతరగకముందే నవ్వును సూచించే దానిలో సగం.

11. అలకపాన్పుపరే, ముందు తరంగమేది?

12. ఇష్టమయితే వదు! ఒకసారి చూద్దాం.

14 వలక తిరగవేసి వ్రాయండి.

15 చిలుకరించిన దానిలో పక్షి.

17 కలగాపులగమయిన ముద్దు.

18 చాలిక, వెళ్ళండి! మా బట్టలుదికే మనిషి రావాలి.

19. అటునుంచి వాలికి కావలసిన అక్షరాలతో ఇంటి ముందుది చూడండి.

20 మధుర మధ్యమారిన స్త్రీ.

21 పూపిరికిముందు తీసి భయపడండి.

23 రవికనగా సూర్యునికి కాదు!

25. రాముడి చివరబంధం.


26 పీరు పారేది.

27. అమలమయిన దానిలో కొండ.

29. బిడ్డు! మిత్రభావమా?

30. ఆవరించకుండా గింజ చూడండి.

49-వ గళ్లనుడికట్టుకు జవాబు



నిలువు

31. స్నేహము!

32. ఆట ముక్కలో ఒత్తుతీసి తగ్గిస్తే వాయించ వస్తు.

33. ఇతరుల పత్రమా, మర్చిపోవడానికి!

2. వెక్కడం అంటారు.

4. బింకలు.

6 రోజువదిమునుపే ఉన్నది.

7. తోడి మాలికన్నా దండ తథ్యం!

10 తడిసినది.

11. పాని.

13. బంధుమిత్ర—

15. పిలిచి తిప్పివేయండి అల్లరిగా ఉంటుంది!

16. ఈ యుగానికి స్త్రీ యా?

20. భూమికి మ చేరిస్తే ప్రభావమే.

22 పట్టిచేయి

24. పడకమవిఇస్తే తలక్రిందులుగా పాత్ర చేశారుట!

28 వేళావిశేషము, ముహూర్తము కలిసినవి.

30. ఆ పరాపరిపోయి సహాయం కోరండి.

ఇద్దరు వ్యక్తులు నూతిలో నుండి తాబేలునుతీసి దానిని చంపాలని చిప్పమీద కొడుతుండగా ఒక సన్యాసి వారి వద్దకు వచ్చాడు.

వ్యక్తులు:— అయ్యా; దీనిని చంపుటకు ఏదైన ఉపాయము చెప్పండి.

సన్యాసి:— మేము సమస్త భూతములయందు దయగల సన్యాసులము. జంతు వధను గూర్చి ఉపాయము చెప్పగూడదు. కాని యీ తాబేలును వెల్లకిలవేసి పొడవుము.

ఆర్. రత్నశేఖర్ (జగత్యాల)

పొట్టికథలు

ఒక పెద్దమనిషి ఒకసారి గుఱ్ఱంమీద ప్రయాణం చేస్తూ, ఒక చోట ఆగి, ఆ దారిన పోతున్న అబ్బాయిని పిలచి, చూడు అబ్బాయ్ నేనలా వెళ్ళివచ్చేవరకు ఈ గుఱ్ఱాన్ని పట్టుకో అని కళ్లెం చేతికిచ్చాడు.

అబ్బాయి—ఈ గుఱ్ఱం తన్నుతుందా?

పె. మ.—తన్నదు.

అబ్బాయి:కరిగెడుతుందా?

పె. మ.—కరిగెత్తదు.

అబ్బాయి—మరి పారిపోతుందా?

పె. మ.—పారిపోదు.

అబ్బాయి—అయితే ఇక పట్టుకోవటం దేనికి?

మలిశెట్టి నాగేశ్వరరావు (పిఠాపురం)

* * *

ఉపా—ఒరేయి గోపీ పద్యములో దండాన్వయమంటే ఏమిటిరా?

గోపీ—మేష్టారూ దండమనగా గద. అందువలన దండాన్వయమంటే ఇలా అడ్డంగా ఉన్న నాలుగు వరసల పద్యాన్ని నిలువునా కఱ్ఱ మాదిరి రాయడం కదండీ?

వప్పు బాబ్జీ (కోయంబత్తూరు)

* * *

భార్య—ఎంత సేపూ నా ఇల్లూ, నా ఉద్యోగం, నా డబ్బు అనటమేగాని ఒక్కసారైనా 'మన' అన్న పాపాన పోరేం? చెప్పేది విన్పించుకోకుండా ఏమిటా వెతకటం? ఏం కావాలి!


భర్త—మన లుంగీ?

సి. భాస్కరరావు (కొలనుకొండ)



సిక్కిం ప్రజలు నాట్యసమయంలో ధరించే ముఖ ఆహార్యం

ఫొటో—శ్రీధర రామకృష్ణమూర్తి


నేడే చూడండి!
మహేంద్రా పిక్చర్సు
కృష్ణప్రేమ
నిర్మాత
ముచ్చర్ల వెంకటరామదాసు.
డైరెక్షన్
ఆదుర్తి.
మ్యూజిక్
పెండ్యాల.
(శ్రీ ఫిలిమ్సు) రిలీజ్
REVATHI